www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 25-2-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 328 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా 8.37 తదుపరి విదియ; నక్షత్రం: పుబ్బ రా. 1.25 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.7.22-9.10; దుర్ముహూర్తం: సా.4.44-5.31; అమృతఘడియలు: సా.6.11-8.00; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.17 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి

ఉత్తర్వులు జారీ.. వనపర్తి నియోజకవర్గానికి రెండోసారి పదవి



మహబూబ్‌నగర్/హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నేతగా ఉన్న ఆయనకు గత అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గం నుంచి రెండో జాబితాలో టికెట్ వచ్చింది. అయితే, మూడో జాబితాలో చిన్నారెడ్డి స్థానంలో ప్రస్తుత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి అవకాశం కల్పించారు. చిన్నారెడ్డికి ఎమ్మెల్సీ లేదా ఎంపీ పదవి ఇస్తామని అప్పట్లోనే పార్టీ నుంచి

మిగతా 13వ పేజీలో...

ఎలాంటి వివాదాలు, చిక్కులు లేకుండా భూ రికార్డులను నిర్వహించాలి. అందుకు అవసరమైన పరిష్కారాలను అన్వేషించాలి. ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలతో ఇప్పుడున్న లోపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు కొత్త సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలి. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో సాధ్యమైన వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి.

- ధరణి కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ ఆదేశాలు



ఈశ్వరీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి జూపల్లి, మాజీ మంత్రి గీతారెడ్డి

ధరణి దరఖాస్తులకు మోక్షం

- మార్చిలో తహసీల్దార్ ఆఫీసుల్లో హెల్ప్ డెస్క్‌లు
- 2.45 లక్షలపైగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన
- అప్రూవ్, రిజెక్ట్ చేసినా రిపోర్టులు తప్పనిసరి
- ధరణి కమిటీ సూచనతో పరిష్కారానికి మార్గాలు
- తుది నివేదిక ప్రకారం చట్టసవరణ లేదా కొత్తచట్టం
- 'ధరణి'ని నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మార్చి తొలివారంలోనే అన్ని మండలాల్లోని తహసీల్దార్ ఆఫీసుల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ధరణి కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకొని, పెండింగ్‌లో ఉన్న 2.45లక్షల దరఖాస్తుల పరిష్కారానికి విధి విధానాలు రూపొందించాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా దరఖాస్తులను పరిష్కరించేందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని అన్నారు. ధరణిపై ఏర్పాటు చేసిన కమిటీతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధరణి కమిటీ పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకొచ్చింది. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్వోఆర్ చట్టంలోనే లోపాలున్నాయని నివేదించింది. అప్పట్లో కేవలం మూడు నెలల్లో హడావుడిగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల నవీకరణతోనే కొత్త చిక్కులు వచ్చాయని వెల్లడించింది. ఆ రికార్డులనే ప్రభుత్వం ప్రామాణికంగా

మిగతా 13వ పేజీలో...

317, 46 జీవోలపై మంత్రివర్గ ఉప సంఘం

- చైర్మన్‌గా వైద్య ఆరోగ్య మంత్రి రాజనర్సింహ
- సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం
- అధ్యయనం చేసి నివేదికకు ఆదేశాలు

13

ధాన్యం టెండరు రేటు రూ. 2,111

- గతం కంటే క్వింటాకు 378 చొప్పున అధికం
- 'యాసంగి' టెండర్లలో ప్రభుత్వం ఆశించిన ధర సన్నాలు క్వింటా 2400
- తక్షణం రూ.7,385 కోట్ల ఆదాయం

2

బీఆర్‌ఎస్ ఉంటేనే..!

బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకోకూడదని బీజేపీ అగ్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో వాతావరణం తమకు అనుకూలంగా ఉందని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను దెబ్బతీయగలిగితే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగవచ్చునన్నది వారి ఆలోచన.

బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నిజంగా దెబ్బతింటే దాని ప్రభావం ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్‌పైన కూడా పడుతుంది. బీఆర్‌ఎస్ దెబ్బ తింటే బీజేపీని ఎదుర్కోవడం రేవంత్ ప్రభుత్వానికి అంత ఈజీ కాదు. బీజేపీతో పాటు బీఆర్‌ఎస్ కూడా ఎంతో కొంత బలంగా నిలబడటం కాంగ్రెస్‌కు అవసరం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తమకు ఢోకా లేదన్న భరోసాతో ఉండింది. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో బీజేపీ బలహీనపడటంతో బీఆర్‌ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ తన ఉనికిని కోల్పోకుండా మనగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా కవచంలా ఉపయోగపడుతుంది.



కొత్త పలుకు!

తాజా సర్వేల ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రథమ, బీజేపీ ద్వితీయ, బీఆర్‌ఎస్ తృతీయ స్థానాల్లో ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పక్కచూపులు చూడకుండా కట్టడి చేయడం కేసీఆర్‌కు శక్తికి మించిన పనే. ఏ కారణం వల్లనైనా ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్‌కు చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిక్కులు తప్పవు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుదురుగా ఉండనిస్తారని భావించలేం. చండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా ఏం జరిగిందో చూశాం.

4

విలువలతో కూడిన రాజకీయాలకు ఇవి రోజులు కావు. ప్రధాని మోదీ కూడా నైతికత కంటే గెలుపునకే ప్రాధాన్యత ఇస్తారని అనేక సందర్భాలలో రుజువైంది.

రేవంత్ ప్రభుత్వాన్ని పూర్తి కాలం అధికారంలో కొనసాగనిస్తారా? అన్న సందేహం పలువురిలో ఏర్పడింది. సీఎం రేవంత్‌కు కూడా ఏమి జరుగుతున్నదో తెలుసు. బీజేపీ నుంచి ఎదురుకాబోతున్న ప్రమాదం నుంచి బయటపడేందుకు రేవంత్ ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. బీజేపీ నుంచి ఇటు అధికార పక్షం, అటు ప్రధాన ప్రతిపక్షం ముప్పును ఎదుర్కోవలసి రావడం మోదీ మహిమే అని చెప్పుకోవలసి ఉంటుంది.

ఏపీలో టీడీపీ, జనసేనతో చేతులు కలుపుతామని చెప్పి 15 రోజులు దాటినా బీజేపీ నుంచి స్పందన లేకపోవడం అనేక ఊహాగానాలకు తావిస్తున్నది. జగన్ కోరికను మన్నించి ఈ 2 పార్టీలతో పొత్తుకు మోదీ విముఖత వ్యక్తం చేస్తారా? అన్న అనుమానం ఆయా పార్టీల నాయకుల్లో వ్యక్తమవుతోంది. రేపో మాపో కబురు చేస్తామంటూ పక్షం రోజులు గడచినా బీజేపీ నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించాయి.

జనం నెత్తి మీద కూర్చొని 'మీ సేవకుడిని' అని గొప్పలు పోగలిగేవాడు, ఇల్లు గుల్ల చేస్తూ 'మీ సేవకుడిని' అని మభ్యపెట్టగలిగేవాడు, చేతికీ నోటికీ తాళం వేసి ఎంత స్వేచ్ఛ అనుభవిస్తున్నావో చూడు అని నమ్మించగలిగేవాడు, కొంపకు నిప్పు పెట్టి చలిమంట వేశాను - చలి కాచుకోమని బురిడీ కొట్టించగలవాడు ఎవరైనా ఉన్నారంటే అది ఏపీ సీఎం జగన్ రెడ్డి మాత్రమే. ఆయన నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నందుకు మీడియాపై కత్తిగట్టారు. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను దారుణంగా హింసించారు. ఏది ఏమైనా మీడియాపై మీ ఉన్మాద మూకలు చేయబోయే దాడులను ఎదుర్కోవడానికి మేం కూడా సిద్ధం. నియంతృత్వ పోకడలను, కపట విన్యాసాలను మేం ప్రశ్నిస్తూనే ఉంటాం!



అభ్యర్థుల జాబితా విడుదల సందర్భంగా పవన్‌కల్యాణ్, చంద్రబాబు

ఏపీలో జనసేనకు 24 అసెంబ్లీ, 3 ఎంపీ

- 99 మంది అసెంబ్లీ అభ్యర్థులతో టీడీపీ, జనసేన తొలి జాబితా
- 94 మంది టీడీపీ, ఐదుగురు జనసేన అభ్యర్థుల పేర్ల ప్రకటన
- ఏపీ కోసం కలిసివస్తున్నాం.. ప్రజలే గెలిపించుకోవాలి: బాబు
- బీజేపీకి 4 అసెంబ్లీ, 4 లోక్‌సభ సీట్లు కేటాయించే చాన్స్?

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ, జనసేన అధిపతులు తొలి విడత 'గెలుపు గుర్రాల'తో సై అన్నారు. ఎన్నికల షెడ్యూలు విడుదల కంటే ముందే.. ఒకే రోజు, ఒకే విడతలో 99 అసెంబ్లీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. వీరిలో 94 మంది టీడీపీ అభ్యర్థులు.. ఐదుగురు జనసేన అభ్యర్థులు! పొత్తుల్లో భాగంగా జనసేనకు 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కూటమిలో కలవాలని భావిస్తున్న బీజేపీకి 4 లోక్‌సభ, 4 అసెంబ్లీ స్థానాలు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. ఒకటీ అరపేర్లతో, అది కూడా 'మీరు అభ్యర్థులు కాదు.. సమన్వయకర్తలు మాత్రమే' అని అధికార

మిగతా 12వ పేజీలో...

ఆర్‌ఆర్‌ఆర్ చకచకా!

ప్రత్యేక చొరవ చూపుతున్న రాష్ట్ర ప్రభుత్వం



- భూ పరిహారంలో వాటా చెల్లించేందుకు సిద్ధం
- నాబార్డు రుణంతో ఇచ్చే యోచన
- 347 కిలోమీటర్ల మేర నిర్మాణం
- రూ.30 వేల కోట్ల ఖర్చు అంచనా
- ఉత్తర, దక్షిణ భాగాలకు 4,500 హెక్టార్ల భూ సేకరణ
- ఈ ఏడాది సేకరణ పూర్తయితే మూడేళ్లలో రోడ్డు అందుబాటులోకి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ పనులకు గ్రహణం వీడింది. కాంగ్రెస్ సర్కారు చొరవ, పట్టుదలతో పనులు వేగవంతం కానున్నాయి. ఇప్పటికే ఉత్తర భాగం యుటిలిటీ చార్జీల చెల్లింపు అంశానికి తెరపడగా, దక్షిణ భాగం రోడ్డుకు జాతీయ రహదారి నంబర్‌ను కేటాయించేందుకు కేంద్రం పచ్చజెండా ఊపడం తెలిసిందే. దీంతో రెండు భాగాలుగా మొత్తం 347 కిలోమీటర్ల దూరంతో నిర్మించబోయే రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి దాదాపు రూ.30 వేల కోట్ల మేర నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రహదారి కోసం సుమారు 4,500 హెక్టార్ల భూమి అవసరమవుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే ఉత్తర భాగం నిర్మాణానికి అవసరమైన భూమి, భూ పరిహారం, నిర్మాణ ఖర్చు విషయంలో ఒక అంచనాకు వచ్చినప్పటికీ.. తాజాగా దక్షిణ భాగం రహదారి నిర్మాణ ప్రతిపాదనలు పంపాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ జాతీయ రహదారుల సంస్థ అధికారులను ఆదేశించారు. దీంతో రెండు భాగాల్లో నిర్మాణమయ్యే రింగ్ రోడ్డు మొత్తానికి సంబంధించిన అన్ని వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఉత్తర భాగం డీపీఆర్ గతంలోనే ఉండడంతో.. ప్రస్తుతం దక్షిణ భాగానికి సంబంధించిన డీపీఆర్ పనులను అధికారులు ముమ్మరంగా చేస్తున్నారు. కాగా, ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంపై కృతనిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఎట్టి పరిస్థితుల్లోనూ పనుల్లో జాప్యం జరగకూడదని భావిస్తోంది. అందుకు అవసరమైన ఆర్థిక

మిగతా 13వ పేజీలో...



సహకార రంగంలో వివిధ పథకాల ప్రారంభోత్సవంలో మోదీ, షా పరస్పర అభివాదం

ధాన్యం నిల్వకు 1.25 లక్షల కోట్లు

- ప్రపంచంలోనే అతిపెద్ద పథకం
- ఢిల్లీ నుంచి ప్రారంభించిన ప్రధాని మోదీ
- వచ్చే ఐదేళ్లలో సహకార రంగంలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం సృష్టి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: దేశంలోని రైతన్నలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యం నిల్వ పథకాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో వేలాది గోదాములు, గిడ్డంగులను నిర్మించడం ద్వారా సహకార రంగంలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించనున్నట్టు శనివారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం రూ.1.25 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. 11 రాష్ట్రాల్లో 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఏర్పాటు చేసిన 11 గోదాములను ఆయన ప్రారంభించారు. అలాగే మరో 500 పీఏసీఎస్‌లలో గోదాములు, ఇతర వ్యవసాయ మౌలిక సదుపాయాల

మిగతా 14వ పేజీలో...



13

500కే వంటగ్యాస్ పథకానికి రూ.80 కోట్లు విడుదల

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

యూసీసీపై అసోం ముందడుగు

- ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం రద్దు.. కేబినెట్ ఆమోదముద్ర
- అసెంబ్లీ సమావేశాల్లో బిల్లుకు అవకాశం
- ప్రభుత్వ నిర్ణయంపై విపక్షాల ఆగ్రహం

14

జాతర జబర్దస్తే!

మేడారానికి కోటిన్నర మంది భక్తులు


- గద్దెల నుంచి నిజస్థలాలకు వనదేవతలు
- ముగిసిన నాలుగు రోజుల మహాజాతర
- తల్లుల ఆశీస్సులతోనే నాకు సంతానం
- పాతికేళ్లుగా దర్శించుకుంటున్నా: స్పీకర్
- ప్రపంచంలో ఇదే అతిపెద్ద జాతర: సీతక్క
- 8 లక్షల గొర్రెలు, మేకలు.. 4 లక్షల కోళ్లు
- మాంసానికే 500 కోట్లు పెట్టిన భక్తులు
- రూ.4.12 కోట్ల మేర మద్యం విక్రయాలు
- బెల్లం, కొబ్బరి కాయలు, చీరలు.. అంతా కలిసి రూ.1000 కోట్ల బిజినెస్



సారలమ్మను వనంలోకి తీసుకెళుతున్న పూజారులు

వరంగల్, మేడారం బృందం, మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరంటేనే ముక్క, చుక్క! ఈసారి జాతరలో వనదేవతలకు పెద్ద ఎత్తున జీవాలను బలిచ్చి.. ఆ మాంసం, మద్యంతో జాతరలో భక్తులు పండుగ చేసుకున్నారు. జాతరలో సుమారు 8 లక్షల గొర్రెలు, మేకలు తెగినట్లు అంచనా. ఒక్కొక్కటి రూ.6వేల చొప్పున వేసుకున్నా రూ.480 కోట్ల విలువైన మాంసాన్ని భక్తులు ఆరగించారన్న మాట. అలాగే 4 లక్షల దాకా కోళ్లూ తెగాయి. జాతర మూడు, నాలుగో రోజు కోళ్ల ధరలను భారీగా పెంచారు. ఒక్కో కోడికి రూ.800 వరకు వసూలు చేశారు. తొలి రెండ్రోజులు మాత్రం కోడికి రూ.250 వరకే తీసుకున్నారు. కోడికి సుమారుగా రూ.500 చొప్పున లెక్క వేసుకున్నా రూ.20 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు అంచనా. మొత్తంగా మాంసం కోసమే భక్తులు సుమారు రూ.500కోట్ల వరకు ఖర్చు చేశారని భావిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ అధికారుల లెక్కల ప్రకారం జాతరలో రూ.4.12కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఎంఆర్‌పీపై 20శాతం ఎక్కువగా వసూలు చేయడంతో

మిగతా 2వ పేజీలో...



కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి..

- దేశమంతా భారతీయ న్యాయ సంహిత నాగరిక్ సురక్షా సంహిత, సాక్ష్య వర్తింపు
- వివాదాస్పద హిట్ అండ్ రన్ కేసు సెక్షన్‌కు తాత్కాలిక మినహాయింపు
- రాజద్రోహం ఇక నుంచి దేశద్రోహం
- కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్లు జారీ

14

వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు

- లాస్య నందిత మరణం నేపథ్యంలో నిర్ణయం
- ఆటో డ్రైవర్లను ఆదుకుంటాం: మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణించిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు డ్రైవర్లుగా ఉన్న వారందరికీ డ్రైవింగ్, ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాకు వెల్లడించారు. గాంధీ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. వీఐపీలు సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు సరైన శిక్షణ తీసుకున్న డ్రైవర్లను నియమించుకోవాలని, ప్రతిభ లేని డ్రైవర్లను విధుల్లో పెట్టుకోవద్దని సూచించారు. ఈ మేరకు రాష్ట్రంలోని వీఐపీలందరికీ లేఖలూ రాయనున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రైవ్ నిర్వహించి.. ఎక్కడికక్కడ ఈ టెస్టులు నిర్వహించనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో అన్ని టెస్టులూ పాసైతేనే డ్రైవింగ్ లైసెన్సు జారీ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ప్రతి రోజూ 50 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 6వేల కోట్ల అప్పుల్లో కూరుకు పోయిన ఆర్టీసీ.. ఇప్పుడిప్పుడే లాభాల బాట పడుతోందన్నారు. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12వేల చొప్పున సాయం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేస్తామన్నారు. బిహార్ తరహాలో కులగణన నిర్వహించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆయన వెల్లడించారు.

ఆంధ్రనాట్య గురువు కళాకృష్ణకు గౌరవ డాక్టరేట్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆంధ్రనాట్య గురువు కళాకృష్ణకు తెలుగు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. తెలుగు సాంప్రదాయ నృత్యాలైన పేరిణి, ఆంధ్రనాట్యాలకు విశేష సేవలందించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కళాకారులకు శిక్షణను అందించినందుకు గౌరవ డాక్టరేట్‌తో సన్మానం చేయనున్నట్లు తెలుగు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు, వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు తెలిపారు. 28న రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించే తెలుగు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవంలో గౌరవ డాక్టరేట్‌ను కళాకృష్ణకు గవర్నర్ తమిళిసై ప్రదానం చేస్తారని వివరించారు.

శంకర్‌రెడ్డి కొడుకు 20 కోట్లు ఇస్తానన్నాడు

- జైల్లో ఉన్నా నన్ను ప్రలోభాలకు గురిచేశారు
- ఇదంతా సీఎం జగన్‌కు తెలిసే చేస్తున్నారు: దస్తగిరి

కడప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): "దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు జైల్లో ఉన్న నా దగ్గరకు వచ్చి రూ.20 కోట్లు ఇస్తానన్నాడు. 'కృష్ణారెడ్డి కాంప్రమైజ్ అయ్యాడు నువ్వూ కావాల్సిందే' అని ప్రలోభాలకు గురిచేశాడు" అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అన్నారు. కిడ్నాప్ చేయలేదంటూ స్వయంగా అమ్మాయి చెబుతున్నా వినకుండా తనను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారని, వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెక్యూరిటీ నా వెంటే ఉండగా నేనెలా కిడ్నాప్ చేస్తానని ప్రశ్నించారు. రెండు వేర్వేరు కేసులకు సంబంధించి మూడు నెలలకు పైగా కడప సెంట్రల్ జైలులో ఉన్న ఆయన శుక్రవారం బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం పులివెందులలోని ఇంటి వద్ద ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో దస్తగిరి మాట్లాడారు. "మా బంధువుల అమ్మాయి ఒక అబ్బాయితో పారిపోయింది. వాళ్ల అమ్మవాళ్లు కేసు పెట్టారు. నేను వారి ఊరికి వెళ్లి ఇలా చేయడం పద్ధతి కాదని చెప్పా. తర్వాత ఆ అమ్మాయిని నేనే బలవంతంగా కిడ్నాప్ చేశానని కేసు సృష్టించారు. ఆ అమ్మాయి అంగీకారంతోనే నేను పిలుచుకెళ్లా. ఇదంతా ఆ అమ్మాయి చెప్పినప్పటికీ అవన్నీ పక్కన పెట్టారు. కేవలం సీఎం జగన్, అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల కారణంగా నన్ను జైలుకు పంపారు. నన్ను అక్టోబరు 30న పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు ఎందుకు చేశారని ప్రశ్నించడంతో ఎర్రగుంట్ల సీఐ శంకరయ్య, డీఎస్పీ తీవ్రంగా కొట్టారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన గన్‌మన్లు, ఎస్కార్ట్ ఉండగా నేనెలా కిడ్నాప్ చేస్తానని ప్రశ్నించా" అని అన్నారు. శంకర్‌రెడ్డి కొడుకు డాక్టర్‌గా కడపలో పనిచేస్తున్నాడని, అతను జైలుకు వచ్చి.. 'నీవల్ల మా రాజకీయం మొత్తం నాశనం అయింది, నీ భార్య బిడ్డలను కూడా ఇబ్బంది పెడతాం. నువ్వు కాంప్రమైజ్ అవుతావేమో చెప్పు.. కృష్ణారెడ్డి మాకు కాంప్రమైజ్ అయ్యాడు. నీకు ఎంతడబ్బు కావాలన్నా ఇస్తాం. ప్రస్తుతానికి రూ.20 కోట్లు డబ్బు పెట్టుకో అరేంజ్ చేసి పంపిస్తా'.. అని చెప్పాడన్నారు. ఇదంతా సీఎం జగన్, అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డిలకు తెలిసే జరిగిందని దస్తగిరి చెప్పారు.

నాకేం గుర్తుకు రావడం లేదు

నిద్రమత్తులో కళ్లు మూసుకుపోయాయి.. అంతలోనే ప్రమాదం జరిగింది

- లాస్య నందిత కారు డ్రైవర్ వాంగ్మూలం
- కుట్ర కోణం ఉందా? పోలీసుల దర్యాప్తు

పటాన్‌చెరు, మియాపూర్, ఫిబ్రవరి, 24: 'ఏం తెలియదు సార్, అసలు ఏం గుర్తుకు రావడం లేదు. కళ్లు తెరిచి చూసే లోగా ప్రమాదం జరిగిపోయింది.' ఇది రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు డ్రైవర్ ఆకాశ్ పోలీసులు ముందు చెప్పిన వాంగ్మూలం! ప్రమాదంలో తీవ్రగాయాలైన ఆకాశ్ ప్రస్తుతం మియాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన సమయంలో నిద్ర మత్తుతో కళ్లుమూసుకుపోయాయని చెప్పారు. ఏం జరిగిందో తనకు గుర్తులేదని అంతా క్షణాల్లో జరిగిపోయిందని చెప్పినట్లు తెలిసింది. ఈ మేరకు ఆకాశ్ నుంచి న్యాయమూర్తి, డీఎస్పీ వాంగూల్మం రికార్డు చేశారు. ప్రమాదంలో కాళ్లు విరిగిన ఆకాశ్‌కు ఆపరేషన్ చేశారు. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పారు. మరోవైపు లాస్య నందిత కారు ప్రమాద ఘటనపై పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. ఓఆర్ఆర్‌పై ఉన్న అన్ని సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించి విశ్లేషిస్తున్నారు. కారు రింగ్ రోడ్డుపై ఎంత వేగంగా వెళ్లింది. సాధారణ ప్రమాదమా? ఏదైనా కుట్ర కోణం ఉందా? అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రమాదానికి గురైన కారు విడిభాగాలు విసిరేసినట్లు పడి ఉండటంతో రెయిలింగ్‌ను ఢీకొనడానికి ముందు మరో వాహనాన్ని ఢీకొట్టిందేమో అని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గురైన సమయంలో ముత్తంగి జంక్షన్ వైపు అటుగా వెళ్ళిన వాహనాల వివరాలను సేకరించే పనిలో పటాన్‌చెరు పోలీసులు నిమగ్నమయ్యారు. ఇంతవరకు ఎలాంటి వాహనం ఆచూకీ లభ్యం కాలేదు. అయితే టిఫిన్ కోసం శామీర్‌పేట నుంచి పటాన్‌చెరు వరకు ఎమ్మెల్యే రావడానికి దారితీసిన కారణాలను తెలుసుకునే పనిలో పడ్డారు.



జాతర జబర్దస్త్!



సమ్మక్కను వనప్రవేశానికి తరలిస్తున్న పూజారులు



శనివారం ఉదయం భక్తులతో నిండిన సమ్మక్క, సారలమ్మ గద్దెల ప్రాంగణం

(మొదటి పేజీ తరువాయి)

మరో రూ.కోటి దాకా వ్యాపారులు లాభపడ్డారు. సుమారు రూ.5కోట్ల మద్యం లోకల్‌గా అమ్ముడుపోయింది. నాలుగు రోజుల్లో రూ.425 టన్నుల బెల్లం అమ్మకాలు చేసినట్లు అంచనా. కిలో బెల్లానికి రూ.70 అనుకున్నా రూ.3.19కోట్ల బెల్లం వ్యాపారం జరిగినట్లు అంచనా. అయితే గ్రామాల నుంచి భారీ ఎత్తున బెల్లాన్ని కొనుగోలు చేసి తల్లులకు సమర్పించారు. అలా తెచ్చుకున్న మరో 500టన్నుల వరకు అంటే రూ.3.50కోట్ల విలువ ఉంటుందని అంచనా. జాతరలో 75లక్షలకు పైగా కొబ్బరి కాయలు అమ్మకాలు జరిగాయి. ఒక్కో కొబ్బరి కాయకు రూ.50 వరకు విక్రయించారు. అంటే సుమారు రూ.37కోట్ల విలువైన కొబ్బరి కాయల వ్యాపారం జరిగినట్లు అంచనా. చీరసారెలకు రూ.2కోట్ల వరకు విక్రయాలు జరిగాయి. మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో అన్ని వ్యాపారాలు కలిపి సమారు రూ.1000కోట్లకు పైగా లావాదేవీ లు జరిగిఉంటాయని అంచనా వేస్తున్నారు. ఇక జాతర చివరి రోజైన శనివారం సాయంత్రం వనదేవతలు గద్దెలు దిగి తమ తమ నిజస్థానాలకు చేరుకున్నారు. చిలుకలగుట్టకు సమ్మక్కను, సారలమ్మను కన్నెపల్లికి, పగిడిద్దరాజును పోనుగొండ్లకు, గోవిందరాజును కొండాయికి చేర్చారు. ఫలితంగా నాలుగు రోజుల జాతర ముగిసినట్లయింది. ఈసారి గతంలో కన్నా విఎంచి దాదాపు కోటిన్నర మంది భక్తులు వనదేవతలను సందర్శించుకున్నట్లు అంచనా.

ఎంతో మహిమగల తల్లులు: స్పీకర్

సమ్మక్క, సారలమ్మ తల్లులు ఎంతో మహిమ కలిగిన దేవతలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శనివారం మేడారం వచ్చిన ఆయన సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. తొలుత గద్దెల ఎదుట ఏర్పాటు చేసిన తులాభారం వద్ద 72కిలోల ఎత్తు బంగారం సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకొని చీర, గాజులు, పసుపు, కుంకుమను తల్లులకు సమర్పించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. తాను 25ఏళ్లగా తల్లులను దర్శించుకుంటున్నానని, సంతానం కోసం స మ్మక్క తల్లికి మొక్కుకున్నానని, ఆ తల్లి ఆశీర్వాదంతోనే తనకు సంతానం కలిగిందని పేర్కొన్నారు. జాతరలో భక్తులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారని అభినందించారు. ఇక జాతరను విజయవంతమైందని.. ఇందుకు అన్ని శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు చెప్పారు. శనివారం మేడారంలో ఆమె మాట్లాడారు. ప్రపంచంలోనే మేడా రం అతిపెద్ద జాతర అని, నాలుగు రోజుల్లో 1.45 కోట్ల మంది వనదేవతలను దర్శించుకున్నారని చెప్పా రు. సీఎం రేవంత్‌రెడ్డి అత్యధికంగా నిధులు కేటాయించారని, సుమారు 20 శాఖల అధికారులను సమన్వయం చేసి జాతరను విజయవంతం చేశామని పేర్కొన్నారు. ఆర్టీసీ ద్వారా మేడారం జాతరకు 10వేల ట్రిప్పుల బస్సులు నడిచాయని తెలిపారు. మిస్సింగ్ క్యాంపుల ద్వారా 5090 మంది భక్తులు తప్పిపోతే అందరినీ వారి కుటుంబ సభ్యుల వద్ద చేర్చామన్నారు. ఇక జాతర పూర్తయిన పది రోజుల వరకు పారిశుధ్య పనులు కొనసాగుతాయన్నారు. కాగా అమ్మవారి కుంకుమ భరిణె అంత పవిత్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజల్ని పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకుంటామని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మేడారం జాతర విజయవంతం చేయడంలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

ఒక్క రక్తపరీక్షతో క్యాన్సర్ ముందస్తు గుర్తింపు!

- కాంటినెంటల్ ఆస్పత్రిలో క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ డిటెక్షన్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సమస్య తీవ్రతరం కాకముందే ఓ మనిషిలో క్యాన్సర్ ముప్పును ముందుగా గుర్తించడమే లక్ష్యంగా క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ క్యాన్సర్ డిటెక్షన్ అనే విభాగాన్ని హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రి శనివారం ప్రారంభించింది. ఈ విభాగం ద్వారా తాము నిర్వహించే మాలిక్యులర్ జెనెటిక్ అనాలిసిస్ అనే రక్తపరీక్షతో చాలా క్యాన్సర్లను ముందుగానే గుర్తించవచ్చునని ఆస్పత్రి చెబుతోంది. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడానికి, వ్యాధి నివారణకు ఇలా ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం దేశంలో ఇదే తొలిసారి. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ క్యాన్సర్ ప్రివెన్షన్ అండ్ ఎర్లీ క్యాన్సర్ డిటెక్షన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. డబ్ల్యూహెచ్‌వో క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కారోల్ సికోరా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, కాంటినెంటల్ హాస్పిటల్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, కాంటినెంటల్ క్యాన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ పి. జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. క్యాన్సర్ ఆశ్చర్యకరమైన వ్యాధి అని, నివారణతోనే ఈ వ్యాధిని అడ్డుకోగలమని పేర్కొన్నారు. మాలిక్యులర్ జెనిటిక్ ఎనాలిసిస్ పరీక్షతో చాలా క్యాన్సర్లను ముందుగానే గుర్తించవచ్చునన్నారు.అయితే, అత్యాధునిక సాంకేతికతతో పరీక్షలు చేసినా వందశాతం ఖచ్చితత్వంతో ఫలితాలు రావని చెప్పారు. అయితే, రక్త పరీక్షలతో డీఎన్ఏ మ్యుటేషన్స్ కొంతవరకు గుర్తించగలమని వివరించారు. ఈ తరహా పరీక్షల ఫలితాల వెల్లడికి 3-4 వారాల సమయం పడుతుందని, రూ.16 వేల నుంచి రూ.35 వేల దాకా ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.

వివాహేతర సంబంధంతో వ్యక్తి దారుణ హత్య!

- వదినతో సంబంధం ..ఆమె కూతురుపైనా కన్నేసిన వ్యక్తి
- అడ్డుతొలగించుకోవాలని ఆ తల్లీకూతుళ్ల స్కెచ్
- కళ్లలో కారం కొట్టి, కత్తులతో దాడి చేసిన వైనం

హైదరాబాద్ సిటీ/ఉప్పల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తనతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తి, తన కూతురు మీదే కన్నేసి, వేధించడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోయింది. కూతురుతో కలిసి అతడి హత్యకు పథకం వేసింది. కత్తులతో దాడి చేయించి చంపించింది. ఉప్పల్ పరిధిలో నాలుగు రోజుల క్రితం పుస్తకాల సాయి కుమార్ (43) అనే సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారి హత్య కేసును పోలీసులు ఛేదించారు. హతుడికి వరుసకు వదిన అయ్యే పుస్తకాల శారద (40) అనే మహిళ, ఆమె కూతురు శివానీ (23) కలిసి ఈ హత్య చేశారని.. ఇందుకు వీరికి పుస్తకాల దీపక్ కుమార్ (42), యల్లా బాలకృష్ణ (35) అనే ఇద్దరు పాత నేరస్తులు సహకరించారని తేల్చారు. కేసు వివరాలను మల్కాజిగిరి డీసీపీ పీ.వి.పద్మజ వెల్లడించారు. రవీంద్రనగర్‌లో నివసించే శారదకు భర్త చనిపోయాడు. కూతురు శివానీతో కలిసి ఉంటోంది. కొన్నాళ్లుగా శారద, సాయికుమార్ మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. శారదతో సంబంధం సాగిస్తూనే ఆమె కూతురు శివానీపై సాయికుమార్ కన్నేసి.. లైంగికంగా వేధిస్తున్నాడు. ఇది తెలిసి.. సాయికుమార్ నుంచి కుమార్తెను రక్షించుకునేందుకు అతడిని అడ్డు తొలగించుకోవాలని శారద నిర్ణయించింది. దీపక్ అనే వ్యక్తి సాయి కుమార్‌కు వరుసకు సోదరుడవుతాడు. దీపక్ తన భార్య హత్య కేసులో కొన్నాళ్లు జైల్లో ఉన్నాడు. సాయి కుమార్‌కు సంబంధించి విషయమంతా దీపక్‌కు చెప్పి.. హత్యకు సహకరించాలని కోరింది. దీపక్ వెంటనే సరేనన్నాడు. ఈ విషయాన్ని దీపక్.. ఉప్పల్ పరిధిలో జరిగిన జంట హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్న బాలకృష్ణకు చెప్పి సహకరించేందుకు మాట తీసుకున్నాడు. నలుగురూ కలిసి సాయికుమార్ హత్యకు పథకం వేశారు. ఈనెల 21న శారద, శివాని.. సాయికి ఫోన్ చేసి వెలుగు గుట్ట సమీపంలోకి రావాలని చెప్పి పిలిపించుకున్నారు. తాము చెప్పిన చోటుకు సాయి రాగానే అతడిని శారద మాటల్లో పెట్టింది. అదును చూసి శివాని అతడి కళ్లలో కారం చల్లింది. అప్పటికే అక్కడ మాటువేసిన దీపక్, బాలకృష్ణ కలిసి కత్తులతో సాయి మెడ, తల, పొట్ట మీద కత్తులతో పొడిచారు. రక్తపు మడుగులో ఉన్న సాయికుమార్‌ను ఆర్‌జీఐ క్రికెట్ స్టేడియం సెక్యూరిటీ సిబ్బంది గమనించి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి సోదరుడు సాయికిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో శారద, శివాని, దీపక్, బాలకృష్ణ కలిసి హత్యచేశారని నిర్ధారించిన పోలీసులు.. ఆ నలుగురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఒకేచోట మూడేళ్ల సర్వీసు దాటిన ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు

- లోక్‌సభ నియోజకవర్గం యూనిట్‌గా బదిలీ.. ఈసీ ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మూడేళ్ల సర్వీసు పూర్తయిన ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల మేరకు రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ముందు మూడేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేశారు. అప్పుడు జిల్లాను యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేపట్టగా.. తాజాగా లోక్‌సభ నియోజకవర్గం యూనిట్‌గా బదిలీలు చేయాలని ఈసీ పేర్కొంది. ఈ మేరకు జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెళ్లాయి. రెవెన్యూ శాఖ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలప్పుడు బదిలీ జరిగినప్పటికీ.. చాలా మంది ఉద్యోగులకు మరోసారి బదిలీ కానున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఒక లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో రెండు మూడు జిల్లాలు ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. డిప్యూటీ తహసీల్దార్ నుంచి స్పెషల్ గ్రేడ్ కలెక్టర్ వరకు బదిలీ కానున్నారు. ఇందుకు సంబంధించి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ నుంచి జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. అలాగే పంచాయతీరాజ్ శాఖలోనూ జడ్పీ సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీఆర్‌డీవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, ఇతర సిబ్బందిని బదిలీ చేయనున్నారు.

ఐదు స్థానాల్లో ఏదో ఒకటి ఇవ్వండి!

- కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద సీపీఐ ప్రతిపాదన
- ఖమ్మం నుంచి పోటీ చేసే యోచనలో పార్టీ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తో కలిసి నడుస్తున్న సీపీఐ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో ఒక సీటు ఇవ్వాలని పట్టుబడుతోంది. తమకు పట్టున్న ఐదు లోక్ సభ స్థానాలను కాంగ్రెస్ అధిష్ఠానం ముందు ఉంచి, వాటిలో ఏదో ఒకటి ఇవ్వాలని ప్రతిపాదించింది. ఈ మేరకు సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు కె.నారాయణ, అజీజ్ పాషా తదితరులు ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేతో ఇటీవల సమావేశమయ్యారు. ఇందులో కాంగ్రెస్ తరఫున సీట్ల సర్దుబాటు కమిటీ సభ్యుడు ముఖుల్ వాస్నిక్ కూడా పాల్గొన్నారు. తెలంగాణలో ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లి స్థానాల్లో ఏదో ఒకటి తమకు కేటాయించాలని, సీట్ల సర్దుబాటు విషయాన్ని సాధ్యమైనంత త్వరగా తేల్చాలని సీపీఐ నాయకులు కోరారు. అయితే, ఈ విషయమై రాష్ట్ర నాయకత్వంతో మాట్లాడాలని సీపీఐ నేతలకు ఖర్గే సూచించారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌తో ప్రస్తావించగా.. సీట్ల కేటాయింపులు, సర్దుబాటు నిర్ణయం జాతీయ నాయకత్వం చేతుల్లోనే ఉంటుందని చెప్పారని వారు ఖర్గేకు వివరించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కూనంనేని సాంబశివరావు గెలుపొందిన విషయం తెలిసిందే. సంస్థాగతంగా ఆ ప్రాంతంలో మంచి పట్టు ఉండడంతో ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగాలనే ఆలోచనలో సీపీఐ ఉంది.

ధాన్యం టెండరు రేటు రూ.2,111

గతంలో కంటే క్వింటాలుకు రూ.378 చొప్పున అధిక ధర

- గోనె సంచులు, మార్కెట్ సెస్, రవాణా చార్జీలన్నీ బిడ్డర్లపైనే
- 90 రోజుల్లో రైస్‌మిల్లుల్లో ఉన్న ధాన్యం ఖాళీ చేయాల్సిందే
- తిరిగి ఆ ధాన్యం తెలంగాణలో అమ్ముకోవటానికి నో ఛాన్స్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం టెండర్లలో రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన ధర వచ్చింది. గత ప్రభుత్వం టెండర్లు పిలిచిన సమయంలో క్వింటాలు ధాన్యానికి రూ.1,732 ధర రాగా... ఇప్పుడు ఏకంగా రూ.2,111 చొప్పున పలకటం గమనార్హం. అప్పటితో పోలిస్తే ఒక క్వింటాలుకు రూ.378 చొప్పున అదనపు రేటు వచ్చింది. దీంతో రూ.1,323 కోట్ల ఆదాయం పోకుండా కాపాడుకున్నట్లు అయ్యింది. గోనె సంచులు, మార్కెట్ సెస్, రవాణా చార్జీల భారమంతా టెండర్లు దక్కించుకున్న బిడ్డర్ల పైనే వేశారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మకాలతో ప్రభుత్వానికి రూ.7,385 కోట్ల తక్షణ ఆదాయం వస్తోంది. రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లోని 1,832 రైస్ మిల్లుల్లో ఉన్న 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి ప్రభుత్వం టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి టెండర్లు ఖరారు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ టెండర్లు దక్కించుకున్న బిడ్డర్లకు మెయిల్ ద్వారా సమాచారం అందించారు. 35 లక్షల టన్నులను 12 లాట్లుగా విభజించి టెండర్లు పిలిచారు. క్వింటాలుకు రూ.1,926 నుంచి రూ.1,956 చొప్పున బిడ్డర్లు ధర కోట్ చేశారు. అంటే సగటున క్వింటాలుకు రూ.1,941 చొప్పున కోట్ చేశారు. ఈ ధర ధాన్యానికి మాత్రమే! గోనెసంచుల ధర, మార్కెట్ సెస్, రవాణా ఖర్చులు దీనికి అదనంగా చెల్లించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. అంటే క్వింటాలుకు రూ.2,111 చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఇదే ధాన్యాన్ని రైతుల నుంచి రూ.2,040 నుంచి రూ.2,060 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. బ్యాంకు వడ్డీ, నిర్వహణ భారం కొంతమేరకు పడినప్పటికీ కనీస మద్దతు ధర కంటే ఎక్కువకే ధాన్యం డిస్పోజల్ చేస్తుండటం గమనార్హం. అయితే 35 లక్షల టన్నుల్లో కొంత సన్న ధాన్యం కూడా ఉంది. దీనికి క్వింటాలుకు రూ.2,400 చొప్పున టెండర్ బిడ్డింగ్ దాఖలు కావటం గమనార్హం. 2022-23 యాసంగి సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి 67 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. అందులోంచి 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని టెండరు పద్ధతిలో విక్రయించాలని నిర్ణయించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా ఈ ధాన్యాన్ని అమ్మేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పుడు వ్యాపారులంతా కూటమి కట్టి తక్కువ ధర కోట్ చేశారు. సగటున క్వింటాలుకు రూ.1,732 కోట్ చేయటంతో సుమారు రూ.1,500 కోట్లు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించింది. అప్పటి ప్రభుత్వ పెద్దల ప్రమేయాన్ని బయటపెట్టడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గి టెండర్లు రద్దు చేసింది.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ ధాన్యం టెండర్లు పిలిచింది.

ఈ ధాన్యం రాష్ట్రంలో అమ్మొద్దు

రాష్ట్రంలో ధాన్యం నిల్వలు విపరీతంగా ఉన్నాయి. దీంతో టెండర్ల ద్వారా విక్రయించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మన రాష్ట్రంలో విక్రయించవద్దనే షరతును ప్రభుత్వం విధించింది. ఇతర రాష్ట్రాల్లో అమ్ముకోవడం లేదా మిల్లింగ్ చేసి బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవాలని సూచించింది. దీంతో కొంతమేర ధాన్యం నిల్వలు తగ్గటంతో పాటు, రైస్ మిల్లులు, గోడౌన్లు ఖాళీ అవుతాయి. కొత్తగా వచ్చే ధాన్యం నిల్వ చేసుకోవటానికి వెసులుబాటు దొరుకుతుందని పేర్కొంది. అయితే కనీసం 50 శాతం ధాన్యాన్ని రాష్ట్రంలో విక్రయించుకునే అవకాశం కల్పించాలని టెండర్లు దక్కించుకున్న ఏజెన్సీలు ప్రభుత్వం ముందు ప్రతిపాదన పెట్టినట్లు సమాచారం.




అట్టహాసంగా షర్మిల కుమారుడి రిసెప్షన్

- ఖర్గే, కేసీ వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ ముఖ్య నేతలు హాజరు

హైదరాబాద్/శంషాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కుమారుడు రాజారెడ్డి రిసెప్షన్ వేడుక అట్టహాసంగా జరిగింది. శంషాబాద్‌లోని ఫోర్ట్ గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఏపీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, ఏపీసీసీ ముఖ్యనేతలు హాజరై వధూవరులు రాజారెడ్డి-ప్రియను ఆశీర్వదించారు. అంతకుముందు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఖర్గేకు సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలికారు. అక్కడి నుంచి వారు నేరుగా రిసెప్షన్ జరుగుతున్న ఫంక్షన్ హాల్‌కు వెళ్లిపోయారు. ఖర్గే, కేసీ వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి తదితరులను షర్మిల-అనిల్‌కుమార్ దంపతులు సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్ రావు కాంగ్రెస్ నేతలను నూతన దంపతులకు పేరు పేరునా పరిచయం చేశారు.

గురుకుల నియామకాల్లో మార్పులు అవసరం

- ఒకటికంటే ఎక్కువ ఉద్యోగాలకు పలువురు ఎంపిక
- ఒక పోస్టు ఉంచుకుని మిగిలినవాటిని వదిలేస్తున్నారు
- ఫలితంగా భర్తీకాని పోస్టులు
- సీఎం రేవంత్‌కు ప్రవీణ్ కుమార్ లేఖ
- స్పందించిన సీఎం..పరిష్కారానికి హామీ



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక మండలి ఉద్యోగ నియామకాల్లో మార్పులు అవసరమని, రిలింక్విష్‌మెంట్ విధానంలో ఉద్యోగాలు భర్తీ చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కోరారు. ఈమేరకు ఆయన సీఎం రేవంత్‌కు శనివారం లేఖ రాశారు. ఆ లేఖను ఎక్స్ వేదికగా సీఎంకు ట్యాగ్ చేశారు. గత ఏడాది గురుకుల బోర్డు డిగ్రీ లెక్చరర్, పీజీటీ, టీజీటీ వంటి ఉద్యోగ నియామకాలకు వరుస నోటిఫికేషన్లు జారీ చేయడంతో అర్హతగల వేలాది మంది నిరుద్యోగులు అన్ని ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని పరీక్షలు రాశారని తెలిపారు. ఫలితాల్లో పలువురు ఒకటికంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. ఆ అభ్యర్థులు ఒక ఉద్యోగాన్ని ఎంచుకుని మిగిలిన వాటిని వదిలేయడం వల్ల అవి ఖాళీగా ఉండిపోతున్నాయని.. దీనివల్ల మెరిట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు నష్టం వాటిల్లుతుందని లేఖలో వివరించారు. ఆయన ఈ లేఖను ఎక్స్‌లో సీఎంకు ట్యాగ్ చేయగా.. స్పందించిన రేవంత్ ఎక్స్ వేదికగానే సమాధానమిచ్చారు. తెలంగాణ యువతకు సంబంధించిన సమస్యలను ప్రజాప్రభుత్వం దృష్టికి తీసుకురావాలనే మీ ప్రయత్నానికి ధన్యవాదాలు అని ట్వీట్ చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా యువత భవితను పునర్‌నిర్మించాలనే సంకల్పంతో ఈ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గురుకుల నియామకాలకు సంబంధించి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ లేవనెత్తిన విషయాలను, సూచనలను నిశితంగా పరిశీలించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తామని సీఎం సమాధానం ఇచ్చారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా తెలంగాణ పునర్‌నిర్మాణానికి ఎవరు కలిసి వచ్చినా వారితో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందన్నారు. తమ ప్రయత్నం, తాపత్రయం అంతా తెలంగాణ ప్రజల కోసమే తప్ప గుర్తింపు కోసం కాదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలు ఏవైనా ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సీఎం సూచించారు.

బడి మానేసి ఆడుకోవడానికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు చెరువులో మునిగి చనిపోయారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం ముదెల్లి గ్రామానికి చెందిన మిద్దెల రవీందర్ (9), సుతారి శశాంక్(9) ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నారు. శనివారం సైకిల్ టైర్‌తో ఆడుకుంటూ రవీందర్, అతని చెల్లెలు మనీశా, శశాంక్‌లు గ్రామంలోని పెద్దచెరువు వైపు వెళ్లారు. అక్కడ రవీందర్ ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయాడు. అతడిని కాపాడేందుకు వెళ్లి.. శశాంక్ నీటిలో మునిగిపోయాడు. - గాంధారి

వైవాహిక కేసుల్లో మహిళలను కోర్టుల చుట్టూ తిప్పకండి

- ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే సూచన
- కేసుల సత్వర పరిష్కారానికే కొత్త కోర్టులని వెల్లడి
- న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి హామీ



సూర్యాపేట లీగల్/ కోదాడ, ఫిబ్రవరి 24: వివాహ సంబంధ కేసుల్లో మహిళలను కోర్టుల చుట్టూ పదేపదే తిప్పకుండా సత్వరమే న్యాయం జరిగేలా చూడాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవా కేంద్రం, కోదాడలో కోర్టు భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో ప్రసంగిస్తూ కోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కేసులు పెండింగ్‌లో ఉంచకుండా సామాన్యులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. పెండింగ్ కేసులను తగ్గించేందుకు అదనపు కోర్టులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. న్యాయవాదులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకుని న్యాయవ్యవస్థకు వన్నె తేవాలని సూచించారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్‌కుమార్, జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ బి.లక్ష్మణ్, జస్టిస్ పుల్లా కార్తీక్ మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులకు వృత్తి నైపుణ్య విలువలను అందించాలన్నారు. భవిష్యత్ తరాల వారు న్యాయవాద వృత్తిని స్వీకరించేలా ఆదర్శంగా నిలవాలని సూచించారు. సూర్యాపేటలో న్యాయవాదుల సమస్యలపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వినతిపత్రాలను అందజేశారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రధాన న్యాయమూర్తి హామీ ఇచ్చారు. అంతకుముందు జస్టిస్ అరాధే పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి రాజగోపాల్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సురేష్, కలెక్టర్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'భారత్ బచావో' సదస్సు

- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహణ
- 26న బహిరంగ సభ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత్ బచావో పేరుతో అఖిల భారత విద్యార్థుల సదస్సు నేడు, రేపు జరగనుంది. ఈ సదస్సు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభంకానుంది. అదే విధంగా 26న బహిరంగ సభను నిర్వహిస్తామని సదస్సు ప్రతినిధులు డాక్టరు గోపినాథ్, గాదె ఇన్నయ్య, రమేష్ బాబులు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల వరకు నూతన జాతీయ విద్యా విధానం-2020లో విద్యను కాషాయి కరణం చేస్తోందని విమర్శించారు. అట్టడుగు కులాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కరోనా అనంతరం లక్షలాది పరిశ్రమలు మూతపడి నిరుద్యోగ సమస్య తీవ్రమైన సమయంలో బీజేపీ మతాల పేరిట భావోద్వేగాలను రెచ్చగొడుతోందని విమర్శించారు. ఈ సదస్సు మొదటి రోజు 'విద్యా- కాషాయికరణ, జాతీయ విద్యావిధానం-2020, ఫాసిజానికి నమూనా' అనే అంశాలపై చర్చ జరుగుతుంది. రెండో రోజు 'విద్యా-వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ, ఆర్ఎస్ఎస్-ఫుట్టుక రాజకీయాలు' అనే అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారు.

నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం

రైతులు చెరకు వేసి ప్రభుత్వానికి సహకరించాలి: శ్రీధర్ బాబు



నిజాం షుగర్ ఫ్యాక్టరీలో శ్రీధర్‌బాబు

బోధన్ రూరల్/కోటగిరి, ఫిబ్రవరి 24: నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, రైతులు చెరకు సాగుకు ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి, ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు కోరారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణ, చెరకు సాగు ఒకేసారి ప్రారంభం కావాలన్నారు. నిజామాబాద్ జిల్లాలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని శ్రీధర్‌బాబు నేతృత్వంలోని పునరుద్ధరణ కమిటీ శనివారం సందర్శించింది. కమిటీ సభ్యులు ఫ్యాక్టరీ పరిసరాలను, యంత్రాలను పరిశీలించిన తర్వాత రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించే విషయంలో రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీని తెరవడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం కోసమే కమిటీ వచ్చినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ తెరిచిన తర్వాత లాభాల బాటలో పయనించేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తామని తెలిపారు. అందుకోసమే రైతులతో సమగ్రంగా చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిస్తే చెరకును సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. చెరకు వేయాలంటే విత్తనాలు, ఎరువులు, బ్యాంకు రుణాలు, పంట కోత సౌకర్యం కల్పించడంతో పాటు సెస్‌ను రద్దు చేయాలని రైతులు ఈ సందర్భంగా మంత్రిని కోరారు. కేంద్రప్రభుత్వం నిర్ణయించిన ధరకు అదనంగా మరో రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. రైతుల విజ్ఞప్తిపై శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళతామన్నారు. తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

బీఆర్ఎస్ వల్లే ఫ్యాక్టరీ మూత

గత బీఆర్ఎస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్లే నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతబడిందని ఆరోపించారు. ఫ్యాక్టరీపై, భూములపై ప్రైవేటు యాజమాన్యం భారీగా రుణాలు తీసుకుని చేతులెత్తేసిందన్నారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపిస్తామన్నారు. ఫ్యాక్టరీ మూతపడి పదేళ్లు గడిచినా కేంద్రప్రభుత్వం కార్మికులను, రైతులను ఏ మాత్రం పట్టించుకోలేదని శ్రీధర్‌బాబు విమర్శించారు. బీజేపీ నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలోనే రైతులకు అన్యాయం జరిగిందని, ఆ పార్టీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సమన్లు ఇచ్చేందుకు వెళ్లిన పోలీసులపై దాడి

ఏపీ రాష్ట్రం మైదుకూరు పరిధిలో ఘటన

నల్లగొండ, ఫిబ్రవరి 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వైఎస్ఆర్ కడప జిల్లాలో నల్లగొండ జిల్లాకు చెందిన పోలీసులపై దాడి జరిగింది. ఈ నెల 22వ తేదీన జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు మునిసిపాలిటీ పరిధిలోని చిన్నయ్యగారిపల్లెకు చెందిన ఓబుగాని శివతో పాటు మరికొందరు కొన్ని నెలల క్రితం నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల నుంచి గొర్రెలను కొనుగోలు చేశారు. అందుకు సంబంధించి దాదాపు రూ.30 లక్షల వరకు నగదు చెల్లించాల్సి ఉంది. చెల్లింపులో జాప్యం చేస్తుండడంతో చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు మరికొంతమంది బాధితులు 10 రోజుల క్రితం నల్లగొండ జిల్లా ఎస్పీ చందనదీప్తికి అలాగే చందంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో చందంపేట పోలీసులు చిన్నయ్యగారిపల్లె వాసులకు సమన్లు జారీ చేయడానికి నిర్ణయించుకున్నారు. చందంపేట ఎస్ఐ సతీష్‌తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు బాధితులను తీసుకుని ఈ నెల 22వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో ప్రైవేటు వాహనంలో వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నుంచి చిన్నయ్యగారిపల్లె గ్రామానికి వెళ్లారు. అక్కడ గ్రామస్థులకు పోలీసులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో చిన్నయ్యగారిపల్లెకు చెందిన శివతో పాటు మరో 10 మంది ఎస్ఐ సతీష్, ఇద్దరు కానిస్టేబుళ్లు, డ్రైవర్‌పై దాడి చేసి గాయపర్చారు. వీరందరికీ స్వల్ప గాయాలు కాగా వాహనం పూర్తిగా ధ్వంసమైంది. స్థానిక పోలీసులకు సమాచారమివ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఎస్ఐతో పాటు పోలీసులను, డ్రైవర్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. బాధిత పోలీసుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు మైదుకూరు ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ చందనదీప్తి ఆదేశాల మేరకు సమన్లు జారీ చేసేందుకు తాము వైఎస్ఆర్ జిల్లాకు వెళ్లినట్లు చందంపేట ఎస్ఐ సతీష్ తెలిపారు. చిన్నయ్యగారిపల్లెలో జరిగిన ఘటనలో తమకు స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

బీఆర్ఎస్ ఉంటేనే...

“మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైలుకు పంపారు. స్కిల్ కేసులో ఆయన తప్పు చేశారనడానికి సరైన ఆధారాలు లేవు!” – ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒకరు కేంద్ర పెద్దలకు అందజేసిన నివేదికలో పేర్కొన్న విషయమిది. రాష్ట్రంలో పరిపాలన సక్రమంగా లేదనీ, అభివృద్ధి మచ్చుకు కూడా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. తన పాలన అద్భుతంగా ఉందని జబ్బలు చరుచుకుంటున్న జగన్‌రెడ్డికి ఈ నివేదికలోని అంశాలు సహజంగానే రుచించవు. తన ప్రభుత్వాన్ని విమర్శించేవారు ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్లు కూడా కాదని, పొరుగు రాష్ట్రాల్లో నివసించే వారే విమర్శిస్తుంటారని ముఖ్యమంత్రి శుక్రవారం నాడు ప్రకాశం జిల్లాలో జరిగిన సభలో వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు ఉన్నవీ లేనివీ చెప్పడం సహజమే కానీ జగన్మోహన్ రెడ్డిలా పచ్చి అబద్ధాలు చెప్పేవారిని ఇప్పుడే చూస్తున్నాం. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి కూడా తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక

> ముఖ్యమంత్రికి ఎక్కడో ఓటమి భయం పట్టుకుంది. అందుకే మీడియాపైకి తన ఉన్మాద మూకలను ఉసిగొల్పుతున్నారు. రాధాకృష్ణ, రామోజీరావు కనిపిస్తే కాళ్లు విరిచే వారు అని కొడాలి నాని వంటి పిచ్చివాళ్లు వాగుతున్నారంటే ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియడం లేదా? తాను అధికారంలోకి వచ్చే వరకు రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితులు ఉన్నాయన్నట్టుగా జగన్‌రెడ్డి చేస్తున్న ప్రచారం నిజమైతే... రాజశేఖర రెడ్డి ఐదున్నరేళ్ల పాలన కూడా దరిద్రంగా ఉన్నట్టే కదా? అలాంటప్పుడు రాజన్న రాజ్యం తెస్తామని ఎన్నికల్లో చెప్పడంలోని ఔచిత్యం ఏమిటి? పేదల ప్రతినిధికి విలాసవంతమైన రాజ ప్రాసాదాలు ఊరూరా ఎందుకో చెబుతారా? నీ కుమార్తెల వలె పేదల పిల్లలను కూడా ప్యారిస్, లండన్‌లో చదివించవచ్చు కదా? ఇలా ప్రశ్నిస్తామనే దాడులకు తెగబడుతున్నారు. నీ సొంత చెల్లి ఇప్పుడు నిన్ను కడిగిపారేస్తున్నారు కదా, నీ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు కదా! ఇప్పుడు ఆమెపై కూడా దాడులు చేయిస్తారా?

ఇచ్చినందున ఆయనను కూడా మన రాష్ట్రానికి చెందినవాడు కాదని దాడి ప్రారంభించినా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. తన సభలకు తీసుకు వస్తున్న జనాలందరూ వెర్రిబాగులోళ్లు అని భావించే ముఖ్యమంత్రి, చెప్పిన అబద్ధం చెప్పకుండా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబులాంటి వాడు రాజకీయాలలో ఇంకా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందని జగన్మోహన్ రెడ్డి తాజాగా సెలవిచ్చారు. చంద్రబాబు విధానాలతో, రాజకీయాలతో విభేదించే వాళ్లు కూడా ఆయన రాజకీయాలలో ఉండదగిన వ్యక్తి కాదని విమర్శించే సాహసం చేయరు. జగన్‌రెడ్డే రాజకీయాలలోకి వచ్చి ముఖ్యమంత్రి కాగలిగినప్పుడు రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు. ఒక్క జగన్ మాత్రమే చంద్రబాబు రాజకీయాలలో ఉండడాన్ని సహించలేకపోతున్నారు. అందుకే ఆయన రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కుప్పం పర్యటన సందర్భంగా సరదాగా చేసిన వ్యాఖ్యలను కూడా వక్రీకరించే సాహసానికి ముఖ్యమంత్రి ఒడిగట్టారు. రాజకీయాల నుంచి చంద్రబాబు రిటైర్ కావాలని ఆయన సతీమణి స్వయంగా కోరుకుంటున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబు లక్ష్యంగా ముఖ్యమంత్రి చేస్తున్న విమర్శలను గమనిస్తే... తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారెవరూ రాష్ట్ర రాజకీయాల్లో ఉండకూడదనీ, రాష్ట్రాన్ని తనకు, తన భార్యకు అప్పగించేసి అందరూ రాజకీయ సన్యాసం తీసుకోవాలని ఆయన కోరుకుంటున్నట్టుగా ఉంది. తనను తాను పేదల ప్రతినిధిగా చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి అడుగు బయటపెట్టాలంటే రెండు హెలికాప్టర్‌లు సిద్ధంగా ఉండాలి మరి!

బడాయి బిల్డప్‌లు...

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకు రాష్ట్రంలో పేద ప్రజలకు ఆంగ్ల భాషే రాదన్నట్టుగా జగన్ బిల్డప్ ఇస్తున్నారు. ‘సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్’ అన్నట్టుగా ఆంగ్ల భాష వస్తే చాలు అన్నీ వచ్చి పడిపోతాయి అన్నట్టుగా ప్రజలను మభ్యపెడుతున్నారు. అమెరికన్లు మాట్లాడేది ఆంగ్లంలోనే కదా? అయినా ఆ దేశంలో మన దేశానికి చెందినవారు ఉన్నత స్థానాల్లో ఉండటానికి కారణం ఏమిటో జగన్మోహన్ రెడ్డి చెప్పగలరా? అంతెందుకు... కేరళ, తమిళనాడు, కన్నడిగులకు ఆంగ్ల భాషపై పట్టు లేదా? అయినా వాళ్లు తమ మాతృభాషను విస్మరించడం లేదే? ఇంగ్లీష్ భాషతోపాటు తెలుగు భాషను కూడా ప్రోత్సహించాలని, మాతృభాషను మృత భాషగా మార్చకూడదని చెప్పడమే పాపమన్నట్టుగా చిత్రీకరించే ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి చేయడం విడ్డూరంగా ఉంది. తెలుగు భాషలో మాట్లాడే వారి కంటే తక్కువ జనాభా ఉన్న అనేక యూరోపియన్ దేశాలు తమ మాతృభాషను విస్మరించడం లేదు కదా? స్పానిష్, ఫ్రెంచ్ భాషలను నేర్చుకునేందుకు మన పిల్లలు ఉత్సాహపడటం లేదా? ప్రజలు సొంతంగా ఆలోచించకూడదని, వాళ్లు తమ కాళ్ల మీద తాము ఆధారపడకూడదన్నది ముఖ్యమంత్రి అభిప్రాయంగా కనిపిస్తోంది. అడుగడుగునా వంచనతో వ్యవహరించే జగన్మోహన్ రెడ్డి ఎన్నికలు సమీపించడంతో.. ‘నా పేదలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు’ అనే పాట అందుకున్నారు. దళిత జనోద్ధారణకు జీవితాంతం కృషి చేసిన జాతిపిత మహాత్మా గాంధీ కూడా ఇంతలా బిల్డప్ ఇచ్చుకోలేదు. ఆయన చిత్తశుద్ధితో పనిచేశారు కనుక జగన్‌రెడ్డిలా సొల్లు మాటలు చెప్పలేదు.

ఓట్ల కోసం ‘నా... నా’ రాగాలు

బడుగు బలహీన వర్గాల ఓట్లు కావాలి కనుక జగన్మోహన్ రెడ్డి ‘నా’ అనే పాట పాడుతుంటారు. తన పల్లకి మోసే బోయీలుగానే ఆ వర్గాలు ఉండిపోవాలని ఆయన కోరుకుంటారు. అందుకే అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా వారెవరినీ రానివ్వరు. అంతెందుకూ... రాజకీయంగా, ప్రభుత్వపరంగా తన తరఫున వ్యవహారాలను చక్కదిద్దుతున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎంత మంది ఉన్నారో జగన్మోహన్ రెడ్డి చెప్పాలి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జవహర్ రెడ్డి ఎవరు? పార్టీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, విజయసాయి రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎవరు? తనకు నెల నెలా వసూళ్లు చేసి పెడుతున్న గనుల శాఖ డైరెక్టర్ వెంకట రెడ్డి, మద్యం సరఫరా చేసే సంస్థ ఎండీ వాసుదేవ రెడ్డి ఎవరు? వీళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎందుకు లేరు? అంటే ఆ వర్గాలలో సమర్థులు లేరా? లేక వారిపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా? ఊరి వెలుపల దళితవాడలను ఏర్పాటు చేసినట్టుగా తాడేపల్లి ప్యాలెస్‌కు దళిత వర్గాలు ఆమడ దూరంలో ఉండాల్సిందే. ఆయా వర్గాలను మభ్యపెట్టేందుకు విధిలేని పరిస్థితులలో కొన్ని పదవులు కట్టబెట్టినా, వారిని అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదే? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నిజంగా నీ వాళ్లయితే ఆ వర్గాలతో వియ్యం అందుకోగలవా, బంధుత్వం పెట్టుకోగలవా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే తప్పేమిటి? ఐదేళ్లలో అక్క చెల్లెమ్మలకు రెండున్నర లక్షల కోట్లు పంచిపెట్టానని జగన్ గొప్పలు చెప్పుకొంటున్నారు. అయిదేళ్లలో ఐదు లక్షల కోట్లు అప్పు చేసి రెండున్నర లక్షల కోట్లు పంచడం గొప్పా? ఈ ఐదేళ్లలో తన జేబు నుంచి ఒక్కరికైనా పది రూపాయలు సహాయం చేశానని జగన్‌రెడ్డి చెప్పగలరా? ఈ ఐదేళ్లలో జగన్ రెడ్డి కంపెనీల లాభాలు పెరిగినట్టుగా పేదల ఆదాయం ఎందుకు పెరగలేదు? బటన్లు నొక్కడం వల్ల ఒక్క పేదవాడైనా పేదరికం నుంచి బయటకు వచ్చి పన్ను కట్టే స్థాయికి ఎదిగాడా? అదే నిజమైతే తెల్ల రేషన్ కార్డుల సంఖ్య తగ్గుతూ రావాలి కదా?



దాడులకా ‘సిద్ధం’?

జగన్మోహన్ రెడ్డి పాలన నిజంగా గొప్పగా ఉంటే పొద్దున లేచిన దగ్గర నుంచి ప్రతిపక్షాలు, మీడియా మీద పడి ఏడవడం ఎందుకు? జనం కళ్లలోకి సూటిగా చూస్తూ అలవోకగా అబద్ధాలు చెప్పగలిగేది ఎవరంటే, జగన్మోహన్ రెడ్డి అని చెప్పుకోవలసి ఉంటుంది. జనం నెత్తి మీద కూర్చొని ‘మీ సేవకుడిని’ అని గొప్పలు పోగలిగేవాడు, ఇల్లు గుల్ల చేస్తూ ‘మీ సేవకుడిని’ అని మభ్యపెట్టగలిగేవాడు, చేతికీ నోటికీ తాళం వేసి ఎంత స్వేచ్ఛ అనుభవిస్తున్నావో చూడు అని నమ్మించగలిగేవాడు, కొంపకు నిప్పు పెట్టి చలిమంట వేశాను – చలి కాచుకోమని బురిడీ కొట్టించగలవాడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి మాత్రమే. జగన్మోహన్ రెడ్డి హావభావాలను జాగ్రత్తగా గమనించిన వారికి ‘నేను ముఖ్యమంత్రిని అయ్యానా?’ అన్న అనుమానం అతడిలో అప్పుడప్పుడూ కలుగుతుందని మనకు తెలిసిపోతుంటుంది. అందుకే తన లాంటి వాడికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టిన జనాలను ఆయన వెర్రిబాగులోళ్లుగా పరిగణిస్తున్నారు. అందుకే నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతుంటారు. ముఖ్యమంత్రి నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నందుకు మీడియాపై కత్తిగట్టారు. సొంత మీడియాకు వందల కోట్ల ప్రజా ధనాన్ని దోచిపెడుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి, ఈనాడు అని శోకాలు పెడుతుంటారు. ఈ క్రమంలోనే మీడియాపై దాడులకు తన వాళ్లను ప్రోత్సహిస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సభలో ఆంధ్రజ్యోతి, ఈనాడుకు వ్యతిరేకంగా ‘మీరు సిద్ధమేనా?’ అని స్వయంగా ముఖ్యమంత్రి ప్రశ్నించడంతో అసలే మద్యం మత్తులో ఉన్న ఉన్మాద మూక రెచ్చిపోయింది. ‘ఆంధ్రజ్యోతి’ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను దారుణంగా హింసించారు. సొంత మీడియా కలిగి ఉండి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛ గురించి ఉపన్యాసాలు దంచిన జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజ స్వరూపం బయటపెట్టుకుంటున్నారు. రేపు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే తన మీడియాలో పనిచేసే వారిపై ఇటువంటి దాడులు జరిగితే జగన్ ఎలా స్పందిస్తారో చూడాలి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి తర్వాత వైసీపీ అధికారికంగా వెలిబుచ్చిన అభిప్రాయం మరీ దారుణంగా ఉంది. ‘ప్రజల అభిప్రాయం తీసుకొని వార్తలు రాస్తే అందరూ హర్షిస్తారు. కానీ.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే ప్రభుత్వం కాదు, ప్రజలే బుద్ధి చెబుతారు’ అని వైసీపీ ‘ఎక్స్’ ద్వారా సెలవిచ్చింది. అంటే, రాష్ట్రంలోని మీడియా సంస్థలన్నీ ఆ రోత పత్రిక, ఆ రోత చానల్‌కు అనుబంధంగా మారిపోయి ప్రస్తుత కూలి మీడియా బాటలో ముఖ్యమంత్రి భజన చేస్తూ వాళ్లు విసిరే ఎంగిలి మెతుకులు తినడానికి అలవాటుపడాలని కోరుకుంటున్నారన్న మాట! రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకే ఉండకూడదని అనుకోవడం, ప్రజలందరూ మూకుమ్మడిగా మద్దతు ఇవ్వాల్సిందే అని భావించడం, తప్పులు ఎత్తి చూపే ప్రతిపక్షం, మీడియా ఉండకూడదని కోరుకోవడం నియంతృత్వం కాదా? ముఖ్యమంత్రికి ఎక్కడో ఓటమి భయం పట్టుకుంది. అందుకే మీడియాపైకి తన ఉన్మాద మూకలను ఉసిగొల్పుతున్నారు. రాధాకృష్ణ, రామోజీరావు కనిపిస్తే కాళ్లు విరిచే వారు అని కొడాలి నాని వంటి పిచ్చివాళ్లు వాగుతున్నారంటే ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియడం లేదా? తాను అధికారంలోకి వచ్చే వరకు రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితులు ఉన్నాయన్నట్టుగా జగన్‌రెడ్డి చేస్తున్న ప్రచారం నిజమైతే... రాజశేఖర రెడ్డి ఐదున్నరేళ్ల పాలన కూడా దరిద్రంగా ఉన్నట్టే కదా? అలాంటప్పుడు రాజన్న రాజ్యం తెస్తామని ఎన్నికల్లో చెప్పడంలోని ఔచిత్యం ఏమిటి? పేదల ప్రతినిధికి విలాసవంతమైన రాజ ప్రాసాదాలు ఊరూరా ఎందుకో చెబుతారా? విశాఖపట్నంలో తన నివాసం కోసం ఐదు వందల కోట్లు ఖర్చు చేసి మరో విలాసవంతమైన భవనం నిర్మించుకోవడంలో ఔచిత్యం ఏమిటి? పేదలు మాత్రం సెంటు స్థలంలోనే ఇల్లు కట్టుకొని రాజప్రాసాదంగా భావించాలని కోరుకోవడం వంచన కాదా? నీ పిల్లలు విదేశాల్లో చదువుకోవాలిగానీ పేదల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని కోరుకోవడం పేదల ప్రతినిధి చేసే పనేనా? నీ కుమార్తెల వలె పేదల పిల్లలను కూడా ప్యారిస్, లండన్‌లో చదివించవచ్చు కదా? ఇలా ప్రశ్నిస్తామనే దాడులకు తెగబడుతున్నారు. నీ సొంత చెల్లి ఇప్పుడు నిన్ను కడిగిపారేస్తున్నారు కదా, నీ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు కదా! ఇప్పుడు ఆమెపై కూడా దాడులు చేయిస్తారా? మీడియాపైకి ప్రజలే తిరగబడుతున్నారని చెబుతున్నారు కదా, అదే నిజమైతే, ప్రజల్లో నిజంగా అంత చైతన్యమే ఉంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎప్పుడో తరిమికొట్టేవారు. అసలు ఆయనను ముఖ్యమంత్రి పీఠంపైనే కూర్చోబెట్టేవారు కారు. తాను ఎప్పుడైతే ముఖ్యమంత్రి సీటులో కూర్చున్నారో అప్పుడే ప్రజలు ఉత్త అమాయకులని, వారిని పదే పదే బురిడీ కొట్టించవచ్చునని జగన్మోహన్ రెడ్డి నిర్ధారణకు వచ్చారు. అందుకే రాష్ట్రంలో కులాల కుంపట్లు రాజేసి చలి కాచుకొనే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని అమరావతిని చంపేసి, మూడు రాజధానుల పాట పాడుతూ ఐదేళ్లు కాలక్షేపం చేసి ఇప్పుడు మరికొంత కాలం హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండాలనడం ప్రజలు అమాయకులు, ఏదీ పట్టించుకోరనే కదా? రాష్ట్రం కర్మ కాలి జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే వాషింగ్టన్ రాజధానిగా ఉండాలని వాదిస్తారేమో తెలియదు. ఏది ఏమైనా మీడియాపై మీ ఉన్మాద మూకలు చేయబోయే దాడులను ఎదుర్కోవడానికి మేం కూడా సిద్ధం. నియంతృత్వ పోకడలను, కపట విన్యాసాలను మేం ప్రశ్నిస్తూనే ఉంటాం!

> సొంత మీడియా కలిగి ఉండి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛ గురించి ఉపన్యాసాలు దంచిన జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజ స్వరూపం బయటపెట్టుకుంటున్నారు. రేపు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే తన మీడియాలో పనిచేసే వారిపై ఇటువంటి దాడులు జరిగితే జగన్ ఎలా స్పందిస్తారో చూడాలి.

> బడుగు బలహీన వర్గాల ఓట్లు కావాలి కనుక జగన్మోహన్ రెడ్డి ‘నా’ అనే పాట పాడుతుంటారు. తన పల్లకి మోసే బోయీలుగానే ఆ వర్గాలు ఉండిపోవాలని ఆయన కోరుకుంటారు. అందుకే అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా వారెవరినీ రానివ్వరు. రాజకీయంగా, ప్రభుత్వపరంగా తన తరఫున వ్యవహారాలను చక్కదిద్దుతున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎంత మంది ఉన్నారో జగన్మోహన్ రెడ్డి చెప్పాలి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జవహర్ రెడ్డి ఎవరు? పార్టీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, విజయసాయి రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎవరు? తనకు నెల నెలా వసూళ్లు చేసి పెడుతున్న గనుల శాఖ డైరెక్టర్ వెంకట రెడ్డి, మద్యం సరఫరా చేసే సంస్థ ఎండీ వాసుదేవ రెడ్డి ఎవరు? వీళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎందుకు లేరు? అంటే ఆ వర్గాలలో సమర్థులు లేరా? లేక వారిపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నిజంగా నీ వాళ్లయితే ఆ వర్గాలతో వియ్యం అందుకోగలవా, బంధుత్వం పెట్టుకోగలవా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే తప్పేమిటి?

బీజేపీ పాత్ర ఏమిటో!?

తెలుగు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఎటువంటి పాత్ర పోషించబోతోంది అన్నది ఇప్పుడు తెలుగునాట చర్చనీయాంశంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనతో చేతులు కలుపుతామని చెప్పి పదిహేను రోజులు దాటినా బీజేపీ నుంచి స్పందన లేకపోవడం అనేక ఊహాగానాలకు తావిస్తున్నది. జగన్మోహన్ రెడ్డి కోరికను మన్నించి ఈ రెండు పార్టీలతో పొత్తుకు ప్రధాని మోదీ విముఖత వ్యక్తం చేస్తారా? అన్న అనుమానం ఆయా పార్టీల నాయకుల్లో వ్యక్తమవుతోంది. రేపో మాపో కబురు చేస్తామంటూ పక్షం రోజులు గడచినా బీజేపీ నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించాయి. భారతీయ జనతా పార్టీతో పొత్తు ఉన్నా లేకపోయినా కలిసే వెళ్లాలని తెలుగుదేశం–జనసేన నిర్ణయించుకున్నాయి. ఎన్నికలు సజావుగా జరగాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం అవుతున్నందున బీజేపీతో కలవాల్సిన పరిస్థితి ఈ కూటమికి ఏర్పడుతోందన్నది బహిరంగ రహస్యమే. ప్రస్తుతానికి బీజేపీ కేంద్ర నాయకత్వం గుంభనంగా ఉంది. రాబోయే కొద్ది రోజుల్లో బీజేపీ పెద్దలు తమ వైఖరి స్పష్టం చేసే అవకాశముంది. ఆ తర్వాత మాత్రమే రాష్ట్ర రాజకీయాల్లో స్పష్టత వస్తుంది. తెలంగాణ విషయానికి వస్తే భారత రాష్ట్ర సమితితో పొత్తు పెట్టుకోకూడదని బీజేపీ అగ్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చింది. పొత్తు ప్రతిపాదనలతో వచ్చిన బీఆర్ఎస్ ప్రతినిధుల వద్ద బీజేపీ పెద్దలు తమ వైఖరి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వాతావరణం తమకు అనుకూలంగా ఉందని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీయగలిగితే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగవచ్చునన్నది వారి ఆలోచన. బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిజంగా దెబ్బతింటే దాని ప్రభావం ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన కూడా పడుతుంది. బీఆర్ఎస్ దెబ్బ తింటే బీజేపీని ఎదుర్కోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంత ఈజీ కాదు. బీజేపీతో బీఆర్ఎస్ కూడా ఎంతో కొంత బలంగా నిలబడటం కాంగ్రెస్ పార్టీకి అవసరం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తమకు ఢోకా లేదన్న భరోసాతో ఉండింది. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో బీజేపీ బలహీనపడటంతో కేసీఆర్ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి తన ఉనికిని కోల్పోకుండా మనగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా కవచంలా ఉపయోగపడుతుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ముఖ్యులు కూడా గుర్తించారు. తాజా సర్వేల ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రథమ స్థానంలో, బీజేపీ ద్వితీయ స్థానంలో, బీఆర్ఎస్ తృతీయ స్థానంలో ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పక్కచూపులు చూడకుండా కట్టడి చేయడం కేసీఆర్‌కు శక్తికి మించిన పనే. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్, బండి సంజయ్ వంటి వారు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి ఈటల రాజేందర్ పోటీ చేసే అవకాశముంది. ఈ ఇరువురూ గెలిస్తే, వారిలో ఒకరు కేంద్ర మంత్రి అవుతారన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో తమకు అధికారం వస్తే బీసీనే ముఖ్యమంత్రి అవుతారని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించి ఉన్నందున రేసులో ఈటల, బండి ఉంటారు. ఏ కారణం వల్లనైనా ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిక్కులు తప్పవు. కేంద్రంలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుదురుగా ఉండనిస్తారని భావించలేం. ఛండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా ఏం జరిగిందో చూశాం. సుప్రీంకోర్టులో విచారణ జరిగి ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన వ్యక్తిని మేయర్‌గా ప్రకటించిన తర్వాత కూడా ఆ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లను బీజేపీలో చేర్చుకున్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఇవి రోజులు కావు. ప్రధాని మోదీ కూడా నైతికత కంటే గెలుపునకే ప్రాధాన్యత ఇస్తారని అనేక సందర్భాలలో రుజువైంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతుందన్న విషయమై ఆసక్తి నెలకొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పూర్తి కాలం అధికారంలో కొనసాగనిస్తారా? అన్న సందేహం పలువురిలో ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఏమి జరుగుతున్నదో తెలుసు. బీజేపీ నుంచి ఎదురుకాబోతున్న ప్రమాదం నుంచి బయటపడేందుకు రేవంత్ రెడ్డి ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. శాసనసభలో ప్రస్తుతం ఎనిమిది సీట్లు మాత్రమే ఉన్న బీజేపీ నుంచి ఇటు అధికార పక్షం, అటు ప్రధాన ప్రతిపక్షం ముప్పును ఎదుర్కోవలసి రావడం నరేంద్ర మోదీ మహిమే అని చెప్పుకోవలసి ఉంటుంది. మహారాష్ట్రలో ఏం జరిగిందో తెలిసిందే! శివసేన, ఎన్సీపీ వంటి పార్టీలు చేతులు మారాయి. ఆ పార్టీల అధినేతలైన ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ తమ పార్టీలకు వేరే పేర్లు పెట్టుకున్నారు. మోదీ మార్కు రాజకీయం ఇలాగే ఉంటుంది మరి!

> రాజకీయ నాయకులు ఉన్నవీ లేనివీ చెప్పడం సహజమే కానీ జగన్మోహన్ రెడ్డిలా పచ్చి అబద్ధాలు చెప్పేవారిని ఇప్పుడే చూస్తున్నాం. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి కూడా తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇచ్చినందున ఆయనను కూడా మన రాష్ట్రానికి చెందినవాడు కాదని దాడి ప్రారంభించినా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. తన సభలకు తీసుకు వస్తున్న జనాలందరూ వెర్రిబాగులోళ్లు అని భావించే ముఖ్యమంత్రి, చెప్పిన అబద్ధం చెప్పకుండా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబులాంటి వాడు రాజకీయాలలో ఇంకా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందని జగన్మోహన్ రెడ్డి తాజాగా సెలవిచ్చారు. చంద్రబాబు విధానాలతో, రాజకీయాలతో విభేదించే వాళ్లు కూడా ఆయన రాజకీయాలలో ఉండదగిన వ్యక్తి కాదని విమర్శించే సాహసం చేయరు. జగన్‌రెడ్డే రాజకీయాలలోకి వచ్చి ముఖ్యమంత్రి కాగలిగినప్పుడు రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు. ఒక్క జగన్ మాత్రమే చంద్రబాబు రాజకీయాలలో ఉండడాన్ని సహించలేకపోతున్నారు. అందుకే ఆయన రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

యూట్యూబ్‌లో ‘కొత్త పలుకు’ కోసం QR Code scan చేయండి

జబ్బు కంటే ప్రమాదం ‘మద్దతు’ ఔషధం

> మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు వ్యవసాయోత్పత్తులను సేకరించటానికి చట్టబద్ధత ఇచ్చి నిరంతరం కొనసాగించటానికి అవసరమైన భారీ మొత్తాల్ని కేటాయించటానికి ఖజానాలో డబ్బు ఉంటే గదా! పంట ధరల్ని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణల్ని తొలగించటం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించటం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, రుణ వ్యవస్థల్ని బలోపేతం చేయటం, అదనపు విలువను ప్రోత్సహించటం, మార్కెట్ గొలుసును కుదించటానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులను పెంచటం మాత్రమే పరిష్కారం.



పంజాబ్ రైతుల ఆందోళన భారతీయ వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను లేవనెత్తుతోంది. స్వాతంత్ర్యం వచ్చాక అనుసరించిన అసంబద్ధమైన లైసెన్స్ పర్మిట్ కోటా రాజ్యవ్యవస్థకి దశాబ్దాల తరబడి బాధితులు మన రైతులు. వారి జీవితాలను పణంగా పెట్టి వ్యవసాయోత్పత్తుల ధరల్ని తగ్గించటమే ధ్యేయంగా సాగు రంగంలో మన విధాన నిర్ణేతలు వ్యవహరించారు. నిరంతరం ఉప్పు, నిప్పుగా వ్యవహరించే పార్టీలు ఈ విషయంలో మాత్రం విభేదాలను అధిగమించి రాజకీయాలకతీతంగా ఏకమయ్యాయి. ధరల పెరుగుదలకు అవసరమైన పద్ధతుల్ని, ప్రోత్సాహకాల్ని ఎన్నడూ పనిచేయనివ్వలేదు. రైతుల్ని ఒక పద్ధతి ప్రకారం పేదలుగా, నిరంతరం చేయి జాచి అర్థించేవారుగా తయారుచేశారు. రవాణా, నిల్వ, అమ్మకాలపై అసంబద్ధమైన, అహేతుకమైన, అవినీతిమయమైన నియంత్రణల వల్ల మార్కెట్లు అపసవ్యంగా మారి ధరల అంతరాలు సాధారణమయ్యాయి. తక్కువ ధరలతో బలవంతంగా ఆహారధాన్యాలను సేకరించటం వల్ల రైతులు పేదరిక విషవలయంలో కూరుకుపోయారు. అవినీతి నిండిన నియంత్రణ, సేకరణ, ప్రజా పంపిణీ లొసుగులమయమై దళారీల్ని పెంచింది. ఖజానాకి నష్టాలు కలిగించటంతోపాటు రైతుల నడ్డి విరిచింది.

నిల్వ ఉండే ఉత్పత్తుల విషయంలో కూడా ధరల ఒడిదుడుకుల్ని తట్టుకుని రైతులు నిలబడగలిగేలా సరైన ఏర్పాట్లు లేవు. నిల్వ సామర్థ్యం, రుణ సదుపాయం చాలా తక్కువగా ఉన్నాయి. శీతల నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్ లేక కుళ్లిపోయే పంటల్లో 30 శాతం వృథా అవుతున్నాయి. చాంతాడంత పొడవున్న, అసమర్థమైన మార్కెట్ గొలుసు వల్ల వినియోగదారులు చెల్లించే డబ్బులో అత్యధికంగా దళారీలకే పోతోంది. రైతులకు కేవలం 25–30శాతం దక్కుతోంది.

పరిష్కారం మార్కెట్లను మరింత తారుమారు చేయటం, వ్యవసాయోత్పత్తుల సేకరణ, ఎంఎస్‌పి (కనీస మద్దతు ధర)ను చట్టబద్ధం చేయటంలో లేదు. 2006 ప్రాంతం వరకు ఆహారధాన్యాలను తక్కువ ధరనిచ్చి బలవంతంగా సేకరించటం నిబంధనగా ఉండేది. అప్పట్నుంచి కొన్ని రకాల ఆహారధాన్యాలకు ఎంఎస్‌పిని మార్కెట్ ధరల కంటే ఎక్కువగా పెంచారు. దీంతో సేకరణకి డిమాండ్ పెరుగుతూ వచ్చింది. అంతకుముందు ప్రభుత్వ జోక్యం చాలామేరకు మార్కెట్ ధరలను అణగదొక్కగా, ఇప్పుడు ఆహారధాన్యాల తప్పనిసరి సేకరణ ధరల సంకేతాల్ని అపసవ్యం చేసింది. ధరల పెరుగుదలకు అవరోధమయ్యే మూర్ఖమైన ప్రోత్సాహకాన్ని సృష్టించింది. దీంతో, మనం అవసరాలకి మించి ఆహారధాన్యాలు ఉత్పత్తి చేస్తున్నాం, మార్కెట్‌లో నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవంక ఇతర రకాల ఆహార వినియోగం పెరిగి బియ్యం, గోధుమ వంటి ధాన్యాల తలసరి వినియోగం తగ్గుతోంది. పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలకు డిమాండ్ వేగంగా పెరుగుతుండగా, మరింత ఎక్కువ మంది రైతులు మరింత ఎక్కువ గోధుమలు, వరి పండించటానికి ప్రోత్సాహకాలనిస్తున్నారు! వరి సాగు విస్తీర్ణం సుమారు తొమ్మిది రెట్లు, 5 మిలియన్ హెక్టార్ల నుంచి 44 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. గోధుమ మూడు రెట్లు, 9.8 నుంచి 29.8 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. ఈ సంవత్సరం మన ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో 330 మిలియన్ టన్నులు ఉంది. కాబట్టి ఎంఎస్‌పి, ధాన్యం సేకరణ కేవలం ఒక సంక్షోభ పరిస్థితికి తాత్కాలిక అత్యవసర చర్య మాత్రమే తప్ప, రైతులకి, దేశానికి దీర్ఘకాల ప్రయోజనాలని చేకూర్చదు.

ధరల సంకేతాలకు వ్యతిరేక దిశలో వ్యవహరించటం, మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా మూర్ఖమైన ప్రోత్సాహకాలను కొనసాగించటమంటే, రైతులను శాశ్వతంగా ఆచరణసాధ్యంకాని ఆర్థిక భారంతో ప్రభుత్వం అందించాల్సిన సాయంపై ఆధారపడేవారుగా తయారుచేయటం. 2023–24 తాత్కాలిక బడ్జెట్ అంచనాల ప్రకారం, యూనియన్ ప్రభుత్వ స్థూల ఆదాయాలన్నీ కలిపినా రాష్ట్రాలకు బదిలీ చేసే మొత్తం నిధులు, వడ్డీ చెల్లింపులు, జీతాలు, పెన్షన్లకే అరకొరగా సరిపోతోంది. సబ్సిడీలకు (ఎక్కువగా ఎరువులు, ఆహారం), వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కూడా దేశం అప్పులు చేయాల్సి వస్తోంది. మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు వ్యవసాయోత్పత్తులను సేకరించటానికి చట్టబద్ధత ఇచ్చి నిరంతరం కొనసాగించటానికి అవసరమైన భారీ మొత్తాల్ని కేటాయించటానికి ఖజానాలో డబ్బు ఉంటే గదా!

సమాధానం ఏమిటి? పంట ధరల్ని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణల్ని తొలగించటం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించటం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, రుణ వ్యవస్థల్ని బలోపేతం చేయటం, అదనపు విలువను ప్రోత్సహించటం, మార్కెట్ గొలుసును కుదించటానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులను పెంచటం మాత్రమే పరిష్కారం.

మన నిరసనలు, ఆందోళనల రాజకీయాల్లో రైతుల సంక్షేమం, దేశ దీర్ఘకాల ప్రయోజనాలు ఎలా విస్మరణకు గురయ్యాయో పంజాబ్ రైతుల డిమాండ్లు తేటతెల్లం చేస్తున్నాయి. రుణ మాఫీ, డబ్ల్యుటీఓ నుంచి ఉపసంహరణ, విద్యుత్ చట్టం ఉపసంహరణ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రద్దు వగైరా డిమాండ్లు చూస్తే రైతుల నిజమైన సమస్యను నిష్ప్రయోజనకర రీతిలోకి మళ్లించారని స్పష్టమవుతుంది. రైతులకి ఎక్కువ ఆదాయాలతో మెరుగైన భవిష్యత్తును నిర్మించటానికి బదులు పిడివాదం, బూజుపట్టిన ఆలోచనాధోరణులతో ఇంకా అదే తరహా విఫల, తిరోగమన విధానాల కోసమే వాదిస్తున్నారన్నది సుస్పష్టం. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ నేపథ్యంలో జాతీయ స్థాయి ప్రభుత్వం బియ్యం ఎగుమతిని నిషేధించింది. అలాగే చవకగా దిగుమతి అయ్యే పామ్ ఆయిల్‌పైన సుంకాలని తొలగించటంతో మన రైతులకి రక్షణ లేకుండా పోయింది. కిలో ఆయిల్‌పామ్ పళ్ళ ధర రూ.23 నుంచి ప్రస్తుతం రూ.12కి పడిపోయింది. పంజాబ్ రైతుల డిమాండ్లు అటువంటి అంశాల్ని కనీసం ప్రస్తావించకపోవటాన్ని చూస్తే, ఒక నిర్దిష్టమైన స్థానిక సమస్యను జాతీయ సమస్యగా మారుస్తున్నారని, నిరసనకారుల నాయకులు, వారి తరఫున మాట్లాడుతున్న వారికి నిజంగా రైతుల సంక్షేమానికి అవసరమైన ఒక సమగ్ర ఎజెండా లేదని స్పష్టమవుతుంది.

భారత్‌లో 45శాతం జనాభాని 18–20శాతం జీడీపీ వాటా గల వ్యవసాయం పోషించటం సాధ్యం కాదు. పంజాబ్ రైతుల డిమాండ్లలో చాలా వరకు అసంబద్ధమైనా, ఆ ఆందోళన ఒక మేలుకొలుపు కావాలి, గ్రామీణ, వ్యవసాయరంగ సంక్షోభాన్ని దృఢ నిశ్చయంతో పరిష్కరించాలి.

• డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

నేడు, రేపు భారత్ బచావో సదస్సు

భారత్ బచావో అఖిలభారత విద్యార్థుల సదస్సు ఫిబ్రవరి 25, 26 తేదీలలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాల ఆశయాల సాధనలో భాగంగా జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి, ఫీజుల పెంపును వ్యతిరేకించాలి, ఉమ్మడి శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలి, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలి, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వోద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి, విశ్వవిద్యాలయాల్లో లింగ, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలి, స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల పునరుద్ధరణ, పెంపులను అమలు చేయాలి, క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే డిమాండ్లతో ఈ సదస్సు జరుగుతోంది. మనోరంజన్ మహంతి, హరగోపాల్, అన్వర్‌ఖాన్, జస్టిస్ కోల్సే పాటిల్, రాంపునియాని, లక్ష్మీనారాయణ, పద్మజా షా, అనితా రాంపాల్, మధుప్రసాద్, నిరంజన్ ఆరాధ్య, పిఎల్ విశ్వేశ్వర రావు, తిరుమలి ఇనుకొండ, దాసోజు లలిత, జెబి రాజు, విమలక్క, కె.శ్రీనివాస్, ఆకునూరి మురళి, పాశం యాదగిరి తదితరులు ప్రసంగిస్తారు.

– అఖిలభారత విశ్వవిద్యాలయాల విద్యార్థులు



జాతర నాలుగోరోజు తల్లుల దర్శనానికి పోటెత్తిన భక్తులు



మళ్లొస్తామంటూ మేడారం నుంచి తిరుగుపయనమైన ఓ కుటుంబం



మదినిండా భక్తి నిండగా..



సమ్మక్కను వనప్రవేశానికి తీసుకెళ్తున్న పూజారులు



సారలమ్మను వన ప్రవేశం చేయిస్తున్న పూజారులు

మళ్లీ రెండేళ్లకొస్తామంటూ వనదేవతలకు వీడ్కోలు

- ప్రశాంతంగా సాగిన తల్లుల వనప్రవేశం
- ముగిసిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహాజాతర
- తిరుగు ప్రయాణమైన భక్తజనం
- ఖాళీ అయిన గుడారాలు.. నిశ్శబ్దం ఒడిలోకి వనం
- నాలుగో రోజూ పెద్దఎత్తున కొనసాగిన దర్శనాలు
- వీఐపీల రాకతో సందడిగా గద్దెల ప్రాంగణం



బస్సులో తిరుగు ప్రయాణమవుతున్న భక్తులు

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం మహాజాతర ముగిసింది. శనివారం నలుగురు దేవతలు వనప్రవేశంతో నాలు గురోజుల పాటు సాగిన జాతరకు తెరపడింది. మొక్కులు చెల్లించుకున్న భక్తులు తిరుగు ప్రయాణం పట్టడంతో మేడారం లోని గుడారాలన్నీ ఖాళీ అవుతున్నాయి. జనఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారి పోయింది. మళ్లీ రెండేళ్ళకు వస్తాం తల్లీ.. చల్లగా చూడు.. కోరిన కోర్కెలు తీరితే నిలువెత్తు బంగారం ఇస్తాం.. అంటూ గద్దెల వైపు తిరిగి ముకుళిత హస్తాలతో మనసులోనే దూరం నుంచే కడసారి మొక్కుకుంటూ అద్వితీయ భావనతో, ఆనందం నిండిన కళ్లతో తమ ఇళ్లకు తిరిగి బయలు దేరారు.



సమ్మక్క గద్దెకు మొక్కుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్



తల్లుల వనప్రవేశం

నాలుగు రోజులుగా లక్షలాది మంది భక్తుల పూజలు అందుకున్న దేవతలు శనివారం సాయంత్రం వనప్రవేశం చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు దర్శనాలను నిలిపివేశారు. గద్దెలపై పేరుకు పోయిన బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ, కొబ్బరికాయలను తొలగించి శుద్ధి చేశారు. ఆ తర్వాత సాయంత్రం 6గంటల తర్వాత వనప్రవేశం తంతు మొదలైంది. తొలుత సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్యతో పాటు సిద్దబోయిన మునీందర్, చందాబాబు రావు, సిద్దబోయిన మహేష్, సిద్దబోయిన లక్ష్మణ్‌రావు సాయంత్రం 6.43గంటలకు గద్దెకు చేరుకున్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం రహస్యంగా పూజలు

మిగతా 7వ పేజీలో..

అందరికీ థ్యాంక్స్!

- జాతర విజయవంతం చేసిన అధికారులకు కృతజ్ఞతలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క



మేడారం బృందం, ఫిబ్రవరి 24: జాతరను విజయవంతం చేసేందుకు కష్టపడిన అన్ని శాఖల అధికారులకు, జాతరను ఎప్పటికప్పుడు ప్రపంచానికి చూపించిన మీడియా ప్రతినిధులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. శనివారం మేడారంలోని మీడియా పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద జాతర మేడారం అన్నారు. నాలుగు రోజుల్లోనే 1కోటి 45లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారని చెప్పారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి ఇంత పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం ఈ ప్రాంత వాసులుగా తమకు చాలా గర్వకారణమన్నారు. ప్రభుత్వం ఏర్పడి కొద్ది రోజులు అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతరకు అత్యధికంగా నిధులు కేటాయించారని, అందుకు సీఎంకు కృతజ్ఞతలు

మిగతా 7వ పేజీలో..



తాడ్వాయి మార్గంలో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ జామ్

- పస్రా-తాడ్వాయి మధ్య నిలిచిన వాహనాలు
- గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుకున్న భక్తులు
- పర్యవేక్షణ లేక అదుపు తప్పిన పరిస్థితి

6

రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉద్యోగి సస్పెన్షన్

- స్టాంప్ వెండర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన జూనియర్ అసిస్టెంట్
- విచారణ చేసి చర్యలు తీసుకున్న అధికారులు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 24 : ఓ స్టాంప్ వెండర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని స్టాంప్స్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.దేవేందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. పది రోజుల క్రితం దేవేందర్ స్టాంప్ వెండర్ నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో సదరు స్టాంప్ వెండర్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు అతడిని నేరుగా పట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ వీలు కాలేదు. అయితే తనపై ఏసీబీ అధికారులు వేసిన స్కెచ్‌ను ముందుగా గమనించిన దేవేందర్ తప్పించుకోగా.. ఈ విషయం రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. స్పందించిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు దేవేందర్‌ను కొడకండ్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై బదిలీ చేసి విచారణ చేపట్టారు. విచారణలో దేవేందర్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలడంతో శుక్రవారం రాత్రి అతడిపై సస్పెన్షన్ వేటు వేయగా.. ఈ విషయాన్ని జిల్లా రిజిస్ట్రార్ రవి ధ్రువీకరించారు. ఎవరు అవినీతికి పాల్పడినా శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కాగా, దేవేందర్‌పై వచ్చిన ఆరోపణల గురించి ఈనెల 17న 'రిజిస్ట్రేషన్ కార్యాలయంపై ఏసీబీ నజర్, ఏసీబీ స్కెచ్, త్రుటిలో తప్పించుకున్న ఉద్యోగి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించగా.. అది తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రైవేటు ఉద్యోగులపైనా నజర్

జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అనధికారికంగా విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు వ్యక్తులపైనా ఉన్నతాధికారులు నజర్ పెట్టినట్టు సమాచారం. ప్రతీ కార్యాలయంలో ఆ కార్యాలయ అధికారులు సొంతంగా నెలనెలా డబ్బులు చెల్లిస్తూ ప్రైవేటు ఉద్యోగులను ఏర్పాటు చేసుకుని దందాలు

మిగతా 8వ పేజీలో..


జంపన్నవాగులో పుణ్యస్నానం ఆచరిస్తున్న యువతి


శివసత్తి పూనకం


సమ్మక్క - సారలమ్మల గద్దెల ప్రాంగణం వద్ద కిటకిటలాడుతున్న భక్తులు

అంగరంగ వైభవంగా..

ముగిసిన మేడారం జాతర.. ఆ నాలుగు రోజుల్లో పోటెత్తిన భక్తజనం

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఘనంగా ముగిసింది. జాతర నాలుగు రోజులు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నెల 21న సారలమ్మరాకతో మహాజాతర సంరంభం మొదలైంది. ఈ సారి సారలమ్మ రాక ఆలస్య మైంది. అర్ధరాత్రి 12 గంటల తర్వాత తల్లి గద్దెకు చేరింది. సారలమ్మతో పాటు ఆనవాయితీ ప్రకారం పగిడిద్దరాజు, గోవిందరా జులు, జంపన్నలు కూడా గద్దెకు చేరారు. మరునాడు గురువారం సమ్మక్క తల్లి గద్దెకు చేరుకోవ డంతో మహాజాతర పతాక స్థాయికి చేరుకున్నది. ఏకకాలం లో నలుగురు దేవతలు గద్దెలపై కొలువై ఉండగా భక్తులు తమ మొక్కులను సమర్పించుకున్నారు. నిలువెత్తు బంగారాన్ని (బెల్లం), పసుపు, కుంకుమ, గాజులు, చీర, రవిక బట్టలను సమర్పించి తల్లుల దీవెనలను పొందారు. శుక్ర, శనివారాలు మొక్కులు కొనసాగాయి. శనివారం తల్లుల వనప్రవేశం తర్వాత కూడా భక్తులు దర్శనాలు చేసుకున్నారు.

వీఐపీల రాక

జాతరకు పలువురు వీఐపీలు తరలివచ్చారు. మొదట కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మేడారం సందర్శించి ఎత్తుబంగారంతోపాటు పట్టువస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క గద్దెపైకి చేరుకున్న తర్వాత శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండాతో పాటు పలువురు మంత్రులు, మాజీ మంత్రులు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తల్లులను దర్శించుకున్నారు.

రూ.105కోట్లు

జాతర ఏర్పాట్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.105 కోట్లను మంజూరు చేసింది. దీంతో భక్తుల సౌకర్యార్థం వివిధ పనులను చేపట్టారు. సివిల్ కాంపోనెంట్, నాన్ సివిల్ కాంపోనెంట్ పనులకు ఈ నిధులను ఖర్చు చేశారు. అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు. మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రోడ్లు భవనాల శాఖ రూ.13కోట్లు, భక్తులకు మరుగుదొడ్ల సౌకర్యాలకు గ్రామీణ నీటిపారుదల శాఖ రూ.13.50కోట్లు, తాగునీటి అందించేందుకు మరో రూ.6కోట్లను ఖర్చు చేసింది. స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలకు చాలినన్ని బ్యాటరీ ట్యాపులను, ఎన్‌పీడీసీఎల్ రూ.16కోట్లతో నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యాలు కల్పించింది. జాతర పరిసర ప్రాంతాలను 10 జోన్లు, 38 సెక్టార్లు, 60 సబ్ సెక్టార్లుగా విభజించారు. ప్రతీ సెక్టారుకు సెక్టోరియల్ అధికారితో పాటు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఒక్కో సెక్టార్‌కు ముగ్గురు చొప్పున 150మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. భక్తులకు మెరుగైన రవాణాకు ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా 6,500 బస్సులను నడిపింది. మహాలక్ష్మీ పథకం కింద బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఈసారి మహిళలు అధిక సంఖ్యలో జాతరకు వచ్చారు. వైద్య, ఆరోగ్య శాఖ భక్తులకు మెరుగైన వైద్యసేవలను అందించింది. రాష్ట్ర పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నీ తానై జాతరను దగ్గరుండి పర్యవేక్షించారు. ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు జాతర నిర్వహణలో కీలక భూమిక పోషించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో మేడారం మహాజాతర దిగ్విజయంగా ముసింది.

అపశ్రుతులు

జాతరలో అక్కడక్కడా అపశ్రుతులు దొర్లాయి. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు ఇతరత్రా కారణాల వల్ల నలుగురు మృతి చెందారు. ఈ సారి కూడా ట్రాఫిక్ జామ్‌లు తప్పలేదు. శుక్రవారం పస్రా-తాడ్వాయి మధ్య ట్రాఫిక్ జామ్ జరిగి భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కోటిన్నర మందికిపైగా..

జాతరకు కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరైనట్టు అంచనా వేస్తున్నారు. నెల రోజుల ముందు నుంచే భక్తులు మేడారానికి రావడం మొదలైంది. జాతర ప్రారంభం అయ్యేనాటికే సుమారు 25 నుంచి 30 లక్షల మంది వరకు దర్శనాలు చేసుకున్నారు. జాతర జరిగిన ఈ నాలుగు రోజులు కోటి నుంచి కోటి 20 లక్షల మంది వరకు వచ్చారని అధికారులు తెలిపారు. కరోనా వల్ల రెండు జాతరలకు భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారని, ఈ సారి మాత్రం ఊహించిన దానికన్నా ఎక్కువ మంది హాజరయ్యారు. జాతర మొదటి రోజే భక్తులు పోటెత్తారు. సమ్మక్కతల్లి గద్దెకు చేరుకున్న తర్వాత భక్తుల రాక మరింత పెరిగింది. జాతర చివరి రోజైన శనివారంనాడు కూడా భక్తుల రాక కొనసాగింది. గద్దెలు కిటకిటలాడుతూ కనిపించాయి.


వనదేవతలకు యువతి మొక్కులు

ఎంతో మహిమ కలిగిన దేవతలు

25 ఏళ్లుగా తల్లులను దర్శించుకుంటున్నాను : స్పీకర్ గడ్డం ప్రసాద్


తల్లులకు ఎత్తు బంగారం ఇస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం సమ్మక్క, సారలమ్మ తల్లులు ఎంతో మహిమ కలిగిన దేవతలని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మేడారంలోని సమ్మక్క, సారలమ్మలను దర్శించుకున్నారు. తొలుత గద్దెల ముందు ఏర్పాటు చేసిన తులాభారం వద్ద తన ఎత్తు బంగారం(72 కిలోలు) సమర్పించారు. అక్కడి నుంచి గద్దెలకు చేరుకొని చీర, గాజులు, పసుపు, కుంకుమను తల్లులకు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్పీకర్ ప్రసాద్ మాట్లాడుతూ... తల్లులు ఎంతో మహిమ గల దేవతలన్నారు. 25 ఏండ్లుగా తల్లులను దర్శించుకుంటున్నానని అన్నారు. సంతానం కోసం సమ్మక్క తల్లికి మొక్కుకున్నానని, ఆ తల్లి ఆశీర్వాదంతో తనకు సంతానం కలిగారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి ఏర్పాట్లు లేవని భక్తులు చెబుతున్నారన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారని వారిని అభినందించారు. ఆయన వెంట మంత్రి సీతక్క తదితరులు ఉన్నారు.

రెండు లక్షల మందికి చికిత్స

- జాతర సందర్భంగా 73 వైద్య శిబిరాలు
- విధుల్లో 1,126 మంది సిబ్బంది


30 పడకల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం జాతరలో వైద్యశాఖ విస్తృత సేవలు అందించింది. దారుల వెంట 42 ప్రథమ చికిత్స కేంద్రాలు, మేడారంలో 30 వైద్య శిబిరాలు, తల్లుల గద్దెల సమీపంలో 30 పడకల ఆస్పత్రిని అధికారులు ఏర్పాటు చేశారు. సుమారు 2లక్షల పైగా భక్తులకు వైద్య సేవలు అందించినట్లు ములుగు జిల్లా వైద్యాధికారి అల్లం అప్పయ్య తెలిపారు. నాలుగు రోజులుగా జాతరకు వచ్చిన భక్తులు జ్వరం, జలుబు, వాంతులు, విరేచనాలతో కొందరు ఇబ్బందిపడగా గద్దెల సమీపంలో బెల్లం, కొబ్బరి కాయలు తగిలి పలువురు గాయపడ్డారని ఆయన వివరించారు. సుమారు 10వేల మంది శ్వాస సంబంధిత వ్యాధితో ఆస్పత్రుల్లో చేరారని, 5 వేలకు పైగా జ్వరంతో, వెయ్యి మంది గాయాలతో, 192 మంది తేలు కాటుతో ఇబ్బందిపడగా అందరికీ చికిత్స అందించామన్నారు.

1,126 మంది సేవలందించారు..

అల్లం అప్పయ్య, జిల్లా వైద్యాధికారి, ములుగు

మేడారం మహా జాతర సందర్భంగా 73 శిబిరాల్లో 1126 మంది వైద్య సిబ్బందిని నియమించాం. 150 మంది స్పెషలిస్టులు, 28 మంది ల్యాబ్ టెక్నీషియన్‌లు, 28 మంది ఫార్మసిస్టులు, 920 మంది ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బందితో సేవలు అందించాం. అవసరమైన మందులు, మాస్కులను అందుబాటులో ఉంచాం.

హుండీలలో దొంగల చేతివాటం


హుండీలలో చేయిపెట్టి డబ్బులు తీస్తున్న మహిళలు

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం జాతరలో దొంగలు చేతివాటం చూపారు. శనివారం రాత్రి దేవతల వనప్రవేశం జరుగుతున్న సమయంలో కొందరు అపరిచిత మహిళలు గద్దెల వద్ద ఏర్పాటు చేసిన హుండీలలో అందరూ చూస్తుండగానే చేతులు పెట్టి అందినంత కాజేశారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు కనీసం పట్టించుకోలేదు. ఆ మహిళల చేష్టలను గమనించిన పలువురు భక్తులు నిలదీయడంతో వారు అక్కడి నుంచి ఉడాయించారు. జాతర చివరి రోజున అటు ట్రాఫిక్‌ను, ఇటు గద్దెల వద్ద భక్తులను నియంత్రించడంలో విఫలమైన పోలీసు యంత్రాంగం చివరకు దేవతల గద్దెల వద్దే దొంగతనం జరుగుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆర్టీసీ విస్తృత సేవలు

- బస్సుల్లో తరలివచ్చిన భక్తులు
- ఇప్పటికే 13లక్షలు దాటిన ప్రయాణికులు
- ఇంకా రెండు లక్షలు పెరిగే అవకాశం


మేడారం జాతర నుంచి వెళుతున్న భక్తులు

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం జాతరలో ఈసారి ఆర్టీసీ కీలకపాత్ర పోషించింది. లక్షల సంఖ్యలో భక్తులను తరలించడమేకాదు సురక్షితంగా వారిని తిరిగి గమ్యస్థానాలకు చేర్చింది. ఇప్పటి వరకు తల్లుల దర్శనానికి దాదాపు 13లక్షలకు పైగా భక్తులను చేరవేసింది. మొత్తంగా మహాజాతరకు 32వేలకు పైగా ట్రిప్పులను నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

'మహాలక్ష్మి'కి ఆదరణ

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరంలా ఉపయోగపడింది. ఉచిత ప్రయాణానికి ప్రభు త్వం అవకాశం ఇవ్వడంతో పెద్ద సంఖ్యలో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. 40శాతం ఆక్యుపెన్సీకి వించి మహిళలు ఆర్టీసీ బస్సు ల్లో జాతరకు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మహిళలకు ఉచిత ప్రయాణం ఉండటంతో ప్రైవేటు వాహనాల వైపు చూడకుండా కుటుంబాలతో కలిసి ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించడం కుడా ఆర్టీసీకి అదనపు ఆదాయం తెచ్చిపెట్టింది. దీనికి తోడు గద్దెలకు సమీపంలోనే బస్టాండ్ ఏర్పాటు చేయడం కుడా బస్సుల్లో పెద్దసంఖ్యలో భక్తులు ప్రయాణించేందుకు మరో కారణమైందని అధికారులు చెబుతున్నారు.

తిరుగు ప్రయాణంతో పెరిగిన రద్దీ

ఈనెల 18నుంచే మేడారానికి ఆర్టీసీ సేవలు ప్రారంభం అయినప్పటికీ 21వ తేది నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఇప్పటి వరకు 13లక్షలకు పైగా భక్తులు ప్రయాణించగా వారిలో 11లక్షలకు పైబడి కేవలం ఈ నాలుగు రోజుల్లోనే చేరుకున్నారని అధికారులు చెబుతున్నారు. గతంలో కంటే మిన్నగా జాతరలో ఆర్టీసీ సేవలపై దృష్టిపెట్టిన అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 4వేల వరకు బస్సులను నడపడంతో పాటు మేడారం తాత్కలిక బస్టాండ్‌లో 72 పాయింట్లను ఏర్పాటుచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు మంచిర్యాల, గోదావరిఖని ఏరియాలకు ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మేడారం - తాడ్వాయి, పస్రా- తాడ్వాయి రూట్‌లలో వీపరితమైన ట్రాఫిక్ ఉంటుండటంతో ఎప్పటికప్పుడు ఆర్టీసీ అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ క్లియర్ చేయించారు. సోమవారం వరకు భక్తుల రద్దీ ఉంటుందని, అప్పటివరకు ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్య 15లక్షలకు చేరే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



మేడారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో భక్తులను తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

ట్రాఫిక్ జామ్

- పస్రా-తాడ్వాయి మధ్య నిలిచిన వాహనాలు
- గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కున్న భక్తులు
- నరకయాతన పడ్డ పిల్లలు, వృద్ధులు, మహిళలు

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం జాతరలో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం రాత్రి 12గంటల తర్వాత పస్రా-తాడ్వాయి మధ్య సుమారు 10కి.మీ మేర ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు ముందుకు కదలలేక, వెనక్కి రాలేక అందులో ప్రయాణిస్తున్న భక్తులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరేడు గంటల పాటు నరకయాతన అనుభవించారు. తాగడానికి నీళ్లు, తినడానికి తిండిలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వాహనాలు సాఫీగానే వెళ్లాయి. సాయంత్రం నుంచి సమస్య మొదలైంది. రాత్రి పొద్దుపోయిన తర్వాత పరిస్థితి అదుపు తప్పింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులకు కష్టమైంది.

అర్ధరాత్రి తర్వాత..

వనదేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం పూర్తయిన భక్తులంతా శుక్రవారం ఉదయం నుంచి పెద్ద ఎత్తున బయలు దేరడం మొదలు పెట్టారు. తిరుగు ప్రయాణం బాట పట్టిన భక్తులతో ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. ప్రయాణికులతో బస్సులు వెంట వెంటనే బయలుదేరాయి. దీంతో తిరుగుముఖం పట్టిన భక్తులతో ప్రైవేటు వాహనాలు కూడా భారీ సంఖ్యలో బయలు దేరాయి. మరోవైపు సమ్మక్కను దర్శించుకునేందుకు వేలాది మంది ప్రయాణికులు శుక్రవారమే జాతర బాట పట్టారు. వచ్చిపోయే వాహనాలతో మేడారం జాతర రోడ్లన్నీ నిండిపోయాయి. వాహనాలు ముందుకు వెళ్లడం కష్టమైంది. ఈ క్రమంలో రాత్రి 12 గంటల తర్వాత పస్రా-తాడ్వాయి మధ్య ట్రాఫిక్ జామ్ అయింది. సుమారు 10 కి.మీ మేరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు, ఆర్టీసీ సిబ్బంది ట్రాఫిక్‌ను సకాలంలో క్లియర్ చేయకపోవడంతో పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. వేల సంఖ్యలో వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య మరింత జఠిలమైంది. ఒక దశలో పోలీసులు చేతులెత్తేశారు. ఆరేడు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాల్లోని భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చింతల్ క్రాస్ నుంచి కన్నెపల్లి క్రాస్ రోడ్డు మధ్య కూడా ట్రాఫిక్ జామ్ అయింది. వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పలు ఇతర చోట్ల కూడా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ప్రతీసారి ఇదే తీరు..


రోడ్డుపైనే నిలిచిన వాహనాలు

ప్రతీ జాతరలో ఇదే జరుగుతోంది. సమ్మక్క గద్దెపైకి చేర్చే ఘట్టం విజయవంతంగా పూర్తికాగానే ఇక జాతర అయిపోయినట్లేనని పోలీసు బాసులు భావించడం వల్లే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న భావనను భక్తులు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సమ్మక్క గద్దె మీదికి రాకముందు కన్నా వచ్చిన తర్వాతే భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. దేవతల వనప్రవేశం జరిగిన తర్వాత కూడా భక్తులు మొక్కులు చెల్లించుకోవడం కొనసాగుతోంది. తల్లుల వనప్రవేశంతో మహాజాతర ముగిసినట్టేనని అంటారు. కానీ, భక్తులు అదేం పట్టించుకోకుండా వనప్రవేశం తర్వాత మరో రెండు మూడు రోజుల వరకు జాతరకు వస్తూనే ఉంటారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. తల్లులు గద్దెలపైకి వచ్చే వరకు విధి నిర్వహణ పట్ల చూపిన శ్రద్ధను ఆ తర్వాత కూడా భక్తుల రాక పూర్తిగా తగ్గిపోయే వరకు కొనసాగించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రిలాక్స్ అయిన పోలీసులు

విధుల నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్లేనే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు. జాతర మొదటి రెండు రోజులు అప్రమత్తంగా ఉన్న పోలీసు బాసులు, సిబ్బంది సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన తర్వాత రిలాక్స్ అయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం వీఐపీలు వరుసగా క్యూకట్టారు. సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్ర మంత్రి అర్జున్ ముండాతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు వనదేవతలను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. పోలీసులు వీరికి బందోబస్తు చేయడంతోనే సరిపోయింది. పైగా వీఐపీలు వచ్చినప్పుడల్లా దర్శనాలు గంటల తరబడి నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీఎం వచ్చిపోయిన తర్వాత పోలీసు బాసులు, పోలీసు సిబ్బంది రిలాక్స్ అయ్యారు. అప్పటి వరకు జాతర విధులపై చూపిన శ్రద్ధ ఆ తర్వాత తమ కుటుంబ సభ్యులకు తల్లుల దర్శనం చేయించడంపై మళ్లింది. డీఎస్పీ స్థాయి నుంచి కింది స్థాయి పోలీసుల వరకు తమకు డ్యూటీలు వేసిన ప్రాంతాల్లో ఉండకుండా కుటుంబ సభ్యులను తీసుకొని దర్శనానికి వెళ్లడం మొదలు పెట్టారు. విధులను పక్కనబెట్టి బంధువులను దర్శనానికి తీసుకువెళ్తున్న ఏఆర్ ఎస్ఐని ఎస్పీ కొట్టిన సంఘటనే ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. శుక్రవారం రాత్రి ఒక ఏఆర్ ఎస్ఐ డ్యూటీని పక్కన బెట్టి సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం తన భార్యను గద్దెల వద్దకు తీసుకువెళుతున్న క్రమంలో అక్కడే ఉన్న ఎస్పీ ఇది గమనించారు. ఆగ్రహించిన ఎస్పీ ఆ ఏఆర్ ఎస్ఐపై చేయి చేసుకున్నారు. పస్రా-తాడ్వాయి మధ్యనే కాకుండా మేడారానికి వచ్చే పలు మార్గాల్లో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడానికి ఇదే కారణం. భక్తుల సేవలో తరలించాల్సిన పోలీసులు కుటుంబ సేవలో లీనం కావడంతో ట్రాఫిక్ నియంత్రణపై పట్టు తప్పింది. ఫలితంగా భక్తులు కష్టాలు పడవలసి వచ్చింది. పోలీసుల తీరు పట్ల భక్తుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. తాము గంటల తరబడి క్యూలో నిల్చొని ఉండగా తమ కళ్ల ముందే పోలీసు అధికారులు, సిబ్బంది పలుకుబడిని ఉపయోగించి కుటుంబ సభ్యులను అడ్డదారిలో దర్శనానికి తీసుకువెళుతుండడం చూసి రగిలిపోయారు. కోపంతో తిట్ల వర్షం కురిపించడం కనిపించింది.


కన్నెపల్లి -మేడారం దారిలో ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్న వాహనాలు

అందరికీ థ్యాంక్స్!

(5వ పేజీ తరువాయి)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

తెలిపారు. సుమారు 20 శాఖల అధికారులను సమన్వయం చేసి జాతరను సక్సెస్ చేశామన్నారు. ఆర్టీసీ ద్వారా మేడారం జాతరకు 10వేల ట్రిప్పుల బస్సులు నడిచాయని తెలిపారు. 5,090 మంది భక్తులు తప్పిపోతే మిస్సింగ్ క్యాంపుల ద్వారా 5,060 మందిని వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చామన్నారు. జాతర పూర్తయిన పదిరోజుల వరకు పారిశుధ్య పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. తక్కువ సమయంలోనే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, జాతర విజయవంతానికి సహకరించిన పూజారులు, ఆదివాసీలు, అధికారులకు, భక్తులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే స్వీకరించి రానున్న జాతరకు సరిచేసుకుంటామన్నారు.



మేడారంలో చిరుజల్లులు

మేడారం బృందం, ఫిబ్రవరి 24 : మహాజాతర చివరి రోజున మేడారంలో చిరుజల్లులు కురిశాయి. వడ్డెలు (గిరిజన పూజారులు) సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ప్రతిరూపాలను వనానికి తరలిస్తుండగా ఒక్కసారిగా మేఘాలు వర్షించాయి. దీంతో జాతరకు వచ్చిన భక్తులు తమకు తల్లులు ఆశీస్సులు ఇస్తున్నట్లుగా భావించారు. జాతర ప్రారంభమైన తర్వాత మేడారంలో పగటిపూట ఎండ, ఉక్కపోతతో మూడురోజులు భక్తులు అవస్థలు పడ్డారు. కానీ, శనివారం ఆకాశం మేఘావృతం కావడంతో ఉపశమనం పొందారు. సాయంత్రం వేళ దేవతల వనప్రవేశ ఘట్టం జరుగుతుండగా జల్లులు కురవడం తల్లుల మహిమేనని భక్తులు భావించారు.

అంతరాయం లేకుండా

విద్యుత్ ఇచ్చాం

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కరుణాటి వరుణ్‌రెడ్డి

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కరుణాటి వరుణ్‌రెడ్డి ప్రకటించారు. ముందస్తు అంచనాలతో రెండు సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ అందించామని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలను ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రేడియో ఫ్రీక్వెన్సీ పెట్టామని, దీని ద్వారా లోడు హెచ్చుతగ్గులు, ఇతర సమస్యలు వెంటనే కంట్రోల్‌రూంలో తెలుసుకొని ఐదు నిమిషాల్లో సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు. జాతరలో నోడల్ ఆఫీసర్లుగా ఇద్దరు సీజీఎంలు, నలుగురు సూపరింటెండెంట్ ఇంజనీర్లు, పది మంది డివిజనల్ ఇంజనీర్లు, 120 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు, 425 మంది ఆపరేషన్స్, మెయింటనెన్స్ సిబ్బంది రేయింబవళ్లు విధులు నిర్వర్తించారని తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు.

(5వ పేజీ తరువాయి)

చేశారు. తర్వాత డోలువాయిద్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య కుంకుమ భరిణ రూపంలో ఉన్న తల్లి రూపాన్ని తీసుకొని నేరుగా చిలుకలగుట్టకు బయలు దేరారు. ఆయనను మిగతా పూజారులు, ఆదివాసీలు, వందలాది మంది భక్తులు అనుసరించారు. కొంత దూరం వెళ్లిన తర్వాత క్రిష్ణయ్య ఒక్కరే మరింత పైకి వెళ్లి సమ్మక్క తల్లి నిజ స్థానానికి రాత్రి 7.25 గంటలకు చేరుకున్నారు. అక్కడ కొద్ది సేపు పూజలు చేసిన తర్వాత ఆమె రూపాన్ని భద్రపరిచారు. తల్లీ రెండేళ్లకు మళ్లొస్తాం.. మమ్ములను దీవించి, చల్లగా కాపాడు.. అంటూ మొక్కుకొని వెనుదిరిగారు.

అదేవిధంగా సారలమ్మను ప్రధాన పూజారి కాక సారయ్యతో పాటు కాక వెంకటేశ్వర్లు, కాక కిరణ్ కుమార్, కాక కనుకమ్మ, కాక భుజంగరావు, కాక లక్ష్మీబాయి గద్దెకు చేరుకొని పూజలు చేసి రాత్రి 7.30గంటలకు కన్నెపల్లికి తోడ్కొని వెళ్లారు. గోవిందరాజులను ప్రధాన పూజారి దబ్బకట్ల గోవర్ధన్ రాత్రి 7.10గంటలకు కొండాయికి, పగిడిద్దరాజును పూజారి పెనుక రాజేశ్వర్ పూనుగొండ్లకు రాత్రి 7.12గంటలకు తరలించారు. ఈ తతంగమంతా ఎలాంటి అట్టహాసం, ఆర్భాటం లేకుండా సాదాసీదాగా ప్రశాంతంగా సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చివరి రోజునా..

మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో ఆదే జోరు.. ఆదే హోరు. జాతర నాలుగో రోజు కూడా భక్తులు మొక్కులు చెల్లించడం కొనసాగింది. వనదేవతలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తూనే ఉన్నారు. సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున వస్తున్నారు. భక్తుల దర్శనాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. క్యూలైన్లన్నీ ఇప్పటికీ కిటకిలాడుతూనే ఉన్నాయి. గద్దెల ప్రాంగణం ఇసుక వేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసి కనిపించింది.


వీఐపీల రాక



మదినిండా.. భక్తి నిండగా..

మేడారానికి శనివారం కూడా వీఐపీల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ శనివారం సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. మొక్కులను చెల్లించుకున్నారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తు బంగారాన్ని సమర్పించుకున్నారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు.







పగిడిద్దరాజు, గోవిందరాజులను వన ప్రవేశానికి తరలిస్తున్న పూజారులు, వనదేవతలను దర్శించుకుని తిరుగు పయనమైన భక్తులు

ట్రాఫిక్ జామ్

మేడారం జాతరలో ట్రాఫిక్ జామ్ అయింది. శుక్రవారం రాత్రి 12 గంటల తర్వాత పస్రా-తాడ్వాయి మధ్య సుమారు 10 కి.మీ మేర ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు ముందుకు కదలలేక, వెనక్కి రాలేక అందులో ప్రయాణిస్తున్న భక్తులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరేడు గంటల పాటు నరకయాతన అనుభవించారు. తాగడానికి నీళ్లు, తినడానికి తిండిలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వాహనాలు సాఫీగానే వెళ్లాయి. సాయంత్రం నుంచి సమస్య మొదలైంది. రాత్రి పొద్దుపోయిన తర్వాత పరిస్థితి అదుపు తప్పింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి పోలీసులకు కష్టమైంది.

కంపు కొడుతోంది..

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం పరిసరాల్లో కంపు కొడుతోంది. నాలుగు రోజుల పాటు సాగిన మహాజాతర ముగియడంతో భక్తులు ఎక్కడివారు అక్కడికి వెళ్లిపోయారు. తల్లుల దర్శనానికై వచ్చిన భక్తులు ఇక్కడే గుడారాలను ఏర్పాటు చేసుకుని, కిరాయి ఇండ్లలో కుటుంబంతో సహా ఉన్నారు. సమ్మక్క-సారలమ్మలకు మొక్కులు చెల్లించేందుకు కోడి, గొర్రెలు, మేకలను బలిచ్చారు. అయితే వాటి వ్యర్థాలను తొలగించక పోవడంతో కంపు కొడుతుందని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

తల్లులను దర్శించుకున్న సింగరేణి డైరెక్టర్

మేడారం బృందం, ఫిబ్రవరి 24: మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణ శవివారం దర్శించుకున్నారు. జీఎంసేఫ్టీ(కార్పొరేట్) గురువయ్య, హెచ్ఆర్డీ జీఎం(కార్పొరేట్) వెంకటేశ్వర్లు, భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, పర్సనల్ అధికారి తుకారాంతో కలిసి దర్శించుకున్నారు.

సింగరేణి రెస్క్యూ సేవలు భేష్

మేడారం బృందం, ఫిబ్రవరి 24 : మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు సేవలను అందించడంలో భూపాలపల్లి సింగరేణి ఏరియా రెస్క్యూ సిబ్బంది ముందున్నారు. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే వన జాతరలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది సేవలు అందిస్తోంది. ప్రస్తుత మహాజాతరలో అస్వస్థతకు గురైన భక్తులకు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం అందించేందుకు ఆస్పత్రికి తరలించారు. గుండెపోటు వచ్చిన భక్తులకు సైతం సీపీఆర్ చేసి వారి ప్రాణాలను కాపాడిన సందర్భాలు ఉన్నాయి. అలాగే ఫిట్స్ వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స అందించి సాధారణ స్థితికి వచ్చేలా చేశారు. ఏరియా నుంచి 40 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది ఈ నెల 17 నుంచి జాతర ముగిసే వరకు ఇక్కడే ఉండి సేవలు అందించారు.

జాతరలో వ్యక్తి అదృశ్యం



తాడ్వాయి, ఫిబ్రవరి 24 : మేడారం మహాజాతరలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం మద్దేడు గ్రామానికి చెందిన పెద్దబోయిన సడవలి(40)అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. మహాజాతర సందర్భంగా సడవలి కుటుంబసభ్యులతో మంగళవారం వచ్చాడు. ఊరట్టం శివారులోని జంపన్నవాగు సమీపంలో విడిది ఏర్పాటు చేసుకున్నారు. అయితే జాతరలోకి వెళ్లి వస్తానని కుటుంబసభ్యులతో చెప్పిన సడవలి ఎంతకూ తిరిగి రాలేదు. దీంతో బంధువులు జాతరలో కలియతిరిగినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో మేడారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన బంధువు రామిండ్ల లాలయ్య తెలిపారు. ఈఫొటోలోని వ్యక్తి కనపించినట్లయితే 9494277201, 9691616605 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

చెప్పేది కొండంత..

ఇచ్చేది గోరంత

- 'స్వయం సిద్ధ' పథకం తీరిది
- మండలానికి ఇద్దరికే రుణ సాయం
- ఉమ్మడి జిల్లాలో 150 మందికి అవకాశం
- అర్హతలున్నా లబ్ధి పొందలేని దైన్యం
- మండలానికి 500 మందికి ఇవ్వాలని డిమాండ్



స్వయం సహాయక సంఘం సభ్యుల సమావేశం (ఫైల్)

హనుమకొండ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు రుణాలందించే 'స్వయం సిద్ధ' పథకం లక్ష్యం మంచిదే అయినా ఆచరణలో అనేక ఇబ్బందులు ఉన్నాయి. ఈ పథకం కింద తీసుకున్న రుణాన్ని వాయిదాల పద్ధతిలో సకాలంలో, సక్రమంగా చెల్లించే స్వయం సహాయక సంఘాల్లోని(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఎటువంటి షరతులు లేకుండా రూ.5లక్షల వరకు రుణం పొందవచ్చు. అయితే ఈ పథకం తీరు పట్ల ఎస్‌హెచ్‌జీ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన పథకం ద్వారా ఎక్కువ మంది లబ్ధి పొందే అవకాశం కల్పించాలి కానీ కొద్ది మందికే పరిమితం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకు లింకేజీ కింద ఒక్కో స్వశక్తి సంఘానికి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు రుణం ఇస్తున్నారు. దాన్ని సభ్యులు సమానంగా పంచుకుంటే రూ.లక్ష వరకు మాత్రమే వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని స్వయం సిద్ధ పథకం తీసుకువచ్చారు. ప్రయోగాత్మకంగా ఎస్‌బీఐ పరిధిలోని స్వశక్తి సంఘాల సభ్యులకు మాత్రమే అందించనున్నారు. స్వయం సిద్ధ పథకం కింద చిన్న పరిశ్రమను ఏర్పాటు చేసుకోవాలనుకునే గ్రూపులోని సభ్యులు వ్యక్తిగతంగా రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణం పొందవచ్చు. అయితే ఈ పథకం కింద ప్రస్తుతం మండలానికి ఇద్దరు మాత్రమే లబ్ధి పొందేందుకు వీలున్నది. ఎంత మంది దరఖాస్తులు చేసుకున్నా వారిలో నుంచి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేసి రుణం అందచేస్తారు. దీంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మిగతా వారు లబ్ధి పొందలేని పరిస్థితి ఏర్పడింది.

150 మందికే రుణాలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 75 మండలాలు ఉన్నాయి. స్వయం సిద్ధ పథకం కింద 150 మందికి మాత్రమే రుణ సాయం లక్ష్యంగా నిర్ణయించారు. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల నుంచి ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ)లు ప్రతిపాదనలు పంపించారు. మండలానికి ఇద్దరికే ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ నలుగురి పేర్లను సిఫార్సు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 300 మంది పేర్లు ప్రస్తుతం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) పరిశీలనలో ఉన్నాయి. వీరిలో అర్హులైన 150 మందిని ఎంపిక చేసి రుణాలు అందచేస్తారు.

లక్షల్లో సభ్యులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు లక్షల్లో ఉన్నారు. వీరిలో చాలా మంది తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు. వీరంతా స్వయం సిద్ధ పథకం కింద రుణం పొందేందుకు అర్హులే. కానీ, రుణ వితరణ లక్ష్యం మరీ తక్కువగా ఉండడం వల్ల తాము రుణ సాయం పొందే అవకాశాన్ని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

54వేల సంఘాలు

ఉమ్మడి జిల్లాలో 1,680 గ్రామ పంచాయతీలు ఉండగా, 54,218 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 5,46,000 మంది సభ్యులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పీఎంఈఎస్ తదితర పథకాల కింద మహిళలకు బ్యాంకు రుణాలను అందచేస్తున్నారు. జిల్లాలో 54వేలకు పైగా స్వయం సహాయ సంఘాల్లో 60శాతానికిపైగాసభ్యులు తాము పొందిన రుణ వాయిదాలు సజావుగా చెల్లిస్తున్నారు. వీరంతా స్వయం సిద్ధ పథకానికి అర్హులైనా లబ్ధి పొందలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాల్లోని సీనియర్ సభ్యులు ఒకసారి తీసుకున్న రుణం సక్రమంగా వాయిదాలు చెల్లిస్తే వారికి స్వయం సిద్ధ పథకం కింద ఎలాంటి పూచీకత్తు లేకుండా వివిధ వ్యాపారాల కోసం రూ.5లక్షల రుణసహాయం అందిస్తోంది.

పథకం ఇలా..

మహిళా సంఘాల్లో సభ్యులుగా రెండేళ్ల పాటు అనుభవం కలిగి ఉండి, ఒకసారి రుణం పొందిన సభ్యులకు కేంద్ర ప్రభుత్వం స్వయం సిద్ధ పథకం కింద రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణ సహాయం అందిస్తోంది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలోని సభ్యులకు మాత్రమే రుణాలు అందిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సూక్ష్మ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే స్వయం సహాయక సంఘం సభ్యులకు స్వయం సిద్ధ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. సంఘం నుంచి ఒక సభ్యురాలు మాత్రమే అర్హురాలు. రుణం పొందేందుకు బ్యాలెన్స్ షీట్, డీపీఆర్, ఫండ్ లావాదేవీల స్టేట్‌మెంట్లు అవసరం లేదు. 36 ప్రధాన యూనిట్లకు రుణం అందచేస్తారు. పాన్ కార్డు కూడా అవసరం లేదు. కేవలం ఆధార్ కార్డు ఉంటే సరిపోతుంది. అయితే సభ్యురాలు తాను గ్రూపు అనుమతితో చేసిన దరఖాస్తుపై ఏపీఎం అటెస్టేషన్ తప్పనిసరిగా ఉండాలి.

చిరువ్యాపారాలకు ప్రాధాన్యం

స్వయం సిద్ధ పథకం కింద ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. వివిధ రకాల పచ్చళ్ల తయారీ, బేకరీ ఉత్పత్తులు, చిప్స్ తయారీ, మినీ ఆయిల్ మిల్లులు, ఐస్‌క్రీమ్స్, స్వీట్ల తయారీ, బ్యూటీపార్లర్, డెయిరీ, పౌల్ట్రీఫామ్స్ ఏర్పాటు, హోటల్, ఇంటర్నెట్ సెంటర్ తదితర 36 రకాల వ్యాపారాలకు రుణ సౌకర్యం కల్పిస్తారు. మహిళలు ఏ వ్యాపారంలో అనుభవం, శ్రద్ధ ఉందో వాటిని ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది.

ప్రచారం ఏది?

స్వయం సిద్ధ పథకం గురించి ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సరైన అవగాహన లేక దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఆ బ్యాంకుల్లో ఖాతాదారులైన ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మాత్రమే వర్తించే ఈ పథకం గురించి ఆ బ్యాంకు అధికారులు పెద్దగా ప్రచారం చేయడం లేదు. సభ్యులకు కనీస అవగాహన కూడా కల్పించడం లేదు. దీంతో ఈ పథకం ఉన్న సంగతి కొద్ది మందికే తెలుసు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అవగాహన లేక అనేక మంది ఈ పథకం కింద దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

దాసు, డీపీఎం(బ్యాంకు లింకేజీ), డీఆర్‌డీఏ, హనుమకొండ

స్వయం సిద్ధ పథకం కింద ప్రతీ మండలంలో ఇద్దరు ఎస్‌హెచ్‌జీ సభ్యులకు మాత్రమే రుణ మంజూరికి అవకాశం ఉంది. అయినా మండలానికి నలుగురి చొప్పున అర్హులైన సభ్యుల పేర్లను సిఫార్సు చేశాం. ఇవి ప్రస్తుతం బ్యాంకు అధికారుల పరిశీలనలో ఉన్నాయి. సభ్యుల అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. బహుశా పక్షం రోజుల్లో ఎంపికైన సభ్యులకు రుణాలు మంజూరు కావచ్చు. స్వయం సిద్ధ పథకం గురించి గ్రామాల్లో మండల సమాఖ్య సమావేశాల్లో, అలాగే వీవోల మీటింగ్‌లలో సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. స్వయం సిద్ధ పథకం ఎస్‌బీహెచ్ ఆధ్వర్యంలో ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలవుతోంది.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

దామెర, ఫిబ్రవరి 24: మండల కేంద్రంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీవో కె.వి.రంగాచారి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దామెరలోని వీధులు, అంతర్గత రోడ్లతో పాటు మెయిన్ రోడ్డులో పారిశుధ్య పనులను చేయించారు. డ్రెయినేజీల్లోని చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించారు. తాగునీటి సౌకర్యం కోసం పైప్‌లైన్ మరమ్మతులు చేయించి, నూతన బోర్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రెయినేజీల్లో చెత్త చెదారం వేయవద్దని కోరారు. ప్రజలు ఇంట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని తెలిపారు. కార్యక్రమంలో జీపీ సెక్రటరీ ఇంజపెల్లి నరేష్, కారోబార్ మాదారపు బొబ్బిలి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 24 : హనుమకొండలోని ఎస్టీయూ భవన్‌లో ఆదివారం రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య శనివారం ఒక ప్రటనలో తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, రాష్ట్ర ప్రతినిధులతోపాటు 33 జిల్లాలో ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విద్యావిషయక అంశాలతోపాటు విద్యారంగం తీరుతెన్నులపై సమగ్రమైన చర్చలు ఉంటాయని, అనంతరం విద్యారంగం బలోపేతం, ఉపాధ్యాయుల సమస్యలులపై ప్రతిపాదనలు ఉంటాయని పేర్కొన్నారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 : గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు 5 నెలల ఉచిత కోచింగ్ పొందేందుకు డిగ్రీ ఉత్తీర్ణత పొందిన ఉమ్మడి వరంగల్‌కు చెం దిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 3వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్ తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం గౌరవ సంచాలకుడు డాక్టర్ కొంగర జగన్‌మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 10న ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంట్రెన్స్ పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చూపిన అభ్యర్థులకు మార్చి 18 నుంచి ఆగస్టు 17 వరకు హనుమకొండ వడ్డెపల్లిలో ఉచిత తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతితో కూడిన ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. దరఖాస్తులు చేసుకునేందుకు www.tsstudycircle.co.in/ వెబ్‌సైట్‌లో చూడాలని అలాగే 95428-34507 నెంబర్‌లో సంప్రదించాలని

లంబాడాల ఐక్య వేదిక
జిల్లా కోఆర్డినేటర్‌గా రాజునాయక్



వడ్డెపల్లి, ఫిబ్రవరి 24: లంబాడీల ఐక్య వేదిక జిల్లా కో ఆర్డినేటర్‌గా హనుమకొండ గుండ్ల సింగారం ప్రాంతానికి చెందిన లావుడియా రాజు నాయక్ నియమితులయ్యారు. లంబాడీల ఐక్య వేదిక చీఫ్ రాష్ట్ర కో ఆర్డినేటర్ గుగులోత్ రమేష్ నాయక్ ఈ మేరకు శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో లంబాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని లావుడియా రాజు నాయక్ పేర్కొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 24 : హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని గౌతమ బుద్ధుడి విగ్రహం ప్రాంగణంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమి వేడుకను శనివారం సాయంత్రం నిర్వహించారు. భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర జిల్లా నాయకులు విఎద్దిపాక ఎల్లయ్య, డాక్టర్ జిలకర శ్రీనివాస్, డాక్టర్ నవీన్, మేకల ప్రవీన్, సింగారపు ఐలయ్య, ఏనుట్ల రవీందర్, చిట్యాల బాబు, అర్జున్, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

28న కేయూ అకాడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 : కేయూ 39వ అకాడమిక్ సెనెట్ సమావేశం మార్చి 28న గురువారం ఉదయం 11 గంటలకు వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి శనివారం అకాడమిక్ సెనెట్ సభ్యులకు, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో పాటు సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సమావేశంలో 2022-23 వార్షిక ఖాతాలు, 2023-24 సవరించిన వార్షిక అంచనాలు, 2024-25 వార్షిక బడ్జెట్ అంచనాల ఆమోదం, 2023-24 స్టాండింగ్ కమిటీ, వివిధ సమావేశాల మినిట్స్‌ను అకాడమిక్ సెనెట్ సమావేశంలో ఆమోదం కోసం ప్రతిపాదిస్తారని వెల్లడించారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

శాయంపేట, ఫిబ్రవరి 24: కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరించిన వ్యక్తిపై శనివారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. బాధితుడు, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శాయంపేట మండల కేంద్రానికి చెందిన మారపెల్లి సుమన్‌కు చెందిన హనుమకొండ గోపాల్‌పూర్‌లో గల స్థలాన్ని శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి కొనుగోలు చేశారు. ఈ క్రమంలో విక్రయదారుడు సుమన్‌కు రావాల్సిన రూ.6 లక్షల కోసం శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేయగా స్పందించలేదు. అనంతరం శ్రీనివాస్ రెడ్డి సుమన్‌కు ఫోన్ చేసి కులం పేరుతో దూషిస్తూ, చంపుతానని బెదిరించాడు. ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించేందుకు ప్రయత్నించగా శ్రీనివాస్ రెడ్డి కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో సుమన్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పలు సెక్షన్‌ల కింద శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు

సుబేదారి, ఫిబ్రవరి 24 : హనుమకొండకు చెందిన అయాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ అన్వర్ ఇంటి వద్ద గురువారం రాత్రి జరిగిన గొడవ సంఘటనలో అన్వర్, జహీద్ వర్గాలపై శనివారం సుబేదారి పోలీసులు కేసు నమోదు చేశారు. అన్వర్, అతడి అనుచరులు ముగ్గురు, జహీద్‌తో పాటు అతడి నలుగురు స్నేహితులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు సుబేదారి పోలీసులు తెలిపారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వారు తెలిపారు.

కేయూ హాస్టల్ విద్యార్థినులపై కుక్కల దాడి

ఇద్దరికి గాయాలు - ఎంజీఎంలో చికిత్స

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 : కాకతీయ యూనివర్సిటీ పద్మాక్షి లేడీస్ హాస్టల్స్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు విద్యార్థినులను కుక్కలు కరిచాయి. విద్యార్థులు యూనివర్సిటీ హాస్టల్స్ నుంచి భోజనం చేసేందుకు మెస్‌కు వచ్చి వెళ్తుండగా ఆటువైపుగా వచ్చిన కుక్కలు ఇద్దరు విద్యార్థులపై దాడి చేశాయి. వెంటనే స్పందించిన వర్సిటీ హాస్టల్స్ అధికారులు విద్యార్థులను హుటాహుటిన ఎంజీఎం తరలించి చికిత్స చేయించారు. కుక్కల దాడిఘటన తెలుసుకున్న వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాస్టల్స్‌ను సందర్శించారు. అధికారుల సూచనలతో కుక్కలను ప్రైవేట్ వ్యక్తులు పట్టుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు, ఫిబ్రవరి 24: ఐనవోలుకు చెందిన జంపాల వెంకటమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పెరుమాండ్ల గూడెంకు చెందిన పిడుగు చిన్న కొమురమ్మ, రాంనగర్‌కు చెందిన బర్ల గోపాల్, మహ్మద్ రషీద్‌లు ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే సంతాపం తెలిపి ధైర్యం చెప్పారు.

వరాలిచ్చి.. వనానికేగి..

వనప్రవేశం చేసిన సమ్మక్క సారలమ్మ



అగ్రంపహాడ్‌లో ఆఖరి మొక్కులు



అగ్రహంపహాడ్‌లో అమ్మవారిని వన ప్రవేశానికి తరలిస్తూ..



అమ్మవారిపేటలో దేవతలను వన ప్రవేశానికి తరలిస్తూ..

ఆత్మకూరు, ఫిబ్రవరి 24 : భక్తులకు దర్శనాల అనంతరం ఎంతో ఘనంగా డప్పుచప్పుళ్లు, మేళతాళాలు, శివసత్తుల పూనకాలతో అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మలు వనప్రవేశం చేశారు. శనివారం అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ దేవతలను గద్దెల నుంచి పరకాల ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, సీఐ సంతోష్, ఎండోమెంట్ అధికారి శేషగిరి, జాతర చైర్మన్ శీలం రమేష్, మాజీ ఎంపీపీ బీరం సునంద సుధాకర్‌రెడ్డి పూజారులతో కలసి ప్రత్యేక పూజల అనంతరం ప్రధాన పూజారి గోనెల సారంగపాణి అమ్మవారిని వనంలోకి చేర్చారు. వన దేవతలు వన ప్రవేశం చేసినప్పటికీ తల్లులు కాలు మోపిన ప్రదేశం తకి భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల తాకిడి చూసి హుండీలను తరలించడం నిలిపివేశారు.

చేతులెత్తేసిన అధికారులు

ఈ సంవత్సరం భక్తులు అంచనాలకు మించిరావడంతో అధికారులు చేసేదేమీలేక చేతులెత్తేసి జాతర నుంచి దూరంగా వెళ్లిపోయారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుబాటులో ఉండి సేవలందించాల్సిన అధికారులు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారంఉదయం నుంచి భక్తులు పోటెత్తగా.. దర్శనంలో తోపులాట జరిగింది. ఎండోమెంట్ అధికారులు మైకులలో ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని భక్తులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. స్థానిక పోలీసు అధికారులు కూడా అందుబాటులో ఉండకపోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. వరంగల్ నుంచి జాతరకు వచ్చే వాహనాలతో జాతర సమీపంలో ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కొందరు భక్తులు వాహనాలు దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అమ్మవారిపేటలో ..

వడ్డెపల్లి: కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారు దామెర (ఉర్సు) గుట్టల వద్ద గల అమ్మవారిపేట సమ్మక్క-సారలమ్మ జాతరలో ఆధ్యాత్మికత పరిడవిల్లింది. వన జాతర మినీ మేడారంగా విరాజిల్లుతోంది. తల్లుల దర్శనానికి భక్తు లు తండోపతండాలుగా తరలి వస్తూ మొక్కులు చెల్లిం చుకుంటున్నారు. శనివారం వొడ్డెలు, గిరిజన పూజారు లు వనదేవతలైన వరాల తల్లులను దామెరగుట్టల్లోకి వన ప్రవేశంగావించారు.

దేవతల వన ప్రవేశం..

ఎండోమెంట్ ఈవో పందిళ్ల కమల, మడికొండ పోలీసుల ఆధ్వర్యంలో పెద్ద వొడ్డె బౌరిశెట్టి శ్యాంసుందర్, చిన్న వొడ్డె నామని శివమూర్తితో పాటు ఆచారమంతులు, గిరిజన పూజారులు బైరి ఈశ్వరయ్య, బైరి కిరణ్, ఐత దంపయ్య, తాళ్ల మల్లయ్య, కేదాసి రవి, తోట రాములు, బౌరిశెట్టి మల్లేశం, ఆవునూరి నాగరాజు, బొల్లం సంజీవ్, ఆవునూరి సమ్మయ్య తదితరులు డప్పు చప్పుళ్లతో సమ్మక్క - సారలమ్మలను దామెర గుట్టల్లోకి వన ప్రశేవం గావించారు. జాతర చైర్మన్ కోడూరి భిక్షపతి, ధర్మకర్తలు దాసి రాందేవ్, బైరి నాగరాజు , ఆవునూరి కుమారస్వామి, బైరి హరినాథ్, ఆవునూరి రాంమూర్తి , మైదం వీరస్వామి, 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్ మొక్కులు చెల్లించుకున్నారు.

హనుమకొండ బస్‌స్టేషన్‌లో భక్తుల రద్దీ

బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికుల ఇబ్బంది



హనుమకొండ బస్‌స్టేషన్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

సుబేదారి, ఫిబ్రవరి 24 : మేడారం జాతరకు వెళ్లి తమ గమ్యస్థానాలకు చేరేందుకు భక్తులు హనుమకొండ బస్టాండ్‌కు శనివారం రాగా బస్‌స్టేషన్‌లో బస్సులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కరీంనగర్, నిజామాబాద్, ఐనవోలు, వర్ధన్నపేట వైపు వెళ్లే ప్రయాణికులైతే దాదాపు 2 గంటలు బస్సుల కోసం వేచి ఉన్నారు. అయితే మేడారం జాతరలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టేషన్‌లో భక్తులు పెద్ద సంఖ్యలో ఒకేసారి గమ్యస్థానాలకు వెళ్లేందుకు రావడంతో అక్కడి భక్తులను తరలించేందుకు ఆర్టీసీ అధికారులు బస్సులన్నింటిని మేడారంకు పంపడంతో హనుమకొండ బస్‌స్టేషన్‌లో భక్తులకు తిప్పలు తప్పలేదు.

ట్రాఫిక్‌జాం

మేడారం.. తాడ్వాయి మధ్యలో ట్రాఫిక్ జాం కావ డంతో ఎక్కడిబస్సులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో హనుమకొండకు బస్సులు రావడానికి సమయాని కంటే సుమారు 3 గంటలు ఆలస్యం కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో కొందరు ప్రయాణికులు ప్రైవేటు వాహనాలతో తమ ఇళ్లకు వెళ్లారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయ ఉద్యోగి సస్పెన్షన్

(5వ పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారని ఆరోపణలున్నాయి. కొందరు అధికారులు చేస్తున్న దందాలకు ఈ ప్రైవేటు వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎలాంటి రిజిస్ట్రేషన్ అయినా సదరు ప్రైవేటు వ్యక్తిని కలిస్తే పని అయిపోతుందనే ఆరోపణలున్నాయి. ఈ దందా జిల్లాలోని పలు కార్యాలయాల్లో కొనసాగుతుందని గమనించిన ఉన్నతాధికారులు వారిని ఏరివేయాలనే ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు కార్యాలయాల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టునట్లు సమాచారం.

మంత్రి తుమ్మలను కలిసిన 'మార్నేని'



హైదరాబాద్‌లో మంత్రి తుమ్మలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మార్నేని

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 24 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లో ఆర్టీసీ కళాభవన్‌లో ఆల్ ఇండియా కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన మంత్రి తుమ్మలను మార్నేని రవిందర్‌రావు కలిశారు. వరంగల్ సహకార బ్యాంక్ నుంచి అమలు చేస్తున్న పథకాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మార్నేని రవిందర్‌రావు కాంగ్రెస్‌లో చేరే విషయం సైతం చర్చకు వచ్చినట్లు తెలిసింది. పార్టీ మారేందుకు సిద్ధపడిన మార్నేని రవిందర్‌రావు నాలుగురోజుల క్రితం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండురోజుల క్రితం బెంగుళూరులో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి శివకుమార్‌ను, నర్సంపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కలిశారు. ఈ క్రమంలో శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలువడం చర్చనీయాంశంగా మారింది. వరుసగా కాంగ్రెస్ నేతలను కలుస్తున్న మార్నేని రవిందర్‌రావు బీఆర్‌ఎస్‌ను వీడటం ఖాయమనే ప్రచారం సాగుతోంది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ప్రత్యేకాధికారి ఆనంద్ కుమార్



ఈడీ ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న కేయూ విద్యార్థి నేతలు, అధికారులు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 24 : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ బి.ఆనందర్ కుమార్ అన్నారు. శనివారం కేయూ మ్యాథ్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్ కుమార్ ఆధ్వ ర్యంలో 'ప్రభుత్వ పథకాలు- అవకాశాలు ' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆనంద్‌కుమార్ హాజరై మాట్లాడారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కీమ్, స్కిల్ అండ్ నాలెడ్జ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ స్కీంతోపాటు ఇతర స్కీంలను వివరించారు. టీ స్టాల్, హోటల్స్, పౌల్ట్రీ ఫామ్ తదితర వాటికి సం బంధించి సబ్సిడీని వివరించారు.

అనంతరం రిజి స్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ..యువత అవకాశాలను అందిపు చ్చుకోవాలని అన్నారు. ఈ కార్య క్రమంలో మ్యాథ్స్ విభాగం ప్రొఫెసర్లు ఎల్.పి రాజ్‌కుమార్, ఎం. తిరుమలదేవి, డాక్టర్ సోమయ్య, డాక్టర్ భార విశర్మ, డాక్టర్ మంద వీరాస్వామి, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, ఆకులపల్లి మధు, మట్వాడ కుమార్, అంబాల కిరణ్, బైరపాక ప్రశాం త్, అరుణ్, కిరణ్, స్రవంతి, శ్యామల, శ్రావణి, మాధవి, సంధ్య, రాకేశ్, మధు, సునీత పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్



ఎల్కతుర్తి, ఫిబ్రవరి 24: ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని కేశవపూర్ గ్రామానికి చెందిన ఎర్రగోళ్ల శ్రీనివాస్ యాదవ్‌ను నియమించినట్లుగా శనివారం ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గండమల్ల ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం నేటి నుంచి అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీజేపీ బలోపేతానికి నిరంత రం కృషి చేయడాన్ని గుర్తించిన ఆధిష్టానం తనకు కీలక పదవిని కేటాయించడం హర్షనీయమన్నారు. నియామకానికి సహకరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు త్రిపుర రాష్ట్ర గవర్నర్‌కు సన్మానం



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ఎ. సమ్మిరెడ్డి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 24 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓరుగల్లు సిటిజన్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎ. సమ్మిరెడ్డి తెలిపారు. శనివారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పౌర సన్మాన కార్యక్రమంలో ఓరుగల్లు సిటిజన్ ఫోరం ప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు బూర రాంచందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, పెండ్లి ఉపేందర్‌రెడ్డి, పులి సరోత్తం రెడ్డి, డి.అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

కునుకు కరువు..!

నగరంలో దోమలే దోమలు - దోమల ప్రాజెక్టుకు మంగళమేనా..?

పత్తా లేని మస్కిటో 'ఐవోటీ' - 45 రోజుల హంగామా - ఆపై అంతే సంగతులు



డాక్టర్స్ కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన మస్కిటో 'ఐవోటీ' డివైజ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 24 : వరంగల్ మహా నగరంలో దోమల నివారణకు జీడబ్ల్యూఎంసీ చేపట్టిన మస్కిటో 'ఐవోటీ' (ఇంటర్‌నెట్ ఆన్ థింగ్స్)ప్రాజెక్టు పత్తా లేకుండా పోయింది. స్మార్ట్‌సిటీలో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఊసే లేదు. ఆరోగ్య నగర నిర్మాణ లక్ష్యంతో ఈ ప్రాజెక్టును వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రవేశపెట్టింది. ముఖ్యంగా దోమల నివారణ, దోమల రకాలు, వ్యాధులు తదితర అంశాల అధ్యాయనం, పరిష్కార మార్గాలు చేపట్టడానికి ఈ ప్రాజెక్టు అనువైనదిగా జీడబ్ల్యూఎంసీ ప్రకటించింది. ఈ మేరకు మస్కిటో ఐవోటీ(ఇంటర్‌నెట్ ఆన్ థింగ్స్) డివైజ్ ఏర్పాటును గతంలో చేపట్టింది. నగరంలో దోమల ప్రభావం అధికమవుతోంది. డెంగీ, మలేరియా, వైరల్ ఫివర్ తదితర అనారోగ్య సమస్యలు సీజనతో సంబంధం లేకుండా వ్యాప్తి చెందుతున్నాయి. దోమల నివారణకు 'ఐవోటీ' ప్రాజెక్టు పరిష్కార మార్గంగా బల్దియా చేపట్టిన చర్యలు ఆరంభశూరత్వంగానే విఎగిలింది.

వరంగల్ మహానగరంలో దోమల నివారణ క్లిష్టతరమైంది. ఫాగింగ్ ఇతరాత్ర చర్యలు దోమల నివారణకు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. దోమల బాధ నగరానికి సవాల్‌గా పరిణమించింది. ఈ తరుణంలో మస్కిటో 'ఐవోటీ' డివైజ్ ద్వారా దోమలను నివారించవచ్చనే ఉద్దేశంతో జీడబ్ల్యూఎంసీ ప్రయోగాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లో 'ఐవోటీ' డివైజ్ ఏర్పాటు సత్ఫలితాలను ఇచ్చింది. ఈ క్రమంలో వరంగల్ నగరంలో కూడా ప్రాజెక్టును ప్రారంభించారు. మస్కిటో 'ఐవోటీ' డివైజ్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో దోమల సాంద్రత ఎంత?. ఏ రకమైన దోమలు ఆ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఏ మేరకు విస్తరిస్తున్నాయి. దోమల కారణంగా సంభవిస్తున్న వ్యాధులు ఇత్యాధి విషయాలను డివైజ్ ద్వారా అధ్యాయనం చేస్తారు. వంద మీటర్ల పరిధిలో దోమల సమాచారమంతా డివైజ్ గుర్తిస్తుంది. ఐవోటీ డివైజ్ ద్వారా అధ్యాయనం చేసిన విషయాలతో ఆ ప్రాంతాల్లో దోమల నివారణకు పకడ్బందీగా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. దేశంలోని ప్రముఖ నగరాలలో 'ఐవోటీ' ప్రాజెక్టు ప్రారంభించి ఆశించిన మేరకు ఫలితాలు సాధించారు.

అర్ధాంతరంగా ప్రాజెక్టు మాయం...?

దోమల సమస్య నుంచి ఉపశమనం లభిస్తుందని నగరం ఆశించిన కొద్ది రోజుల్లోనే ప్రాజెక్టు మాయమైంది. జర్మనీ సంస్థ ప్రతినిధులు డివైజ్‌ను సర్దుకొని వెళ్లిపోయారు. 45 రోజుల పైలెట్ ప్రాజెక్టు సమయం పూర్తి కాకుండానే పత్తా లేకుండా పోయింది. స్మార్ట్‌సిటీలో భాగంగా డివైజ్ ఏర్పాటు జరిగింది. అయితే నిధుల చెల్లింపు, ఒప్పందాల విషయంలో తేడా వచ్చి డివైజ్ నిర్వాహకులు ప్రాజెక్టును ఎత్తేసినట్లు తెలిసింది. జీడబ్ల్యూఎంసీ అధికారులు చొరవ చూపితే నగరంలో దోమల నివారణకు అత్యధిక శాతం పరిష్కారం లభించేదనే అభిప్రాయాలు ఉన్నాయి.

డాక్టర్‌కాలనీలో పైలట్ ప్రాజెక్టు

వరంగల్ కోట చెరువు ప్రాంతంలోని డాక్టర్స్ కాలనీలో గతంలో ఏర్పాటు చేశారు. జర్మనీకి చెందిన ట్రాకిట్ నౌ ప్రతినిధుల ఆధ్వర్యంలో మస్కిటో ఇంటర్ నెట్ ఆన్ థింగ్ డివైజ్ ఏర్పాటు జరిగింది. సీనియర్ ఎంటమాలజిస్టు డాక్టర్ ఉస్మాన్ పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టారు. డివైజ్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో 45 రోజుల తదుపరి దోమల సమగ్ర సమాచారం అందుతుందని అప్పట్లో అధికారులు ప్రకటించారు. డివైజ్‌ను ఆన్‌లైన్‌కు అనుసంధానించడం ద్వారా సమాచార సేకరణ ఉంటుందని ఏర్పాటు క్రమంలో వెల్లడించారు. ఎనాఫిలిస్ దోమ కాటుతో మలేరియా, ఆడ క్యూలెక్స్ దోమలతో ఫైలేరియాసిస్, ఎడిస్ దోమల వల్ల డెంగీ వంటి ప్రమాదకర వ్యాధులు సంభవించే క్రమంలో వీటి అధ్యాయనం, పరిష్కార చర్యలకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రకటించారు. నగర వాసులు వ్యాధుల బారిన పడకుండా దోమల నుంచి రక్షణకు ముందస్తుగా డివైజ్ ఏర్పాటు దోహదపడుతుందని అంతా భావించారు. డాక్టర్ కాలనీలో 45 రోజుల ప్రయోగం తదుపరి నగరంలో మరో ఐదు ప్రాంతాల్లో డివైజ్‌లు ఏర్పాటు చేయాలని జీడబ్ల్యూఎంసీ ప్రణాళికలు రూపొందించింది.

బల్దియా కార్మికులకు వేతనం పెంచాలి

అదనపు కమిషనర్‌కు వినతి



అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్‌కు వినతిపత్రం అందచేస్తున్న టీఎండబ్ల్యూఈయూ ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాశ్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 24 : జీడబ్ల్యూఎంసీలోని పారిశుధ్య ఇతర విభాగాల కార్మికులకు వేయి రూపా యల వేతనం పెంచాలని తెలంగాణ మునిసిపల్ వర్కర్ అండ్ ఎం ప్లాయిస్ యూనియన్(సీఐటీయు) ప్రధాన కార్యదర్శి జన్ను ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్‌కు వినతిపత్రం అందచేశారు. జీహెచ్‌ఎంసీతో రాష్ట్రంలోని ఇతర యూఎల్‌బీల కార్మికులకు వేతనం పెంచిన క్రమంలో బల్దియా కార్మికులకు కూడా వర్తింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగారపు బాబు, మధు పాల్గొన్నారు.

1 నుంచి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు

దామెర, ఫిబ్రవరి 24 : మండలకేంద్రంలోని ప్రాచీన శివాలయంలో మార్చి 1 నుంచి పునఃప్రతిష్ఠాపనోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ బిల్లా రమణారెడ్డి తెలిపారు. శివాలయ పునఃనిర్మాణ పనులను ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆయన శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 1నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని కోరారు. కాగా, ఆలయానికి పలువురు దాతలు విరాళాలను అందచేశారు. జిల్లా కోర్టు స్పెషల్ పీపీ పోల్సాని అనిల్‌రెడ్డి-లక్ష్మీ దంపతులు రూ.1,00,016లు అందించగా, నునావత్ రవికుమార్-శ్రీలత దంపతులు రూ.2,00,000 అందించారు. ఈ కార్యక్రమంలో శివాలయ పుననిర్మాణ దాతలు, గ్రామ పెద్దలు చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, పోల్సాని ఇంద్రారెడ్డి, పోలం కృపాకర్‌రెడ్డి, గురిజాల శ్రీరాంరెడ్డి, పోల్సాని రాంరెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, దామెరుప్పుల శంకర్ పాల్గొన్నారు.

టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

దిక్సూచి

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సులు

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

అర్హత: అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/uOY1ljfలో చదవండి.

హాలియాలో విశ్వంభర చిత్రీకరణ





వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ శనివారం నల్లగొండ జిల్లా హాలియాలోని వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో జరిగింది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిరంజీవితో పాటు నటులు రాజారవీంద్ర, హర్షవర్థన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం చిత్రీకరణలో పాల్గొన్నారు. హాస్యనటులు, చిరంజీవికి మధ్య పలు సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్‌మిల్‌లో విశ్వంభర షూటింగ్ గురించి తెలుసుకున్న చిరంజీవి అభిమానులు, స్థానికులు ఉదయం నుంచే రైస్‌మిల్ వద్దకు భారీగా తరలివచ్చారు. హాలియా సీఐ రాఘవరావు అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి షూటింగ్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

మే 9నే కల్కి రాక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మే 9న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ డిజిటల్ మీడియాలో వస్తున్న వదంతులపై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ స్పందించింది. ముందు ప్రకటించినట్లు మే 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు స్పష్టం చేశారు. నేపథ్యంలో వినిపిస్తున్న



సంగీతానికి అనుగుణంగా ప్రభాస్ పాదం కదుపుతున్న వీడియోను శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.



భిన్నమైన పాత్రల్లో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఏ. హర్ష దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. కేకే రాధామోహన్ నిర్మించారు. మార్చి 8న విడుదలవుతోంది. శనివారం



చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. గోపీచంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కథను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇరగదీశాడు. ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. యాక్షన్‌తో పాటు కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ చాలా గొప్పగా ఉంటుందని హర్ష తెలిపారు.

శనివారం సూర్య వేట



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న విడుదలవుతోంది. శనివారం నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. సూర్య అనే పాత్రలో నాని స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఆయన పాత్రను మలచిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక.

సుజీత్ దర్శకత్వంలో

అలాగే నాని నటించే తదుపరి చిత్రాన్ని పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. 2025లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

బహుముఖం ఉత్కంఠభరితం



హర్షివ్ కార్తిక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రం టీజర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క చేతుల మీదుగా విడుదల చేశారు. 'టీజర్ బాగుంది. విజువల్స్‌తో పాటు సౌండ్‌కి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీచరణ్ బీజీఎం అదరగొట్టారు' అని ఆయన చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఊహించని మలుపులతో కథ ఉత్కంఠభరితంగా సాగుతుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. చాలా ప్రేమతో, కష్టంతో చేసిన సినిమా ఇది, ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని హర్షివ్ కార్తిక్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్. బ్యాగ్రౌండ్ స్కోర్: శ్రీచరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: ల్యూక్ ఫ్లెచర్









ఆంధ్ర 172 ఆలౌట్

ఇండోర్: రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో పోరులో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో తేలిపోయింది. ఆటకు రెండోరోజైన శనివారం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర 172 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రికీ భుయ్ (32), కరణ్ షిండే (38) వినహా అంతా విఫలమయ్యారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ ఆట ముగిసేసరికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 రన్స్ చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 234/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ ఎదుర్కొన్న తొలి బంతికే ఆఖరి వికెట్ కోల్పోయి ఆలౌటైంది.



సజన

తగ్గేదేలె..

మహిళల ప్రీమియర్ లీగ్ తొలి మ్యాచ్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి ముంబైకు సంచలన విజయం అందించిన కేరళ క్రికెటర్ సజన..ఆ ప్రదర్శనతో ఒక్కసారిగా స్టార్ అయిపోయింది. అయితే, ఆమె ఈస్థాయికి రావడం వెనుక ఎంతో పట్టుదల, శ్రమ దాగుంది. 29 ఏళ్ల సజనది వాయనాడ్‌లోని మనంతవాడి గ్రామం. తండ్రి సజీవన్ ఆటోడ్రైవర్. అరకొర ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టమైనా.. కుమార్తె ఆసక్తిని గమనించిన తండ్రి ఆమెను క్రికెట్‌లో ప్రోత్సహించాడు. 2013లో కేరళ క్రికెట్ సంఘం అకాడమీలో సీటు సంపాదించిన సజన.. అంతర్ జిల్లా అండర్-19 టోర్నీలో రాణించడం ఆమె కెరీర్‌కు మలుపు. హార్డ్ హిట్టింగ్ బ్యాటర్, ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్‌గా కేరళ అండర్-19 జట్టులో చోటు దక్కించుకొన్న ఆమె.. వెంటనే సారథిగా జట్టు పగ్గాలందుకొంది. ఈ క్రమంలో తన ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో వేగవంతమైన శతకం బాది రికార్డు సృష్టించింది. కేరళకు అండర్-23 టీ20 టైటిల్ అందించడంలో కీలకపాత్ర పోషించింది. భారత్-ఎ తరఫున సత్తా చాటింది. అంతా సవ్యంగా సాగిపోతుందనుకుంటున్న దశలో.. 2018లో వచ్చిన వరదల్లో తన ఇల్లు కొట్టుకుపోవడం, కరోనా సమయంలో అనారోగ్యానికి గురవడం లాంటి ఎన్నో సమస్యలు చుట్టుముట్టినా సజన మనోధైర్యంతో నిలబడింది. తొలి డబ్ల్యూపీఎల్ వేలంలో ఏ జట్టూ తనను తీసుకోకపోయినా నిరాశపడకుండా ఆటపైనే దృష్టి సారించింది. ఈసారి వేలంలో ముంబై జట్టుకు ఎంపికైంది. ఇక, ఆరంభ మ్యాచ్‌లోనే తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్ బాది ముంబైని గెలిపించిన సజనను సహచరులంతా తమ జట్టు 'పొలార్డ్' అం టూ ప్రశంసిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆటలో మాత్రం తగ్గేదేలె అన్నట్టుగా సజన దూసుకెళుతోంది.

- (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఆమిర్.. రియల్ హీరో

కశ్మీర్ దివ్యాంగ క్రికెటర్‌కు సచిన్ ప్రశంసలు



శ్రీనగర్: రెండు చేతులూ లేకపోయినా బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ కూడా చేయగల కశ్మీర్ యువకుడు ఆమిర్ హుస్సేన్ ప్రతిభకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అబ్బురపడ్డాడు. ఇటీవల అతడి వీడియోను చూసిన సచిన్ ఏదో ఒక రోజు కలుస్తానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం సచిన్ కశ్మీర్ పర్యటనలోనే ఉండడంతో తన మాటను నిలబెట్టుకున్నాడు. కశ్మీర్ పారా క్రికెట్ జట్టు కెప్టెన్ కూడా అయిన 34 ఏళ్ల ఆమిర్‌ను మాస్టర్ తన విడిదికి పిలిపించుకుని ఆప్యాయంగా మాట్లాడాడు. అంతేకాకుండా తన సంతకంతో కూడిన బ్యాట్‌ను అతడికి బహుమతిగా అందించాడు. 'ఆమిర్ నిజమైన హీరో. నువ్విలాగే ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నా. నిన్ను కలిసినందుకు సంతోషంగా ఉంది' అని సచిన్ ఓ వీడియోను పోస్ట్ చేశాడు.

ప్రమాదంలో చేతులు కోల్పోయినా..

ఎనిమిదేళ్ల వయస్సులో తన తండ్రి మిల్లులో జరిగిన ప్రమాదంలో ఆమిర్ రెండు చేతులను కోల్పోయాడు. అయినా కుంగిపోకుండా మెడ, భుజం సాయంతో బ్యాట్ పట్టుకుని బ్యాటింగ్‌లో రాటుదేలాడు. అలాగే కుడి కాళ్ల మధ్య వేలిలో బంతిని ఇరికించుకుని బౌలింగ్ కూడా చేయగలడు. 2013 నుంచి ఆమిర్ ప్రొఫెషనల్ క్రికెటర్‌గా మారి రాష్ట్ర జట్టు కెప్టెన్ అయ్యాడు.

హైదరాబాద్‌లో ప్రొ కబడ్డీ ప్లేఆఫ్స్ రేపటి నుంచి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 10 ప్లేఆఫ్స్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం నుంచి ప్లేఆఫ్స్ పోటీలు జరగనున్నాయి. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్లేఆఫ్స్ చేరిన ఆరు జట్ల కెప్టెన్లు ట్రోఫీతో ఫోజులిచ్చారు. సోమవారం జరిగే తొలి ఎలిమినేటర్‌లో దబాంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్, రెండో ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడనున్నాయి. ఈనెల 28న సెమీఫైనల్స్, మార్చి 1న ఫైనల్ జరగనుంది.

ఆశా.. పాంచ్ పటాకా



ఆశా శోభన (5/22)

యూపీపై 2 పరుగులతో బెంగళూరు గెలుపు ● మెరిసిన మేఘన, రిచా



రిచా (62) మేఘన (53)

బెంగళూరు: స్పిన్నర్ ఆశా శోభన (5/22) తిప్పేయడంతో.. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బోణీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో శనివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 2 పరుగులతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. రిచా ఘోష్ (37 బంతుల్లో 12 ఫోర్లతో 62), తెలుగ మ్మాయి సబ్బినేని మేఘన (44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 53) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. తొలుత బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 157 పరుగులు చేసింది. ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 155/7 స్కోరు మాత్రమే చేసింది. గ్రేస్ హ్యారిస్ (38), శ్వేతా షెరావత్ (31) టాప్‌స్కోరర్లు. ఆశా శోభనకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

ఒకే ఓవర్‌లో 3 వికెట్లు: ఛేదనలో కెప్టెన్ హీలీ (5) రెండో ఓవర్‌లోనే అవుటైనా.. బ్రిందా (18), తహిల మెక్‌గ్రాత్ (22) ఆచితూచి ఆడడంతో పవర్‌ప్లే ముగిసేసరికి యూపీ 36/1తో నిలిచింది. అయితే, రెండో వికెట్‌కు 38 పరుగులు జోడించిన బ్రింద, మెక్‌గ్రాత్‌లను 9వ ఓవర్‌లో ఆశా అవుట్ చేసింది. హ్యారిస్, శ్వేత నాలుగో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. చివరి 5 ఓవర్లలో 42 పరుగులు కావాల్సి రావడంతో వారియర్స్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, 17వ ఓవర్‌లో శ్వేత, హ్యారిస్, కిరణ్‌ను అవుట్ చేసిన ఆశా.. మ్యాచ్‌ను మలుపు తిప్పింది. పూనమ్ (14)ను వేర్హమ్ బౌల్డ్ చేసింది. చివరి 6 బంతుల్లో 11 రన్స్ అవసరమవగా.. దీప్తి (13 నాటౌట్)ని భారీ షాట్లు ఆడకుండా మోలినెక్స్ కట్టడి చేసింది.

ఆరంభంలో తడబాటు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. డివైన్ (1), కెప్టెన్ స్మృతి మంధాన (13), పెర్రీ (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో ఆదిలోనే 54/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో మేఘన, రిచా నాలుగో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. గైక్వాడ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన మేఘన.. సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొంది. కాగా, 14వ ఓవర్‌లో సైమా బౌలింగ్‌లో రిచా నాలుగు ఫోర్లతో 17 రన్స్ రాబట్టింది. అయితే, మేఘన, వేర్హమ్ (0)ను ఒకే ఓవర్‌లో రాజేశ్వరి వెనక్కిపంపింది. రిచా వరుస బౌండ్రీలతో అర్ధ శతకం చేసినా.. దీప్తి బౌలింగ్‌లో అవుటైంది. ఆఖరి ఓవర్‌లో శ్రేయాంక (8 నాటౌట్) భారీ సిక్స్‌తో జట్టు స్కోరును 160కి చేరువ చేసింది.

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 157/6 (రిచా ఘోష్ 62, మేఘన 53, రాజేశ్వరి 2/24).
యూపీ: 20 ఓవర్లలో 155/7 (గ్రేస్ హారిస్ 38, శ్వేతా షెరావత్ 31, తహిల 22, ఆశా శోభన 5/22).

డబ్ల్యూపీఎల్‌లో నేడు
గుజరాత్ X ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

తడ 'బ్యాటు'



షోయబ్ బషీర్ (4/84)

● భారత్ మొదటి ఇన్నింగ్స్ 219/7 ● యశస్వీ అర్ధసెంచరీ
● స్పిన్నర్ బషీర్‌కు నాలుగు వికెట్లు ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 353

నాలుగో టెస్టు



జైస్వాల్ (73)

రాంచీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత జట్టు రెండో రోజు కూడా ఆకట్టుకోలేకపోయింది. ఈసారి బ్యాటర్లు సత్తాచాటడంలో విఫలమయ్యారు. 20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/84) తన మ్యాజిక్ బంతులతో భారత టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్‌ను వణికించాడు. దీంతో జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. అదీగాకుండా అంపైర్ కాల్స్ కారణంగా మూడుసార్లు భారత్‌కు ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయి. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (117 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్‌తో 73) మాత్రం అర్ధసెంచరీతో ఫామ్‌ను చాటుకోగా.. గిల్ (38), క్రీజులో ఉన్న ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) పర్వా లేదనిపించారు. ఫలితంగా రెండోరోజు శనివారం ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 73 ఓవర్లలో 7 వికెట్లకు 219 పరుగులు చేసింది. హార్ట్‌లీకి రెండు వికెట్లు దక్కాయి. ఇంకా 134 పరుగులు వెనుకబడి ఉన్న దశలో, మూడో రోజున జురెల్, కుల్దీప్ (17 బ్యాటింగ్) ఎంతసేపు వికెట్‌ను కాపాడుకుంటారనేది చూడాలి. పైగా మరో మూడు ఓవర్లలో ఇంగ్లండ్ కొత్త బంతిని తీసుకునే అవకాశం కూడా ఉంది. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగులకు ఆలౌటైంది. రూట్ (122 నాటౌట్) అజేయంగా నిలవగా, రాబిన్సన్ (58) అర్ధసెంచరీ సాధించాడు. ఎనిమిదో వికెట్‌కు ఈ జోడీ 102 పరుగుల భాగస్వామ్యం అందించింది. జడేజాకు నాలుగు, ఆకాశ్‌కు మూడు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

జైస్వాల్ పోరాడినా..: భారత్ తొలి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ ఆటే హైలైట్. మరో ఎండ్‌లో స్పిన్నర్ బషీర్ టపటపా వికెట్లు నేలకూలుస్తున్నా.. జైస్వాల్ మాత్రం ఆత్మవిశ్వాసంతో నిలిచాడు. మూడో ఓవర్‌లోనే రోహిత్ (2)ను అండర్సన్ అవుట్ చేయగా.. గిల్, యశస్వీ ఆదుకునే ప్రయత్నం చేశారు. లంచ్ బ్రేక్ తర్వాత గిల్ కాస్త జోరు పెంచి అండర్సన్ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాడు. కానీ బషీర్ ఈ ప్రమాదకర జోడీని విడదీస్తూ గిల్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో రెండో వికెట్‌కు 82 పరుగుల విలువైన భాగస్వామ్యం ముగిసింది. ఇక రజత్ పటీదార్ (17), జడేజా (12)లను బషీర్ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. అంతేకాకుండా స్వల్ప వ్యవధిలోనే బషీర్ భారత్‌కు మరో ఝలక్ ఇచ్చాడు. సెంచరీ వైపు వెళుతున్న జైస్వాల్‌ను తక్కువ బౌన్స్‌తో వచ్చిన బంతికి బౌల్డ్ చేశాడు. ఇక సర్ఫరాజ్ (14), అశ్విన్ (1)లను హార్ట్‌లీ అవుట్ చేయడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది.

ఆదుకున్న జురెల్-కుల్దీప్: ఓ దశలో 177/7 స్కోరుతో ఉన్న జట్టు 200 పరుగులైనా చేయగలుగుతుందా? అనిపించింది. కానీ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్ ఇంగ్లండ్ బౌలర్లను విసిగిస్తూ బ్యాటింగ్ సాగించారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా వికెట్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆడారు. ఈ క్రమంలో ఇద్దరూ ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 42 పరుగులు జోడించగా.. తామెదుర్కొన్న 106 బంతుల్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ మాత్రమే రావడం వీరి డిఫెన్సివ్ ఆటతీరును చూపుతోంది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353
భారత్ మొదటి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) బషీర్ 73; రోహిత్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 2; గిల్ (ఎల్బీ) బషీర్ 38; రజత్ (ఎల్బీ) బషీర్ 17; జడేజా (సి) పోప్ (బి) బషీర్ 12; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) హార్ట్‌లీ 14; జురెల్ (బ్యాటింగ్) 30; అశ్విన్ (ఎల్బీ) హార్ట్‌లీ 1; కుల్దీప్ (బ్యాటింగ్) 17; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 73 ఓవర్లలో 219/7. వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-112, 4-130, 5-161, 6-171, 7-177. **బౌలింగ్:** అండర్సన్ 12-4-36-1; రాబిన్సన్ 9-0-39-0; బషీర్ 32-4-84-4; హార్ట్‌లీ 19-5-47-2; రూట్ 1-0-1-0.

5 ఓ టెస్టు సిరీస్‌లో 600+ పరుగులు సాధించిన ఐదో భారత బ్యాటర్‌గా జైస్వాల్ (618). గతంలో సర్దేశాయ్, గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ ఈ ఫీట్ సాధించారు.

ఈసారి ఇంగ్లండ్‌కు కలిసొచ్చె..

రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంపైర్ కాల్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. తమ స్టార్ ఓపెనర్ జాక్ క్రాలే ఆ విధంగా అవుట్ కావడమే దానికి కారణం. కానీ తాజా టెస్టు రెండో రోజు ఆటలో అదే అంపైర్ కాల్ కారణంగా ఇంగ్లండ్ భారీగా లాభపడింది. ఎందుకంటే క్రీజులో నిలదొక్కుకున్న గిల్‌తో పాటు రజత్ పటీదార్, అశ్విన్ సైతం అంపైర్ కాల్‌తోనే పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. వీరి ఎల్బీల విషయంలో భారత్ డీఆర్‌ఎస్ తీసుకున్నా ఫీల్డ్ అంపైర్ అవుట్ ఇవ్వడం.. అటు ఇంపాక్ట్‌లోనూ అంపైర్ కాల్ రావడంతో చేసేదేమీ లేకపోయింది.

2025 నాటికి 170 గిగావాట్లకు పునరుత్పాక ఇంధన సామర్థ్యం



ఇక్రా వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో భారీ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తి చేసే విద్యుత్ మినహా మొత్తం పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం వచ్చే ఏడాది మార్చి నాటికి 170 గిగావాట్లకు పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. గత ఏడాది డిసెంబరు నాటికి ఇది 135 గిగావాట్లుగా ఉంది. వచ్చే ఐదారు సంవత్సరాల కాలంలో పునరుత్పాదక ఇంధన (రెన్యువబుల్ ఎనర్జీ, ఆర్‌ఈ) సామర్థ్యాలు పెరగడంతో దేశవ్యాప్త విద్యుదుత్పత్తిలో భారీ హైడ్రో ప్రాజెక్టులు ఉత్పత్తి చేసే విద్యుత్ సహా మొత్తం ఆర్‌ఈ సామర్థ్యం 23 శాతం నుంచి 40 శాతానికి పెరుగుతుందని ఇక్రా అంచనా. దేశంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలంటే ఆర్‌ఈ వనరుల విద్యుత్ అత్యంత కీలకమని పేర్కొంది. ప్రధానంగా ఇంధన నిల్వ వ్యవస్థల మద్దతుతో పాటు పవన, సౌర విద్యుత్ ఇంధన వినియోగం ఇందుకు ప్రధానంగా సహాయకారిగా ఉంటుందని తెలిపింది. కేంద్ర నోడల్ సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 16 గిగావాట్ల ప్రాజెక్టుల బిడ్లు ఆమోదించగా మరో 17 గిగావాట్ల బిడ్లు పరిశీలన దశలో ఉన్నాయని, ఇది పునరుత్పాదక ఇంధన విభాగానికి మరింత మద్దతు ఇస్తుందని ఇక్రా వెల్లడించింది.

ఏటా 50 గిగావాట్లకు బిడ్డింగ్: దేశంలో ఇంధన లభ్యత పెంచేందుకు ఏటా 50 గిగావాట్ల వార్షిక బిడ్డింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వం గత ఏడాది మార్చిలో ప్రకటించింది. అయితే విద్యుత్ నిల్వకు అయ్యే వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆర్‌ఈ- రౌండ్ ది క్లాక్ (ఆర్‌టీసీ) విభాగంలో టారిఫ్‌లు విడిగా పవన, సౌర విద్యుత్ టారిఫ్‌లతో పోల్చితే అధికంగా ఉన్నట్టు ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ విభాగం హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్‌కుమార్ కదమ్ తెలిపారు. ఇటీవల ఆర్‌టీసీ బిడ్ టారిఫ్‌లు యూనిట్‌కు రూ.4 నుంచి రూ.4.50 మధ్యన ఉన్నాయి. అయితే పవన విద్యుత్ ప్రాజెక్టుల విభాగంలో ఎదురవుతున్న సరఫరా వ్యవస్థ సవాళ్లు ఆర్‌టీసీ ప్రాజెక్టుల అమలుకు అవరోధంగా నిలుస్తున్నట్టు ఆయన చెప్పారు.

అలాగే భూసేకరణ, ట్రాన్స్‌మిషన్ కనెక్టివిటీ సవాళ్లు కూడా సామర్థ్యాల జోడింపు అవకాశాలను దెబ్బ తీయవచ్చని పేర్కొన్నారు. ఇటీవల పీవీ సెల్ ధరలు 65 శాతం, పీవీ మాడ్యూల్ ధరలు 50 శాతం తగ్గడం వల్ల సౌర విద్యుత్ రంగంలో రుణ కవరేజీ మెట్రిక్స్ కూడా మెరుగుపడతాయంటున్నారు. దిగుమతి చేసుకున్న పీవీ సెల్స్‌తో దేశీయ ఓఈఎంలు తయారుచేసిన మాడ్యూల్స్‌ను సేకరించి, యూనిట్ రూ.2.5 బిడ్డింగ్ టారిఫ్‌తో వచ్చే సౌర విద్యుత్ ప్రాజెక్టులకు డెట్ సర్వీస్ కవరేజీ నిష్పత్తి (డీఎస్‌సీఆర్-ప్రస్తుత రుణ బాధ్యతలు తీర్చేందుకు అవసరమైన నగదు ప్రవాహం) 0.35 శాతం మెరుగుపడిందని కదమ్ అన్నారు.

మార్కెట్ అవకతవకలపై జాగ్రత్త

బ్రోకర్లను హెచ్చరించిన సెబీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్లో అవకతవకలపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శాశ్వత సభ్యుడు కమలేశ్ చంద్ర హెచ్చరించారు. బ్రోకర్లు వీటిపై సదా కన్నేసి ఉంచాలని, ఆ తరహా ఉదంతాలను నిరోధించాలని ఆయన సూచించారు. మార్కెట్లో నేరాలకు పాల్పడిన వారిపై సెబీ కఠిన చర్యలు చేపడుతున్నదన్నారు. మదుపరులు విశ్వాసం కోల్పోతే మార్కెట్ మొత్తం విఫలమవుతుందన్నారు. ఇప్పటికీ మార్కెట్లో మోసా లు జరుగుతున్నాయని, అన్నింటిలోనూ నియంత్రణ మండలి కలుగజేసుకోలేదన్నారు. కొందరు బ్రోకర్లు మార్కెట్లో మోసాలకు పాల్పడుతున్నారు, మీ సంఘమే ఈ ఉదంతాలపై కన్నేసి ఉంచాలన్నారు. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ ఎక్స్ఛేంజెస్ మెంబర్స్ ఆఫ్ ఇండియా (ఏఎన్ఎంఐ) నిర్వహించిన 13 అంతర్జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏఐ సాయంతో దర్యాప్తు

సెబీ తన దర్యాప్తులతో పాటు చాలా అంశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించుకుంటున్నదని కమలేశ్ చంద్ర తెలిపారు. వ్యాపార అభివృద్ధి, నిర్వహణ దక్షతను పెంచుకునే విషయంలో ఆధునిక సాంకేతిక వినియోగంపై దృష్టిసారించాలని ఆయన ఈ సందర్భంగా బ్రోకర్లకు సూచించారు.

రైల్వేల చేతికి ఆర్ఐఎన్ఎల్ ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్!



న్యూఢిల్లీ: రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, విశాఖ ఉక్కు)కు ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఉన్న ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్ కొనుగోలు బరిలో భారతీయ రైల్వే ముందంజలో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్లాంట్ టేకోవర్, ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు రైల్వే శాఖ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని సమాచారం. ఈ ప్రతిపాదనను త్వరలోనే కేబినెట్ ఆమోదం కోసం పంపే అవకాశం ఉంది. పూర్తి వాటా కొనుగోలు లేదా ఔట్‌సోర్స్ అగ్రిమెంట్ (ఉత్పత్తి ఆధారంగా చెల్లింపు) లేదా ఇతర రూపంలో డీల్ కుదిరే వీలుంది. ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయానికి రావాల్సి ఉంది.

2021లో ఏర్పాటైన ఈ ప్లాంట్‌పై ఆర్ఐఎన్ఎల్ ఇప్పటికే రూ.2,250 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. ఈ ప్లాంట్ ఏటా 80,000 ఫోర్జ్‌డ్ వీల్స్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. తొలుత లభించిన 2,000 వీల్స్ ఆర్డర్ల డెలివరీ 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయింది. కానీ, పలు కారణాల వల్ల ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయలేకపోతోంది. ప్లాంట్ టేకోవర్ తర్వాత రైల్వేస్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తొలి దశలో 40,000 యూనిట్లు, రెండో దశలో 60,000 యూనిట్లకు పెంచాలని భావిస్తోంది. ఈ ప్లాంట్ కొనుగోలు రైల్వేస్‌కు కలిసిరానుంది. ఎందుకంటే, రైల్వే శాఖ వీల్స్‌ను యూకే, చెక్ రిపబ్లిక్, బ్రెజిల్, రొమేనియా, జపాన్, చైనా, ఉక్రెయిన్, రష్యా నుంచి దిగుమతి చేసుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.520 కోట్ల విలువైన 80,000 వీల్స్‌ను చైనా, రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. మరో 40,000 వీల్స్‌ను సెయిల్ నుంచి కొనుగోలు చేసింది.

'దివాలా' చట్టంతో రూ.12.95 లక్షల కోట్లు

దారికొస్తున్న ఘరానా ప్రమోటర్లు : ఐబీబీఐ

న్యూఢిల్లీ: కొంతమంది ప్రమోటర్లపై దివాలా చట్టం (ఐబీసీ) బాగానే పని చేస్తోంది. ఈ చట్టం కారణంగా కంపెనీల యాజమాన్యం ఎక్కడ తమ నుంచి తప్పిపోతుందోనని భయపడుతున్నారు. రుణదాతలు తమను ఎన్‌సీఎల్‌టీలకు లాగక ముందే బకాయిలు క్లియర్ చేస్తున్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2016 డిసెంబరు నుంచి గత ఏడాది అక్టోబరు వరకు రూ.9.74 లక్షల కోట్ల బకాయిలు చెల్లించేశారు. ఇందుకోసం రుణదాతలకు 27,514 అప్లికేషన్లు అందాయి. ది ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) తన తాజా న్యూస్‌లెటర్‌లో ఈ విషయం తెలిపింది. మరో రూ.3.21 లక్షల కోట్లను రుణదాతలు ఎన్‌సీఎల్‌టీలకు వెళ్లి వసూలు చేసుకున్నారు. ఎన్‌సీఎల్‌టీలు స్వీకరించిన దివాలా కేసుల్లో రుణదాతల వసూళ్లు, మొత్తం బకాయిల్లో 32 శాతం మించడం లేదు. రుణదాతలు ఎంతకీ తేల్చకపోవడం ఇందుకు ప్రధాన కారణమని ఐబీబీఐ చైర్‌పర్సన్ రవి మిట్టల్ తెలిపారు.

బిజినెస్

ఉబెర్‌తో అదానీ భాగస్వామ్యం


భవిష్యత్‌లో జరగవచ్చని గౌతమ్ అదానీ సంకేతాలు



న్యూఢిల్లీ: ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహీ శనివారం అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీని కలిశారు. భవిష్యత్‌లో ఉబెర్‌తో తమ గ్రూప్ జట్టు కట్టే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా అదానీ సంకేతాలిచ్చారు. ఈ భేటీలో భారత్ వృద్ధి అవకాశాలు, ఇక్కడి మార్కెట్‌పై తమ లక్ష్యాల గురించి చర్చించినట్లు ఇరువురు అధిపతులు ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు. "ఉబెర్ సీఈఓ దార్‌తో చర్చ ఆహ్లాదకరంగా జరిగింది. భారత్‌లో ఉబెర్ సేవల విస్తరణ, ముఖ్యంగా డ్రైవర్ల ఉద్ధరణ, వారి గౌరవాన్ని పెంచే విషయంలో ఆయన లక్ష్యాలు స్ఫూర్తిదాయకం. భవిష్యత్‌లో దారా, ఉబెర్ ఇండియా బృందంతో భాగస్వామ్యం కోసం ఉత్సాహంగా ఉన్నాం" అని అదానీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

- సెంచురీ మ్యాట్రెసెస్..క్యూ-జెల్ మ్యాట్రెసెస్ శ్రేణి పరుపులను విడుదల చేసింది. క్యూసెన్స్ టెక్నాలజీతో ఈ పరుపులను తీసుకువచ్చింది. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏడేళ్ల వారంటీతో క్యూ-జెల్ లగ్జరీ, క్యూ-జెల్ కంఫర్ట్ వేరియంట్లలో ఈ మ్యాట్రెసెస్‌ను తీసుకువచ్చినట్లు తెలిపింది. వీటి ధరలు రూ.24,938 నుంచి రూ.47,752 మధ్యన ఉన్నాయి.
- వేరబుల్ బ్రాండ్ బౌల్ట్...తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో వ్యూహాత్మకంగా విస్తరించేందుకు డిస్ట్రిబ్యూటర్ పార్ట్‌నర్‌గా డికాజో సొల్యూషన్స్‌ను నియమించుకుంది. తెలుగు రాష్ట్రాల్లోని వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకు ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని బౌల్ట్ తెలిపింది.
- సామ్‌సంగ్ మార్కెట్లోకి సరికొత్త ఫిట్‌నెస్ ట్రాకర్ గెలాక్సీ ఫిట్3 విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ హెల్త్‌మానిటరింగ్ టెక్నాలజీ, అల్యూమినియం బాడీతో దీన్ని తీసుకువచ్చినట్లు వెల్లడించింది. 1.6 అంగుళాల డిస్‌ప్లేతో కూడిన ఈ ఫిట్‌నెస్ ట్రాకర్ ఒకసారి చార్జింగ్‌తో 13 రోజుల పాటు పనిచేస్తుందని తెలిపింది. గ్రే, సిల్వర్, పింక్ రంగుల్లో అందుబాటులో ఉండనున్న దీని ధర రూ.4,999.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ	
హైదరాబాద్	520
25వ తేదీ	
చిత్తూరు	568
గోదావరి	515
విజయవాడ	515
విశాఖపట్నం	525
వరంగల్	522

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	140
వరంగల్	140
కరీంనగర్	140
మహబూబ్‌నగర్	140
కర్నూలు	140
విశాఖపట్నం	127
గోదావరి	144
విజయవాడ	144
గుంటూరు	144
ఒంగోలు	144
చిత్తూరు	144

బిల్డర్లకు నోటీసులు ఎందుకు వస్తున్నాయ్..?

ఇదీ GST



రాంబాబు గొండాల

ఈ మధ్య కాలంలో నిర్మాణ రంగంలోని వారికి జీఎస్‌టీకి సంబంధించిన నోటీసులు రావటం గమనిస్తున్నాం. ముఖ్యంగా జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన 2017 జూలై నుంచి 2019 మార్చి మధ్య కాలానికి గాను ఎక్కువగా నోటీసులు వస్తున్నాయి. దీనికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ ముఖ్య కారణం మాత్రం ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను రివర్స్ చేయాల్సిన సందర్భాల్లో రివర్స్ చేయకపోవటం. దీని గురించి చాలా మంది బిల్డర్లకు అవగాహన లేకపోవటం వల్ల అధికారుల నుంచి నోటీసులు అందుకోవాల్సి వస్తుంది. అసలు తీసుకున్న ఐటీసీ ఎందుకు రివర్స్ చేయాలనే సందేహం చాలా మందిలో ఉండవచ్చు.

ఏదేనీ సరఫరా పన్ను పరిధిలోకి వస్తుంటే.. ఆ సరఫరా అందించటానికి పొందే ముడి పదార్థాలు, సేవల మీద ఐటీసీ తీసుకోవచ్చనే విషయం అందరికీ తెలిసిందే. అంటే నిర్మాణ రంగంలో ఉండే బిల్డర్లు తమ నిర్మాణానికి ఉపయోగపడే సిమెంట్, స్టీల్, టైల్స్, రంగులు, శానిటరీ వస్తువులతో పాటు తాము పొందే వివిధ రకాల సేవలు అంటే ఇంజనీరింగ్, రవాణా, మానవ వనరులు మొదలైన వాటి మీద ఐటీసీ తీసుకోవచ్చు. ఇలా తీసుకునే క్రెడిట్‌ను తాము అమ్మే అపార్ట్‌మెంట్స్ మీద కట్టాల్సిన పన్ను కోసం సర్దుబాటు చేసుకోవచ్చు. అయితే అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత జరిగే అమ్మకాలకు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. మామూలుగా అయితే ఏదేనీ సరఫరా, పన్ను పరిధి నుంచి పన్ను మినహాయింపులోకి వస్తే, మినహాయింపు వచ్చిన తేదీ నాటికి తన దగ్గర మిగిలి ఉన్న స్టాక్ ఆధారంగా ఐటీసీని రివర్స్ చేయాలి. ఎందుకంటే, ఆ స్టాక్‌కు సంబంధించి ఇప్పుడు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ, ఆ స్టాక్ మీద ఇంతకు ముందే క్రెడిట్ పొంది ఉన్నాడు. ఎప్పుడైతే అంతిమ సరఫరా పన్ను పరిధిలోకి రాదో దానికి సంబంధించిన ఇన్‌పుట్స్ మీద క్రెడిట్ రాదు. అందుకే, తన వద్ద మిగిలి ఉన్న స్టాక్‌కు సంబంధించి తీసుకున్న క్రెడిట్ రివర్స్ చేయాలి. ఈ విధంగా చూస్తే బిల్డర్ కూడా తనకు పన్ను మినహాయింపు నాటికి అంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి తాను ఐటీసీ పొందీ, మిగిలి ఉన్న స్టాక్‌కు సంబంధించిన క్రెడిట్ రివర్స్ చేయాలి. ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, మిగిలి ఉన్న స్టాక్ అంటే మిగిలిన సిమెంట్, స్టీల్, టైల్స్ అని అర్థం కాదు. తాను ఏ ఇన్‌పుట్స్ ఉపయోగించి నిర్మాణం చేసాడో.. ఆ నిర్మాణానికి సంబంధించి అమ్ముడుపోకుండా మిగిలిన భాగం అని అర్థం.

అందుకే, ఎంత క్రెడిట్ రివర్స్ చేయాలి అనటానికి ఒక సులువైన ఫార్ములా ఉంది. మొదట, ఆ ప్రాజెక్ట్‌లో తీసుకున్న మొత్తం ఐటీసీని అంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చేంత వరకు తీసుకున్న క్రెడిట్‌ను లెక్కించాలి. అలాగే, ఆ ప్రాజెక్ట్‌లో మొత్తం కార్పెట్ ఏరియా, అమ్ముడు కాకుండా మిగిలిన కార్పెట్ ఏరియాను తీసుకుని , దామాషా పద్ధతిలో క్రెడిట్ రివర్స్ చేయాలి. ఉదాహరణకు ఒక ప్రాజెక్ట్‌లో మొత్తం నిర్మాణం 20 వేల చదరపు అడుగులు అనుకుందాం. అలాగే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి తీసుకున్న మొత్తం క్రెడిట్ రూ. కోటి అనుకుందాం. అలాగే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి ఇంకా 5 వేల చదరపు అడుగుల నిర్మాణం అమ్మకం జరగకుండా మిగిలి ఉన్నదనుకుంటే, మొత్తం నిర్మాణంలో మిగిలిన నిర్మాణం 25 శాతం కాబట్టి, తీసుకున్న క్రెడిట్‌లో 25 శాతం అంటే రూ.25 లక్షల మేర క్రెడిట్ రివర్స్ చేయాలి. అయితే చాలా మంది బిల్డర్లు ఎదుర్కొనే సమస్య ఏమిటంటే తాము తీసుకున్న క్రెడిట్ మొత్తం, చెల్లించాల్సిన ట్యాక్స్ కోసం వాడుకుంటారు. కాబట్టి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి వారి దగ్గర ఎలాంటి క్రెడిట్ మిగిలి ఉండదు. తమ దగ్గర ఎలాంటి క్రెడిట్ మిగల లేదు కాబట్టి, తాము క్రెడిట్ రివర్స్ చేయాల్సిన అవసరం లేదనుకుంటారు. కానీ, అది తప్పు. తమ దగ్గర క్రెడిట్ ఉన్నా లేకున్నా పైన చెప్పిన ఉదాహరణలో లాగా చెల్లించాల్సిన మొత్తం ప్రభుత్వానికి చెల్లించాలి.

ఇలా చెల్లించాల్సిన మొత్తాన్ని కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చిన తదుపరి ఆర్థిక సంవత్సరం సెప్టెంబరులోపు రివర్స్ చేయాలి. ఉదాహరణకు ఏదేనీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కంప్లీషన్ సర్టిఫికెట్ 2018-19లో వచ్చి ఉంటే, 2019 సెప్టెంబరు లోపు తాను రివర్స్ చేయాల్సిన మొత్తం ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఆ మొత్తాన్ని 2018-19 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అంటే 31 మార్చిలోపు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. లేదంటే 2019 ఏప్రిల్ 1 నుంచి వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైన చెప్పిన విషయాలను జాగ్రత్తగా పాటించటంతో పాటుగా ఇతర అంశాల పట్ల కూడా చట్టపరమైన అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

29న బీజేపీ తొలి జాబితా

- రాష్ట్రంలో 10 ఎంపీ సీట్లకు 30 మంది పేర్లు
- అధిష్ఠానానికి జాబితా అందజేసిన కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ నెల 29న 100 మంది అభ్యర్థుల పేర్లతో తొలి జాబితా ప్రకటించనుంది. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కోర్ కమిటీ సమావేశమైంది. తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, కేరళకు చెందిన నేతలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమావేశమయ్యారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు, అభ్యర్థుల ఎంపికపై వ్యూహాలు, ప్రతిపక్ష పార్టీల ఎత్తుగడలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి తెలంగాణ నుంచి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోపాటు బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, డీకే అరుణ, జితేందర్ రెడ్డి హాజరయ్యారు. తెలంగాణలో 10 పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. వివిధ అంశాలపై రాష్ట్ర నేతలను అమిత్ షా, నడ్డా అడిగి తెలుసుకున్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం నుంచి ముగ్గురు ఆశావహుల జాబితాను అధిష్ఠానానికి కిషన్ రెడ్డి అందించారు. వివిధ పార్టీల నుంచి కొందరు నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికోసమే మిగిలిన ఏడు నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయలేదని, వాటిపై త్వరలోనే స్పష్టత రానుందని సమాచారం. కాగా రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాల్లో కొత్తవారి పేర్లు తాజాగా తెరపైకి వచ్చాయి. ఇందులో ప్రముఖ నిర్మాత, మాజీ ఐఏఎస్ అధికారి పేర్లు కూడా ఉన్నాయని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు జితేందర్‌రెడ్డికి పార్టీ జాతీయ నాయకత్వం నుంచి పిలుపు వచ్చింది. జితేందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ కోరుతున్నారు. అయితే, ఈ టికెట్ కోసం పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్టీ కోశాధికారి శాంతకుమార్ కూడా పట్టుబడుతున్నారు. దీంతో జితేందర్‌రెడ్డి ఢిల్లీ పర్యటన పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

జనసేనకు 3 ఎంపీ, 24 అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ తడబడుతుండగా.. టీడీపీ దూకుడుగా ఒకేసారి 94 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. కాగా, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని, వ్యక్తులు, పార్టీ ప్రయోజనం కోసం తాము కలవలేదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలి జాబితాను ఆయన విడుదల చేశారు. ఐదు కోట్ల మంది ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ-జనసేన కలిసి పనిచేయాలని నిర్ణయించాయని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. "ఇది రాష్ట్రానికి చరిత్రాత్మక రోజు. మంచిప్రయత్నానికి ఇది తొలి అడుగు. విభజన వల్ల రాష్ట్రం నష్టపోయింది. కానీ, రాష్ట్రం విడిపోవడం వల్ల ఏపీకి జరిగిన నష్టం కంటే జగన్ సీఎం అయ్యాక ఎక్కువ నష్టం జరిగింది. టీడీపీ-జనసేన ఉమ్మడి తొలిజాబితాలో 99 మంది అభ్యర్థులను ఎంపిక చేశాం. టీడీపీ జాబితాలోని 24 మంది మొదటిసారి పోటీకి సిద్ధమవుతున్నారు. డాక్టర్లు, ఐఏఎస్‌లు, గ్రాడ్యుయేట్లకు అవకాశం ఇచ్చాం. మరోవైపు వైసీపీ నేతలు.. ఎర్రచందనం స్మగ్లర్లు, రౌడీలు, గూండాలను ఇన్‌చార్జులుగా ప్రకటించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ చేయనంత కసరత్తు చేశాం. సుమారు 1.30 కోట్ల మంది అభిప్రాయాలు తీసుకున్నాం. మాఘ పౌర్ణమి శుభ దినాన అభ్యర్థులను ప్రకటించాం. 24 అసెంబ్లీ, మూడు పార్లమెంటు సీట్లలో జనసేన పోటీచేస్తుంది. మిగిలిన సీట్లలో టీడీపీ పోటీ చేస్తుంది. బీజేపీ కూడా కలిసి వస్తే తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటాం. రాష్ట్రాన్ని జగన్ నుంచి విముక్తి చేయడానికి రాష్ట్ర భవిష్యత్తు కోసం మేం పని చేస్తున్నాం. టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించిన రోజే గెలిచాం. ఆనాడే వైసీపీ కాడి పడేసింది. అవినీతి డబ్బులతో ఓట్లు కొనే ప్రయత్నం చేస్తున్నారు. మా దగ్గర డబ్బులు లేకపోవచ్చు. కానీ ప్రజాబలం ఉంది. ప్రజలే ముందుకొచ్చి టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలి. ఈ దఫా జరిగే ఎన్నికలు అత్యంత కీలకమైనవి' అని వ్యాఖ్యానించారు.



బరిలో నిలిచే స్థానాల్లో గట్టి పోటీ ఇస్తాం: పవన్

ఎన్నికల్లో 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఎక్కువ స్థానాలు తీసుకుని ప్రయోగం చేసే కంటే తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడేలా ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రాన్ని దారిలో పెట్టడమే లక్ష్యమని, పార్టీ, వ్యక్తిగత ప్రయోజనాలు దాటి రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకున్నామన్నారు. టీడీపీ-జనసేన పొత్తు బలంగా ఉండాలని బీజేపీని దృష్టిలో పెట్టుకున్నామన్నారు. తప్పకుండా టీడీపీకి జనసేన ఓటు బదిలీ కావాలన్నారు.

చంద్రబాబు మాస్టర్ స్ట్రోక్..

టీడీపీ అధినేత చంద్రబాబు ఆకస్మిక సంచలనానికి తెరదీశారు. తమ పార్టీకి చెందిన 94 మంది అభ్యర్థుల జాబితాను ఒకేసారి విడుదల చేశారు. ఆయన టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడానికి ముందే ఇంతమంది అభ్యర్థుల పేర్లు ప్రకటించడం ఇదే ప్రథమం. మొత్తం 175 సీట్లు ఉండగా, అందులో 60% సీట్లకు అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించారు.

గూడెం సభ తర్వాత ఎంపీ జాబితా!

శనివారం టీడీపీ, జనసేనకు సంబంధించి కేవలం అసెంబ్లీ అభ్యర్థుల జాబితా మాత్రమే విడుదలైంది. ఎంపీ సీట్లకు కూడా ఈ 2 పార్టీలు తమ అభ్యర్థులను చాలావరకు ఖరారు చేసుకొన్నా, ఆ పేర్లు విడుదల చేయలేదు. బీజేపీతో పొత్తు చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో ఎంపీ అభ్యర్థుల ప్రకటన వాయిదా వేశారు. ఈ నెల 28వ తేదీన టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి బహిరంగ సభ తాడేపల్లిగూడెంలో జరగనుంది. ఆ సభ తర్వాత ఎంపీ అభ్యర్థుల పేర్లు, మరికొందరు అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు విడుదలయ్యే అవకాశముంది.

బీజేపీకి పరిమితమే..

టీడీపీ, జనసేన కూటమితో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్న బీజేపీకి పొత్తులో భాగంగా ఇచ్చే సీట్లు పరిమితంగానే ఉంటాయని మిత్రపక్షం వర్గాల్లో చర్చసాగుతోంది. బీజేపీ జాతీయ నాయకత్వం కూడా ఎక్కువ సీట్లు కోరే ఆలోచనలో లేదని, తమకు ఏపీలో ప్రాతినిధ్యం ఉంటే చాలని భావిస్తోందని అంటున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 4 అసెంబ్లీ సీట్లు, 4 లోక్‌సభ సీట్లు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తానికి ఈ నెలాఖరులోపు బీజేపీతో సీట్ల సర్దుబాటు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని టీడీపీ, జనసేన వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, అనకాపల్లి ఎంపీ సీటు జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలిసింది. ఆ పార్టీకి రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలని గతంలో నిర్ణయం జరిగింది. కాకినాడ, మచిలీపట్నం స్థానాలను గతంలో ఆ పార్టీకి కేటాయించారు. పవన్ సోదరుడు నాగబాబు అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేయబోతున్నారని, ఆయన కోసమే మూడో సీటును ఆ పార్టీ తీసుకుందని వినిపిస్తోంది.

ఏపీ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితా

ఇచ్ఛాపురం(బెందాళం అశోక్); టెక్కలి(అచ్చెన్నాయుడు); ఆముదాలవలస (కే రవికుమార్); రాజాం(ఎస్సీ) (కోండ్రు మురళీ); కురుపాం(ఎస్టీ) (తొయ్యకల జగదీశ్వరి); పార్వతీపురం(ఎస్సీ) (విజయ్ బోనెల); సాలూరు(ఎస్టీ) (జీ సంధ్యారాణి); బొబ్బిలి (ఆర్ఎస్‌వీకేకే రంగారావు); గజపతినగరం (కే శ్రీనివాస్); విజయనగరం (పూసపాటి ఆదితి విజయలక్ష్మి గజపతిరాజు); విశాఖపట్నం తూర్పు (వెలగపూడి రామకృష్ణబాబు); విశాఖపట్నం వెస్ట్ (గణబాబు); అరకు లోయ(ఎస్టీ) (సియ్యారి దొన్నుదొర); పాయకరావుపేట(ఎస్సీ) (వంగలపూడి అనిత); నర్సీపట్నం (అయ్యన్నపాత్రుడు); తుని (యనమల దివ్య);పెద్దాపురం (నిమ్మకాయల చినరాజప్ప); అనపర్తి (నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి); ముమ్మిడివరం (దాట్ల సుబ్బరాజు); పి.గన్నవరం(ఎస్సీ) (మహాసేన రాజేష్); కొత్తపేట (బండారు సత్యనారాయణరావు); మండపేట (వేగుళ్ల జోగేశ్వరావు); రాజమండ్రి సిటీ(ఆదిరెడ్డి వాసు); జగ్గంపేట (జ్యోతుల వెంకటప్పరావు(నెహ్రూ)); ఆచంట (పితాని సత్యనారాయణ); పాలకొల్లు (నిమ్మల రామానాయుడు); ఉండి (మంతెన రామరాజు); తణుకు (అరిమిల్లి రాధాకృష్ణ); ఏలూరు (బడేటి రాధాకృష్ణ); చింతలపూడి(ఎస్సీ) (సొంగా రోషన్); తిరువూరు(ఎస్సీ) (కొలికపూడి శ్రీనివాస్); నూజివీడు (కొలుసు పార్థసారథి); గన్నవరం (యార్లగడ్డ వెంకట్రావు); గుడివాడ (వెనిగండ్ల రాము); పెడన (కాగిత కృష్ణ ప్రసాద్); మచిలీపట్నం (కొల్లు రవీంద్ర); పామర్రు(ఎస్సీ) (వర్ల కుమార్ రాజా); విజయవాడ సెంట్రల్ (బొండ ఉమామహేశ్వరరావు); విజయవాడ ఈస్ట్ (గద్దె రామ్మోహన్‌రావు); నందిగామ(ఎస్సీ) (తంగిరాల సౌమ్య); జగ్గయ్యపేట (శ్రీరామ్ రాజగోపాల తాతయ్య); తాడికొండ(ఎస్సీ) (తెనాలి శ్రావణ్‌కుమార్); మంగళగిరి (నారా లోకేశ్) పొన్నూరు (ధూళిపాళ్ల నరేంద్ర); వేమూరు(ఎస్సీ) (నక్కా ఆనంద్‌బాబు); రేపల్లె (అనగాని సత్యప్రసాద్); బాపట్ల (వేగేశ్న నరేంద్ర వర్మ); ప్రత్తిపాడు(ఎస్సీ) (బూర్ల రామాంజనేయులు); చిలకలూరిపేట (ప్రత్తిపాటి పుల్లారావు); సత్తెనపల్లి (కన్నా లక్ష్మీనారాయణ); వినుకొండ (జీవీ ఆంజనేయులు) మాచర్ల (జూలకంటి బ్రహ్మానందరెడ్డి); ఎర్రగొండపాలెం(ఎస్సీ) (గూడూరి ఎరిక్షన్ బాబు); పరుచూరు (ఏలూరి సాంబశివరావు) అద్దంకి (గొట్టిపాటి రవికుమార్) సంతనూతలపాడు(ఎస్సీ) (బొమ్మాజి నిరంజన్ విజయ్‌కుమార్); ఒంగోలు (దామచర్ల జనార్ధన్‌రావు) కొండెపి(ఎస్సీ) (డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి) కనిగిరి (ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి); కావలి (కావ్య కృష్ణారెడ్డి) నెల్లూరు సిటీ (పొంగూరు నారాయణ); నెల్లూరు రూరల్ (కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి); గూడూరు(ఎస్సీ) (పాశం సునీల్‌కుమార్); సూళ్లూరుపేట (ఎస్సీ) (నెలవల విజయశ్రీ) ఉదయగిరి (కాకర్ల సురేష్) కడప (రెడ్డప్పగారి మాధవీరెడ్డి) రాయచోటి (మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి) పులివెందుల (మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి)) మైదుకూరు (పుట్టా సుధాకర్ యాదవ్); ఆళ్లగడ్డ (భూమా అఖిలప్రియా రెడ్డి) శ్రీశైలం (బుడ్డా రాజశేఖర్‌రెడ్డి); కర్నూలు (టీజీ భరత్); పాణ్యం (గౌరు చరితారెడ్డి); నంద్యాల (ఎన్ఎండీ ఫరూఖ్); బనగానపల్లి (బీసీ జనార్ధన్‌రెడ్డి) డోన్ (కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి); పత్తికొండ (కేఈ శ్యాంబాబు); కోడుమూరు(ఎస్సీ) (బొగ్గుల దస్తగిరి); రాయదుర్గం (కాలువ శ్రీనివాసులు); ఉరవకొండ (పయ్యావుల కేశవ్); తాడిపత్రి (జేసీ అస్మిత్‌రెడ్డి); శింగనమల(ఎస్సీ) (బండారు శ్రావణిశ్రీ); కల్యాణదుర్గం (అమిలినేని సురేంద్రబాబు) రాప్తాడు (పరిటాల సునీత) మడకశిర(ఎస్సీ) (ఎంఈ సునీల్‌కుమార్); హిందూపూర్ (నందమూరి బాలకృష్ణ); పెనుగొండ (సంజీవరెడ్డిగారి సవిత); తంబళ్లపల్లి (సైకం జయచంద్రారెడ్డి) పీలేరు (నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి) నగరి (గాలి భానుప్రకాశ్) గంగాధర నెల్లూరు(ఎస్సీ) (డాక్టర్ వీఎం థామస్); చిత్తూరు (గురజాల జగన్‌మోహన్); పలమనేరు (ఎన్ అమర్నాథ్‌రెడ్డి); కుప్పం (చంద్రబాబు నాయుడు)

ఐదుగురితో జనసేన జాబితా..

నెలిమర్ల (లోకం మాధవి); అనకాపల్లి (కొణతాల రామకృష్ణ); రాజానగరం (బత్తుల బలరామకృష్ణ); కాకినాడ రూరల్ (పంతం నానాజీ); తెనాలి (నాదెండ్ల మనోహర్)

'నీకింత.. నాకింత'లా కబ్జా

- హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్‌లో అక్రమం
- 5 ఎకరాల ఆక్రమణ.. విలువ రూ.50 కోట్లు పైనే
- చూసీచూడనట్లు వదిలేస్తున్న రెవెన్యూ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ శివారులో కోట్ల రూపాయిల విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోంది. రాత్రికి రాత్రే వాటిలో ప్రికాస్ట్ నిర్మాణాలు వెలుస్తున్నాయి.. ఫెన్సింగ్ ఏర్పాటవుతోంది. ఇదంతా తెలిసినా రెవెన్యూ యంత్రాంగం గప్‌చుప్‌గా ఉంటోంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్ గ్రామ సర్వే నంబర్ 64లో ప్రైవేటు పట్టా భూములతో పాటు 64/6, 64/7 నంబర్లలో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోని సుమారు రూ.50 కోట్ల విలువైన 5 ఎకరాను కొందరు నీకింత.. నాకింత అన్నట్లు కబ్జా చేస్తున్నారు. వాస్తవానికి 1982లో ఈ భూమిని ఓ రియల్టర్ లే అవుట్‌గా మార్చాడు. ప్రభుత్వ భూమి అని తెలియక 150 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. తర్వాత అప్రమత్తమైన ప్రభుత్వం భూమిని పీవోటీ చట్టం ద్వారా స్వాధీనం చేసుకుంది. అనంతరం సబ్ స్టేషన్‌కు 5 ఎకరాల వరకు కేటాయించింది. 2008లో ఇందిరమ్మ పథకం కింద 300 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇచ్చారు. వీరికి సర్టిఫికెట్లు పంపిణీ చేసినప్పటికీ పొజిషన్ ఇవ్వకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. 2018లో పెద్దఅంబర్‌పేట్ పురపాలక భవనం నిర్మాణానికి 3 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అయితే, కొందరు ప్లాట్ల కొనుగోలుదారులు కోర్టుకు వెళ్లి స్టే తేవడంతో భవనం వేరేచోట నిర్మించారు. కాగా, రియల్టర్ నుంచి ప్లాట్లు కొన్నవారు ప్రభుత్వ భూమి అని తెలిశాక వదిలేసుకున్నారు. ఇటీవలం సర్కారు మారడంతో కొందరి కన్ను పెద్దఅంబర్‌పేట్ భూమిపై పడింది. ఫెన్సింగ్ వేసి ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రహరీ ఏర్పాటు చేశారు. కొందరు 300 గజాలు కబ్జా చేస్తే మరికొందరు వెయ్యి గజాలను ఆక్రమించారు. పొరపాటున ఎవరైనా ప్లాట్లు ఉన్నవారు వస్తే బెదిరింపులకు దిగుతున్నారు. ప్రభుత్వ స్థలం కాబట్టి గ్రామస్థులు కబ్జా చేసినట్లు చెప్పి పంపిస్తున్నారు. ఇలా ఇప్పటికే 5 ఎకరాలకు పైగా చెరబట్టారు. పెద్దఅంబర్‌పేట్ సర్వే నంబర్ 64/6, 64/7లోని ప్రభుత్వ భూమి గురించి అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. చూసీచూడనట్లుగా వదిలేయడంతో అధికారులకు తెలిసే ఇదంతా సాగుతోందన్న అనుమానాలు వస్తున్నాయి.


పెద్ద అంబర్‌పేట్‌లో ప్రభుత్వ భూమిలో వెలిసిన కట్టడాలు

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- 288 మిలియన్ యూనిట్లకు పైగా వినియోగం
- వ్యవసాయంతోపాటు గృహావసరాలకూ పెరిగిన డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పరుగులు పెడుతోంది. వ్యవసాయంతో పాటు గృహ వినియోగం కూడా పెరుగుతుండటంతో డిమాండ్ 14 వేల మెగావాట్లకు తగ్గకుండా నమోదవుతోంది. ఈ నెల 2వ తేదీ నుంచి సగటు డిమాండ్ 14 వేల మెగావాట్లకు తగ్గకుండా రికార్డవుతోంది. ఈ నెల 23వ తేదీన ఏకంగా 15,031 మెగావాట్లుగా రికార్డు కాగా.. వినియోగం 288 మిలియన్ యూనిట్లుగా నమోదయింది. గతేడాది జనవరి, ఫిబ్రవరితో పోల్చుకుంటే ఈ ఏడాది వ్యవసాయ విద్యుత్ వినియోగం 16.36 శాతం పెరిగిందని అధికారులు గుర్తుచేశారు. 2023 జనవరి, ఫిబ్రవరి నెలల్లో సరాసరి విద్యుత్ వినియోగం రోజుకు 242.95 మిలియన్ యూనిట్లుగా ఉండగా... ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో రోజువారీగా వినియోగం 256.74 మిలియన్ యూనిట్లుగా రికార్డయింది. దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో 6.67 శాతం, ఫిబ్రవరి నెలలో 6.24 శాతం అత్యధిక వినియోగం రికార్డయింది. గ్రేటర్ హైదరాబాద్‌లో గతేడాదితో పోల్చుకుంటే జనవరిలో 9.47 శాతం, ఫిబ్రవరి నెలలో 12.27 శాతం అధికంగా నమోదయింది. డిమాండ్ పెరుగుతుండటంతో వినియోగానికి తగ్గట్లుగా అందించడానికి వీలుగా ఇప్పటికే స్వల్పకాలిక కరెంట్ కొనుగోళ్ల కోసం విద్యుత్ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. రాష్ట్రం ఏర్పాటు అనంతరం 2023 మార్చి 30వ తేదీన అత్యధిక డిమాండ్ 15,497 మెగావాట్లుగా రికార్డు అయింది. ఇక గరిష్ఠ వినియోగం కూడా 297.89 మిలియన్ యూనిట్లుగా ఉంది.

బ్యాంకు ఖాతాలు మార్చి.. రైతుబంధును దోచి!

- ఐదేళ్లుగా 64 మంది రైతులకు శఠగోపం
- రూ.36 లక్షల నిధులు ఇతరుల ఖాతాల్లోకి..
- బాధ్యులైన ఏఈఓపై సస్పెన్షన్ వేటు
- గద్వాల జిల్లాలోని బల్గెరలో ఘటన..

గట్టు, ఫిబ్రవరి 24: పొలం ఉన్న రైతుల ఖాతాలకు బదులు ఇతరుల ఖాతా నంబర్లు చేర్చి రైతుబంధు నిధులు స్వాహా చేసిన వైనం జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని బల్గెరలో ఆలస్యంగా వెలుగు చూసింది. 2019లో ఈ పథకాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఈ వ్యవహారం కొనసాగింది. ఏకంగా రూ.36 లక్షల నిధులు పక్కదారి పట్టాయి. ఇటీవల ఆ గ్రామానికి కొత్త వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రావడంతో వ్యవహారం బయటకు వచ్చింది. బల్గెర, ముస్లంపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమకు పొలం ఉన్నప్పటికీ రైతుబంధు రావడం లేదని కొత్త ఏఈఓ రఘువంశీని కలసి ఫిర్యాదు చేశారు. అనుమానం వచ్చిన ఆయన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన వ్యవసాయ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. బల్గెర , ముస్లంపల్లి గ్రామాలకు చెందిన అసలు రైతులు 64 మంది ఉండగా వారికి సంబంధించిన బ్యాంకు ఖాతాలకు బదులు బినామీ రైతుల ఖాతాల్లో సొమ్ము జమవుతున్నట్లు గుర్తించారు. ఇలా మొత్తం దాదాపు రూ.36 లక్షలు పక్కదారి పట్టినట్లు వివరాలు సేకరించారు. దీనికంతటికి బల్గెర ఏఈఓగా పని చేసిన దివ్యనే కారణమని.. ఆమెనే రైతుల ఖాతాలు మార్చి వ్యవహారాన్ని నడిపారని గుర్తించారు. ఈనేపథ్యంలోనే ఏఈఓ దివ్యను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. అయితే ఈ సస్పెన్షన్ జరిగి మూడ్రోజులు గడిచినా విషయాన్ని గోప్యంగా ఉంచడంతో వ్యవసాయ శాఖ అధికారులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు మండల వ్యవసాయ అధికారి హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు బాధ్యురాలైన ఏఈఓపై చర్యలు తీసుకున్నామని.. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని వెల్లడించారు.

ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నారు

- 2600మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు
- ఇందిరమ్మ రాజ్యంలో ఎన్‌కౌంటర్లు, కూల్చివేతలే: బాల్క సుమన్



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన అని చెప్పుకుంటూ ప్రశ్నించే గొంతుకలపై దాడులు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలన మొదలై మూడు నెలలు కాకముందే అనేక అకృత్యాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎన్‌కౌంటర్లు, కూల్చివేతలేనని విమర్శించారు. మేడారం జాతరలో సీఎం రేవంత్ ముందే భక్తులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారన్నారు. ఇప్పటివరకు 2600 మంది బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదయ్యాయని చెప్పారు. రాష్ట్రంలో ఇసుక, ల్యాండ్ మాఫియా చెలరేగిపోతోందని సుమన్ ఆరోపించారు. బీఆర్ఎస్ వాళ్లు పిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోవడంలేదని అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే విషయం పోలీసులు గుర్తుంచుకోవాలని బాల్క సుమన్ అన్నారు. రేవంత్ పాలన ప్రజా పాలన మాదిరిగా కాకుండా తెలంగాణ మీద ప్రతీకార పాలన మదిరిగా ఉందని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు.

యూపీలో ఘోర దుర్ఘటన

- ట్రాక్టర్ చెరువులో పడి 24 మంది మృతి

కాస్‌గంజ్, ఫిబ్రవరి 24: ఉత్తరప్రదేశ్‌లో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. యాత్రికులను తీసుకెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లడంతో కనీసం 24 మంది భక్తులు మరణించారు. వీరిలో ఎనిమిది మంది చిన్నారులు ఉన్నారని, మరో 20 మంది వరకు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గంగా నదిలో పవిత్ర స్నానమాచరించేందుకు భక్తులు వెళ్తున్న క్రమంలో పాటియాలి-దరియావ్‌గంజ్ రోడ్డు సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. "డ్రైవర్ ఇతర వాహనాలను ఓవర్ టెక్ చేసే క్రమంలో యాత్రికుల ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులో బోల్తాపడింది. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేస్తాం." అని అలీఘర్ ఐజీ శలభ్ మాథుర్ తెలిపారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలను ప్రకటించడంతో పాటు వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ప్రతిపక్ష నేతలు అఖిలేశ్ యాదవ్, మాయావతి విచారం వ్యక్తం చేశారు.

నత్తనడకన పంటరుణాల పంపిణీ

- యాసంగి లక్ష్యంలో ఇచ్చింది 49 శాతమే
- 11.35 లక్షల మందికే దక్కిన రుణం
- రెండు సీజన్లలో కలిపి సగం మందికి మొండిచేయి
- రెన్యువల్ చేస్తేనే అప్పులంటూ బ్యాంకర్ల మెలిక
- రుణమాఫీపై ఆశలు పెట్టుకున్న రైతులు
- ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకటిస్తే ఉపశమనం లభించే అవకాశం!



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పంట రుణాల పంపిణీ రాష్ట్రంలో నత్తనడకన సాగుతోంది. బ్యాంకర్లు ప్రకటించిన రుణప్రణాళికకు, పంపిణీకి ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఈ యాసంగి సీజన్‌లో కూడా ఇదే పరిస్థితి. రూ.29,374 కోట్ల రుణాన్ని బ్యాంకర్లు ప్రకటించినప్పటికీ... రైతులకు ఇచ్చింది రూ. 14,324 కోట్లు మాత్రమే. అంటే, లక్ష్యంతో పోల్చితే 49 శాతం రుణపంపిణీ మాత్రమే జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 11.35 లక్షల మంది రైతులకు ఈ యాసంగిలో బ్యాంకర్లు రుణాలిచ్చారు. గడిచిన వానాకాలంలో సుమారు 28 లక్షల మంది రైతులకు రుణాలివ్వగా.. ఈ రబీలో అందులో సగం మందికి కూడా రుణాలివ్వలేకపోయారు. రైతులు మాత్రం రుణాల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు (పట్టాదారులు) ఉన్నారు. రెండు పంట సీజన్లలో కలిపి వీరిలో సగం మందికి మాత్రమే పంట రుణాలు అందుతున్నాయి. 2022-23 వానాకాలం సీజన్‌లో 16.75 లక్షల మందికి, యాసంగిలో 17.25 లక్షల మందికి మొత్తంగా 34 లక్షల మందికే పంట రుణాలు అందాయి. ఈసారీ అటువంటి పరిస్థితే. అంటే, రాష్ట్రంలో రుణాలు పొందని రైతులు 35-36 లక్షల వరకు ఉంటున్నారు. కొత్త రుణాలివ్వటానికి బ్యాంకర్లు మొగ్గుచూపటం లేదు. పాత రుణాలను ఎలా రెన్యువల్ చేసుకోవాలి? ధాన్యం అమ్మిన డబ్బులు పడితే మినహాయించుకోవాలా? రైతుబంధు పడితే కట్ చేసుకోవాలా? అనే ఆలోచనతోనే బ్యాంకర్లు ఉంటున్నారు. రుణమాఫీ పథకంతో కూడా ముడిపెడుతున్నారు. రెన్యువల్ చేస్తేనే గానీ రుణాలు ఇచ్చేది లేదని బ్యాంకర్లు తెగేసి చెబుతున్నారు. దీంతో 'రుణమాఫీ' కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, పంట రుణాలు రెన్యువల్ చేస్తే... రుణమాఫీ పథకం వర్తించదనే ఆందోళన రైతుల్లో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. విధివిధానాలు ఇంకా ఖరారు చేయలేదు. నిధులను కూడా సమకూర్చలేదు. నిధుల సర్దుబాటు కష్టంగా మారిన పరిస్థితుల్లో.. ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్యాంకుల నుంచి రుణం తీసుకొని, రైతుల బకాయిలను క్లియర్ చేయాలనే ప్రయత్నంలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అదే విధంగా ఎప్పటివరకున్న బకాయిలను పరిగణనలోకి తీసుకుంటారనే అంశంపై 'కటాఫ్ తేదీ'ని కూడా ఖరారు చేయలేదు. రాష్ట్ర ప్రభుత్వం కటాఫ్ తేదీ ప్రకటించి, ఆ తేదీలోపు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని బ్యాంకర్లకు భరోసా ఇచ్చి, లోన్ రెన్యువల్ చేసుకునే అవకాశం కల్పిస్తే రైతులకు మేలు కలిగేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ధరణితోనూ సమస్యలు

ధరణి పోర్టల్‌తో కూడా రుణపంపిణీకి సమస్యలు ఎదురవుతున్నాయి. బ్యాంకర్లకు ధరణి పోర్టల్‌పై యాక్సెస్ ఇచ్చారు. ఫలానా రైతుకు ఎంత భూమి ఉంది? ఏ సర్వే నెంబరులో ఉంది? ఏ శివారులో ఉంది? తదితర వివరాలను బ్యాంకర్లు ధరణి పోర్టల్‌లో చూసి క్రాప్ లోన్ ఇస్తున్నారు. అయితే సర్వే నెంబర్లు తప్పుగా ఉండటం, డబుల్ ఎంట్రీలు చూపిస్తుండటం, మోఖాలో భూమి ఉన్న రైతుల వివరాలు కొన్ని ఆన్‌లైన్‌లో కనిపించకపోవటం, ఇతర సాంకేతిక సమస్యలు చాలా ఎదురవుతుండటంతో రైతులు పంట రుణాలు పొందలేకపోతున్నారు. పంట రుణాల విషయంలో క్షేత్రస్థాయిలో బ్యాంకు సిబ్బందికి, రైతులకు మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయి. అప్పుల కోసం రైతులు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలపై ఆధారపడక తప్పని పరిస్థితి తలెత్తుతోంది. ప్రభుత్వం బ్యాంకర్లకు మార్గనిర్దేశనం చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అధికార పార్టీ నేత కమీషన్ దాహం..

- తుంగభద్రలో ఆగిన ఇసుక తవ్వకం
- ఏపీ వైపు నదిలో డ్రెడ్జింగ్ పద్ధతిలో పడవలతో తవ్వకాలు
- ఫలితంగా పల్లం ఏర్పడి వేసవిలో అటువైపే ఎక్కువ నీళ్లు
- రాష్ట్రంలో తుమ్మిళ్ల పంపులకు నీళ్లు అందక ప్రమాదంలో ఆయకట్టు
- తెలంగాణ వైపు ఇసుక తోడితేనే నీళ్లు అందే పరిస్థితి
- ఓ నేత నిర్వాకంతో తవ్వకాలకు వెనుకాడుతున్న ఇసుక ఏజెన్సీలు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న తుంగభద్ర నదిలో తెలంగాణ వైపు ఇసుక తవ్వకాలు లేకపోవడం, ఏపీ వైపు డ్రెడ్జింగ్(నీటి అడుగు నుంచే నేరుగా ఇసుకను తోడటం) పద్ధతిలో ఇసుకను తోడేస్తుండటంతో తుమ్మిళ్ల ఆయకట్టు ప్రమాదంలో పడుతోంది. ఏపీ వైపు భారీగా ఇసుకను తోడేస్తుండటంతో అటువైపు పల్లం ఏర్పడి వేసవిలో నీళ్లు అక్కడే నిలిచిపోతున్నాయి. తెలంగాణలో తుమ్మిళ్ల పంపులకు నీరు అందడం లేదు. దీంతో, రాష్ట్రానికి మిగులు జలాల కేటాయింపులు ఉన్నప్పటికీ 55వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం తుంగభద్రలో ఇసుక తవ్వకాలు నిలిచిపోవడానికి స్థానికంగా అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేతే కారణమని ఆరోపణలున్నాయి. ఇసుక అమ్మగా వచ్చిన లాభాల్లో కమీషన్ కావాలని ఆ నేత పట్టుబడుతుండటంతో ఇసుక కాంట్రాక్టు దక్కించుకున్న సబ్ ఏజెన్సీలు తవ్వకాలను నిలిపివేశాయి. ఇసుక తవ్వకానికి అయ్యే ఖర్చును సగం భరించి లాభాల్లో సగం తీసుకోవాలని ఏజెన్సీల నిర్వాహకులు ప్రతిపాదించగా.. అంత పెట్టుబడి భరించలేని సదరు నేత మరో వ్యక్తితో 25% పెట్టుబడి పెట్టించేందుకు ఒప్పించినట్లు సమాచారం.

2018లో ఓ ఏజెన్సీకి కాంట్రాక్టు

తుంగభద్రలో 1.19 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకానికి 2018లో ఓ ఏజెన్సీ కాంట్రాక్టు దక్కించుకొంది. అప్పుడే 45,021 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఆ సంస్థ తోడేసింది. అయితే, ఆ తర్వాత ఎగువన భారీ వర్షాలు కురవడం, సుంకేశుల బ్యారేజీలో ఏడాది పొడవునా నీటినిల్వలు ఉండటంతో ఇసుక తవ్వకాలకు ఆటంకం కలిగింది. సుంకేశుల బ్యారేజీలో ఏడాది పొడవునా నీరు ఉన్నప్పటికీ ఏపీవైపు ఇసుక ఏజెన్సీలు డ్రెడ్జింగ్ పద్ధతిలో బోట్ల ద్వారా ఇసుక తవ్వకాలను నిరాటకంగా కొనసాగిస్తున్నాయి. దీనివల్ల నదిలో ఏపీ వైపు పల్లం ఏర్పడి ఇటువైపున ఆర్డీఎస్ ఆయకట్టుకు ప్రత్యామ్నాయంగా నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పంపులకు నీరందడం లేదు. రెండేళ్లుగా యాసంగి సీజన్‌లో ఆయకట్టు పడావు పడుతోంది. ఈ ఏడాది సుంకేశుల బ్యారేజీలో నీరు తక్కువగా ఉన్నప్పటికీ రాజకీయ నేత కమీషన్ దందా కారణంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు.

రూ.500కే వంటగ్యాస్ పథకం కోసం రూ.80 కోట్లు విడుదల!

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల్లు భాగంగా మహాలక్ష్మి పథకం కింద ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన రూ.500 కే వంట గ్యాస్ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం శనివారం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు రూ.80 కోట్లు విడుదల చేస్తూ ఆహారం, ప్రజా పంపిణీ శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రూ.500 కే గ్యాస్ పథకాన్ని ఈనెల 27 నుంచి అమలు చేసేందుకు రేవంత్ ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే నిధులు విడుదల చేసింది. కాగా సబ్సిడీ పథకం అమలు కోసం ఈ రూ.80 కోట్లు గ్యాస్ ఏజెన్సీ ఖాతాలో పడనున్నాయి.

బ్యాంకర్ల తీరుపై రైతుల నిరసన

పరిగి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నోటీసులు ఇవ్వకుండా రుణాల వసూళ్లకు ఎలా వస్తారని శనివారం ఎస్బీఐ మేనేజర్‌ను సయ్యద్‌పల్లి గ్రామస్థులు నిలదీశారు. వికారాబాద్ జిల్లా పరిగిలోని ఎస్బీఐ ఏడీబీ శాఖలో పరిగి మండలం సయ్యద్‌పల్లి గ్రామ రైతులు గేదెలు, బోర్ల కోసం వ్యవసాయాధారిత రుణాలు తీసుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆ రుణాలను వసూలు చేసేందుకు బ్యాంకు మేనేజర్ అనుప్రభ సిబ్బందితో కలిసి సయ్యద్‌పల్లికి వెళ్లారు. అక్కడ రైతులతో మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలు చెల్లించాలని.. లేదంటే పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలన్నారు. దీంతో రైతులు బ్యాంకు అధికారుల తీరును తప్పుబట్టారు. తమకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా గ్రామానికి వచ్చి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వమనడంపై మండిపడ్డారు. బ్యాంకు మేనేజర్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు.

2న అధికారికంగా శ్రీపాదరావు జయంతి

వచ్చే మార్చి 2న మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

సీనియర్ ఐపీఎస్‌లకు పదోన్నతులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం హోంగార్డ్స్ వెల్ఫేర్ విభాగం ఐజీగా ఉన్న స్టీఫెన్ రవీంద్ర(1999 బ్యాచ్ ఐపీఎస్)కు అదనపు డీజీపీగా పదోన్నతి లభించింది. ఆయన ఆ హోదాలో అదే విభాగంలో కొనసాగుతారు. 2006 బ్యాచ్‌కు చెందిన మరో ఆరుగురు డీఐజీలు కార్తికేయ, కె.రమేష్‌నాయుడు, ఏటీ రంగనాథ్, వి.సత్యనారాయణ, బి.సుమతి, ఎం.శ్రీనివాసులుకు ఇన్‌స్పెక్టర్ జనరల్(ఐజీ)గా పదోన్నతులు కల్పించారు. 2010 బ్యాచ్‌కు అధికారులు న్యాలకొండ ప్రకాష్‌రెడ్డి, డి.జోయెల్ డేవిస్‌కు డీఐజీలుగా పదోన్నతులు కల్పించారు.

మళ్లీ మోదీనే ప్రధాని: వెంకటరమణారెడ్డి

» లిక్కర్ దందాలో కేసీఆర్ ఫ్యామిలీ జైలుకే: రఘునందన్

గోదావరిఖని/మంథని/సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 24: దేశం కోసం పనిచేసే నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిని చేద్దామని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని గెలిపించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కోరారు. విజయ సంకల్ప యాత్ర శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం, మంథని నియోజకవర్గాల్లో కొనసాగింది. గోదావరిఖని, మంథనిల్లో జరిగిన ర్యాలీల్లో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రసంగించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి కేసీఆర్ లక్షన్నర కోట్లు మింగితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా మాటలకే పరిమితమైంది తప్ప ప్రజలకు చేసిందేమి లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుందని ఆ పార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు మండిపడ్డారు. లిక్కర్ దందాలో కేసీఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందన్నారు.

రంగారెడ్డి జిల్లాలోనూ బీఆర్ఎస్‌కు షాక్!

» రేవంత్‌ను కలిసిన జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి
» ప్రియాంక సమక్షంలో 27న కాంగ్రెస్‌లో చేరిక

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)


రేవంత్‌ను కలిసిన అనితారెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ బీఆర్ఎస్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆపరేషన్ ఆకర్ష్‌ను ముమ్మరం చేసిన అధికార కాంగ్రెస్ పార్టీ.. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జిల్లాలపై దృష్టి పెట్టింది. రెండు వారాల కిందట మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి భార్య వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి హస్తం గూటికి చేరగా... తాజాగా రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి కూడా కాంగ్రెస్‌కు జై కొట్టారు. అనితారెడ్డితోపాటు ఆమె మామ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తదితరులు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం కలిశారు. కొద్ది రోజుల కిందటే తీగల కృష్ణారెడ్డి సీఎంను కలిసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించినా.. అనితారెడ్డి చేరికపై స్పష్టత రాలేదు. తాజాగా ఆమె సీఎంను కలవడంతో కాంగ్రెస్‌లో ఆమె చేరిక ఖరారైంది. సీఎంను కలిసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 27న ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనా కాంగ్రెస్ ఫోకస్ చేస్తున్నట్లు తెలిసింది. తనకు సన్నిహితులైన కొందరు ఎమ్మెల్యేలతో పట్నం మహేందర్‌రెడ్డి మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. కాగా, ఇటీవల సీఎం రేవంత్‌ను కలిసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే.. ఆ తర్వాత నుంచీ బీఆర్ఎస్‌లో కీలకంగా వ్యవహరించడం లేదని చెబుతున్నారు. త్వరలోనే కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం సాగుతోంది. కాగా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్.. సీఎం రేవంత్‌ను కలిశారు. ఆయన వెంట జీహెచ్ఎంసీ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉన్నారు.

ధరణి దరఖాస్తులకు మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవడంతో భూముల సమస్యలు, భూ రికార్డుల వివాదాలు ఎక్కువయ్యాయని పేర్కొంది. చివరకు పేర్లలో అక్షర దోషాలను సరిదిద్దుకునేందుకు జిల్లా కలెక్టర్ దాకా వెళ్లాల్సి వస్తుందని వివరించింది. ధరణి డేటాలో ఉన్న తప్పులను సవరించుకునేందుకు 35 మాడ్యూల్స్ ఉన్నప్పటికీ, ఏ మాడ్యూల్‌లో దేనికి దరఖాస్తు చేసుకోవాలనే అవగాహన లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపింది. లక్షలాది దరఖాస్తులు ఇప్పటికే తిరస్కరణకు గురయ్యాయని, ఒక్కో తప్పును సవరించుకోవాలంటే రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉండటం రైతులకు భారంగా మారిందని పేర్కొంది. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయలోపంతో నిషేధిత జాబితాలో ఉన్న భూముల క్రయ విక్రయాలు జరుగుతూనే ఉన్నాయని వివరించింది. ధరణి డేటా ఆధారంగానే రైతు బంధు నగదు జమ చేస్తుండడంతో ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనం దుర్వినియోగమైందని తెలిపింది. ఇప్పుడున్న ధరణి లోపాలను సవరించాలంటే చట్ట సవరణ చేయటం లేదా కొత్త ఆర్వోఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి నివేదించారు.

మరింత లోతుగా అధ్యయనం చేయండి

ధరణి కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా భూ రికార్డుల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అవసరమైతే చట్ట సవరణ చేయాలా? కొత్త చట్టం తీసుకురావాలా? అనే అంశాలను పరిశీలిద్దామని చెప్పారు. ధరణిలో లోపాలు, సమస్యలపై మరింత లోతుగా అధ్యయనం చేయాలని కమిటీకి సూచించారు. దరఖాస్తులు అప్రూవ్ చేసినా, లేదా రిజెక్ట్ చేసిన దానికి సంబంధించిన రిపోర్టు ఉండాలని పేర్కొన్నారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ చేపట్టాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీసీఎల్ఏ ఆధ్వర్యంలో బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీలకు ఎందుకు అప్పగించారని అధికారులను ప్రశ్నించారు.


ధరణిపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి, సీఎస్

లక్షలాది మంది రైతుల భూముల రికార్డులన్నీ విదేశీ కంపెనీ చేతుల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అత్యంత గోప్యంగా ఉండాల్సిన భూముల డేటా, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలను ఏజెన్సీ దగ్గర ఉంచడాన్ని సీఎం తప్పుబట్టారు. భూ రికార్డుల డేటాకు భద్రత ఉందా? సురక్షితంగా ఉన్నట్లా.. లేనట్లా? అని అనుమానం వ్యక్తం చేశారు. 2018లో టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా ఐఎల్ఎఫ్ఎస్ అనే కంపెనీకి అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్ డెవలప్‌మెంట్‌ను అప్పగించిందని అధికారులు బదులిచ్చారు. ఆ తర్వాత దివాలా తీసిన సదరు కంపెనీ.. చేతులు మారి టెర్రాసిస్ అని పేరు మార్చుకోవడం, డైరెక్టర్లు మారిపోవడం వంటి అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిడ్ దక్కించుకున్న కంపెనీయే మారిపోతే అప్పటి ప్రభుత్వం ఎలా అంగీకరించిందని సీఎం ఆరా తీశారు. 2018లో రూ.116 కోట్లకు ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను రూ.1200కోట్లకు అమ్ముకోవడం విస్మయం కలిగిస్తోందని పేర్కొన్నారు. భూ రికార్డులన్నీ వాళ్ల దగ్గరే ఉన్నందున.. విలువైన భూముల పేర్లు మార్చలేదని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కొన్ని సందర్భాల్లో అర్ధరాత్రి కూడా భూముల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చాయని, ధరణి నిర్వహణపై నియంత్రణ, ఆజమాయిషీ లేదా? అని నిలదీసిన సీఎం.. మొత్తం వ్యవహారంపై విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

రేపటి నుంచి బయో ఏషియా సదస్సు

హెచ్ఐసీసీలో 21వ బయోఏషియా సదస్సును సోమవారం ఉదయం 10 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న సదస్సు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అమెరికాకు చెందిన శాస్త్రవేత్త, నోబెల్ అవార్డు గ్రహీత గ్రేగ్ సెమెన్జా సదస్సుకు హాజరుకానున్నారు. అంతర్జాతీయ ఫార్మా కంపెనీ ఎలిలిల్లి సీఈవో డేవిడ్ రిక్స్, బ్రిస్టల్ మేయర్స్ స్కిబ్ సీఈవో డాక్టర్ క్రిస్టోఫర్ బోర్నర్‌తోపాటు హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలకు చెందిన జాతీయ, అంతర్జాతీయ కంపెనీల సీఈవోలు సదస్సులో పాల్గొంటున్నారు. 'డేటా అండ్ ఏఐ-రీడిఫైనింగ్ పాసిబిలిటీస్'ను ఈ ఏడాది థీమ్‌గా నిర్ణయించారు.

బీఆర్ఎస్ కారు షెడ్డుకుపోయింది..

» అది అట్నుంచి అటే పాత ఇనుప సామాను దుకాణానికి
» ఆరు గ్యారెంటీలతోపాటు చెప్పని హామీలూ అమలు చేస్తాం
» సీఎం రేవంత్ ఆధ్వర్యంలో కలిసికట్టుగా పని చేస్తున్నాం
» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, ఫిబ్రవరి 24: బీఆర్ఎస్ కారు షెడ్డుకుపోయిందని, అది అట్నుంచి అటే పాత ఇనుప సామాను (స్క్రాప్) దుకాణానికి పోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవా చేశారు. షెడ్డు నుంచి కారు బయటకురాదన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని నక్కగూడెంలో రూ.37కోట్లతో పునరుద్ధరించిన ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్..బీఆర్ఎస్‌గా మారిందని, అదిప్పుడు వీఆర్ఎస్‌లోకి పోతుందన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని, లక్షల కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుందని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలతోపాటు చెప్పని హామీలు కూడా అమలు చేస్తామని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక టీమ్‌లా కలిసికట్టుగా పనిచేస్తున్నామన్నారు. ఎస్ఎల్‌బీసీ ద్వారా నల్లగొండ జిల్లాలో 5 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ.2వేల కోట్లతో పనులు చేస్తున్నామని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రేవూరు-దొండపాడు-రామాపురం ఎక్స్ రోడ్డు వరకు రూ.20 కోట్లు, హుజూర్‌నగర్-యాతవాకిళ్ల వరకు రూ.20 కోట్ల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందన్నారు. హుజూర్‌నగర్-కోదాడ నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి 60 వేల మెజార్టీ ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

గీతారెడ్డి మంత్రివర్గంలో లేకపోవడం పెద్ద లోటు

» కాంగ్రెస్‌ను ఆమె ఎంతో బలోపేతం చేశారు
» ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంతో పోరాడారు
» ఈశ్వరీబాయి గొప్ప యోధురాలు: రేవంత్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జె.గీతారెడ్డి తన మంత్రివర్గంలో లేకపోవడం పెద్ద లోటు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. గీతారెడ్డి తనకు పెద్దక్క అని, పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతల నిర్వహణలో తోబుట్టువులా అండగా నిలిచారని తెలిపారు. ప్రధానంగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆమె క్రియాశీల పాత్ర పోషించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా గీతారెడ్డి చేపట్టిన ఆందోళనలు, కార్యక్రమాలు పార్టీని మరింత బలోపేతం చేశాయని కొనియాడారు. గీతారెడ్డి పార్టీ ఇన్‌చార్జిగా నిర్వహించిన నల్లగొండ జిల్లాలో అత్యధిక సీట్లు కాంగ్రెస్‌కు దక్కడమే ఇందుకు నిదర్శనమన్నారు. తాను సోనియాగాంధీని కలిసిన ప్రతిసారీ గీతారెడ్డి ఎలా ఉన్నారంటూ అడుగుతారని తెలిపారు. సామాజిక ఉద్యమకారిణి, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీబాయి 33వ వర్ధంతి సభను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై.. ఈశ్వరీబాయికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల కిందట ప్రజా జీవితాన్ని ప్రారంభించి, ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో తనదైన ముద్రను చాటిన గొప్ప యోధురాలు ఈశ్వరీబాయి అని కొనియాడారు. తొలిదశ తెలంగాణ పోరాటంలో ఆమె పాత్రను ప్రస్తావిస్తూ శ్లాఘించారు. ఈశ్వరీబాయి కుమార్తె గీతారెడ్డి రాజకీయ, సామాజిక, వైద్య రంగాల్లో రాణించారని, ఇందుకు అడుగడుగునా ప్రోత్సహిస్తూ, వెన్నుదన్నుగా నిలిచిన ఆమె భర్త డాక్టర్ రామచంద్రారెడ్డి స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, గీతారెడ్డి దంపతులతోపాటు పలువురు దళిత, బహుజన ఉద్యమ నాయకులు పాల్గొన్నారు. మళ్లీ రాని మంత్రులు..కాంగ్రెస్ పార్టీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, వేణుగోపాల్ తదితరులు హైదరాబాద్‌కు వస్తుండటంతో వారికి స్వాగతం పలికేందుకు తాను విమానాశ్రయానికి వెళ్లాల్సి ఉందని, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు దగ్గరుండి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తారని ప్రకటించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెళ్లిపోయారు. అయితే ఆయన వెంటే వెళ్లిన మంత్రులు తిరిగి రాలేదు. దాంతో జహీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలు కొందరు అసంతృప్తికి లోనయ్యారు. ఆనాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈశ్వరీబాయి సాగించిన ప్రత్యేక తెలంగాణ, సామాజిక పోరాటాల జీవితం ఇతివృత్తంగా రూపొందించిన లఘు చిత్రాన్ని సభలో ప్రదర్శించారు.

317, 46 జీవోలపై మంత్రివర్గ ఉప సంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్కారు దృష్టిసారించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన 317, 46 జీవోలపై అధ్యయనానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ చైర్మన్‌గా ఏర్పాటైన ఉప సంఘంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమించింది. ఈ జీవోల పర్యవసానాలను పరిశీలించి ప్రభుత్వానికి ఉపసంఘం నివేదిక సమర్పించనుంది. ఈమేరకు జీవో 292ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీల సమస్య కొంతలో కొంతైనా పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి. 2021 డిసెంబరు 6న 317 జీవో, 2022 ఏప్రిల్ 4న 46జీవోను జారీ చేశారు. వీటిపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలంటూ మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్యాబినెట్ సబ్ కమిటీ కన్వీనర్‌గా సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) కార్యదర్శి వ్యవహరించనున్నారు. కమిటీ నిర్వహించే సమావేశాలకు సంబంధిత శాఖల కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

వివాదం రేపిన 317 జీవో..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణతో రాష్ట్రంలో కొత్త జోన్లు, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కొత్త జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్ల ఆధారంగా ఉద్యోగులు, ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టేందుకు 317 జీవోను జారీ చేశారు. అయితే ఇది తీవ్ర వివాదాస్పదమైంది. కొత్త జిల్లాలకు సిబ్బందిని సర్దుబాటు చేసే క్రమంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలు చేపట్టింది. సీనియారిటీ ప్రాతిపదికన ఉద్యోగులను వివిధ జిల్లాలకు కేటాయించారు. దాదాపు 30వేల మందిని బదిలీ చేశారు. ఈ సర్దుబాటు సక్రమంగా జరగలేదని, జూనియర్లను దూర ప్రాంతాలకు బదిలీ చేశారంటూ అప్పట్లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. స్థానికత ఆధారంగా సొంత జిల్లాలను కేటాయించాలని డిమాండ్ చేశాయి. ఈ బదిలీల సందర్భంగా కనీసం స్పౌజ్ కేసులను కూడా పట్టించుకోలేదని, బదిలీ అయినవారిలో సగం మందికి అన్యాయం జరిగిందంటూ సంఘాలు ఆరోపించాయి. దీంతో ప్రభుత్వం దిగొచ్చి భార్యాభర్తల కేసులను పరిష్కరించింది. అయితే 13జిల్లాల స్పౌజ్ కేసులను పరిష్కరించలేదు. ఇప్పటికీ భార్య ఒక చోట, భర్త మరో చోట పని చేయాల్సి వస్తోందని సంఘాలు అంటున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో ఉన్న సర్వీసును కూడా పరిగణనలోకి తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఇది తమ పదోన్నతులపై తీవ్ర ప్రభావం చూపిందని ఉద్యోగులు అంటున్నారు. అయినా గత ప్రభుత్వం 317జీవో సమస్యను పరిష్కరించలేకపోయింది. ఇప్పటికీ ఈ సమస్య రగులుతూనే ఉంది. ఈ నేపథ్యంలో దీనిపై పూర్తి అధ్యయనం చేసి సిఫారసులు చేసేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఆదేశించింది.

ఉప సంఘం ఏర్పాటును స్వాగతిస్తున్నాం

ఉద్యోగులు, ఉపాధ్యాయులను తీవ్ర ఇబ్బందుల పాలుచేసిన 317 జీవోపై అధ్యయనం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి తెలిపారు. స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు, వేర్వేరు జిల్లాలకు వెళ్లిన భార్యాభర్తలకు న్యాయం చేయాలని గత రెండేళ్లుగా తమ సంఘం పోరాడుతోందని తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం సత్వరమే సానుకూల పరిష్కారాలు చూపాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడం పట్ల కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హర్షం వ్యక్తం చేశారు.

వైటీపీఎస్ వేగంగా పూర్తి కావాలి

ఇందుకోసం ప్రత్యేక పాలసీ తీసుకొస్తున్నాం.. జాప్యంతో రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం

» పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం: భట్టి
» యాదాద్రి ప్లాంట్ పరిశీలన

నల్లగొండ, హుజూర్‌నగర్/ మేళ్లచెర్వు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)ను ఆటంకాల్లేకుండా పూర్తి చేసేందుకు వీలుగా ప్రత్యేక పాలసీ రూపొందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ప్రాజెక్టు వ్యయం పెరగకుండా పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం, ప్రభుత్వాన్ని బదనాం చేసే కార్యకలాపాలు చేపడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మితమవుతున్న వైటీపీఎస్‌ను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం భట్టి శనివారం పరిశీలించారు. హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి నేరుగా పవర్ ప్లాంట్ వద్దకు చేరుకున్న మంత్రులు... ప్లాంట్‌నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమీక్షలో తొలుత జెన్‌కో అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పవర్‌ప్లాంట్ పనులను వివరించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. అధికారులు గత ప్రభుత్వంలో మాదిరిగా ఉన్న అలవాట్లను మార్చుకోవాలన్నారు. పవర్ ప్లాంట్ పనులను జాప్యం చేయడంతో రాష్ట్ర ఖజానాపై మోయలేని భారం పడిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గ్రీన్ పవర్, రెన్యువబుల్ ఎనర్జీ వైపు దృష్టి పెడుతుంటే.. తెలంగాణలో మాత్రం గత పాలకులు థర్మల్ పవర్ కోసం ఎందుకు ప్రయత్నించారో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి పెండింగ్ ప్రాజెక్టులన్నింటిపైనా దృష్టి పెట్టామని తెలిపారు. అందులో భాగంగానే వైటీపీఎస్ పనుల ను అన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకునేందుకు బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయాలని, అంతర్గత సమన్వయం కోసం పూర్తిస్థాయిలో పనిచేసేలా ఒక అధికారిని నియమించుకోవాలని సూచించారు. అనంతరం, సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం నక్కగూడెంలో రూ.37కోట్లతో చేపట్టిన నక్కగూడెం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఆరు గ్యారంటీల్లోని పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ఈ నెల 27న చేవెళ్లలో ప్రియాంక గాంధీ ప్రారంభిస్తారని ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రకటించారు. అనంతరం నక్కగూడెంనుంచి దొంపాడుకు బయలుదేరిన మంత్రులు మార్గమధ్యలో కిష్టాపురంలో పొలంలోకి వెళ్లి మిర్చి రైతులు, రైతు కూలీలతో మాట్లాడారు. సాగు నీరు అందడం లేదని రైతులు చెప్పుకోగా.. జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తున్నామని, త్వరలోనే సాగు నీరు అందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. కేసీఆర్-జగన్ దోస్తీ వల్లే కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని, శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లు ఎడారిగా మారాయని ఆరోపించారు. కాంగ్రెస్ సంక్షేమ పథకాలను డిప్యూటీ సీఎం భట్టి రైతులకు వివరించారు. పీఆర్ సిమెంట్ పరిశ్రమ నుంచి కిష్టాపురం అడ్డరోడ్డు వరకు రహదారి నిర్మించాలని రైతులు కోరగా.. మంత్రి వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారు. వారంలోగా టెండర్లు పిలుస్తామని హామీ ఇచ్చారు.


నల్లగొండ జిల్లా వీర్లపాలెంలో నిర్మితమవుతున్న వైటీపీఎస్‌పై సమీక్షలో భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి

ఆర్ఆర్ఆర్ చకచకా!

(మొదటిపేజీ తరువాయి)

అంశాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో అభివృద్ధికి సంబంధించి ఇప్పటికే హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఆర్ఆర్ఆర్ పూర్తయితే ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడంతోపాటు ఒక పెద్ద ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్న అభిప్రాయంతో సర్కారు ఉంది. అందుకే వేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా ముందుండాలని భావిస్తోంది. గత ప్రభుత్వం ఆర్ఆర్ఆర్ నిర్మాణం విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా ఉన్నట్లుగా కాకుండా.. తమ బాధ్యతను పూర్తిగా నిర్వర్తించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా భూసేకరణకు చెల్లించే పరిహారంలో తమ వాటాను వెంటనే చెల్లించే ప్రయత్నంలో ఉంది.

నాబార్డు నుంచి రూ.6,200 కోట్ల రుణం..

రీజినల్ రింగ్ రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మించనున్నారు. ఉత్తర భాగం సంగారెడ్డిలో మొదలై నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, ప్రజ్ఞాపూర్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు 158.64 కిలోమీటర్ల మేర నిర్మాణం కానుంది. ఇందుకోసం దాదాపు రూ.1,940 హెక్టార్ల మేర భూమి అవసరం కానుండగా.. ఇప్పటికే కొంతమేర భూసేకరణ పూర్తయింది. ఉత్తర భాగం రోడ్డు నిర్మాణానికి మొత్తం రూ.14 వేల కోట్లకు పైగా నిధులు అవసరం కానుండగా.. ఇందులో దాదాపు రూ.5,200 కోట్లు భూ పరిహారానికి చెల్లించాల్సి ఉంది. ఇక చౌటుప్పల్‌లో మొదలయ్యే దక్షిణ భాగం రహదారి ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమనగల్, చేవెళ్ల, శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డికి అనుసంధానం కానుంది. ఇది మొత్తం 189.2 కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. దీని నిర్మాణానికి దాదాపు 2వేల హెక్టార్ల భూమి అవసరం కానుంది. మొత్తం రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.16 వేల కోట్లకుపైగా అవసరం కానుండగా.. ఇందులో దాదాపు రూ.7వేల కోట్లు భూ పరిహారం కింద చెల్లించాల్సి ఉంది. కాగా, ఆర్ఆర్ఆర్ నిర్మాణం మొత్తానికి ఎన్‌హెచ్ఏఐ సేకరించిన భూమికి చెల్లించే భూ పరిహారంలో సగం వాటాను రాష్ట్రం చెల్లించాల్సి ఉంది. రీజినల్ రింగ్ రోడ్డును మంజూరు చేస్తే భూ పరిహారం చెల్లింపుల్లో 50 శాతాన్ని రాష్ట్ర వాటాగా చెల్లిస్తామని 2018 ఆగస్టు 29న కేంద్రమంత్రికి అప్పటి సీఎం కేసీఆర్ రాసిన లేఖలో పేర్కొన్నారు. దాంతో ఉత్తరభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.2,600కోట్లు, దక్షిణభాగం భూ సేకరణలో సగం వాటా కింద రూ.3,600కోట్లను రాష్ట్రం చెల్లించాలి. రెండు భాగాలకు కలిపి దాదాపు రూ.6,200కోట్లను రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారుల సంస్థకు ఇవ్వాల్సి ఉంది. అయితే ఈ మొత్తాన్ని నాబార్డు నుంచి ఒకేసారి రుణంగా తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆర్ఆర్ఆర్‌కు అవసరమైన భూమిని ఈ ఏడాది చివరిలోగా జాతీయ రహదారుల సంస్థకు అప్పగించేలా చర్యలు తీసుకుంటే.. దాదాపు మూడేళ్లలోనే నిర్మాణం పూర్తయి రోడ్డు అందుబాటులోకి వచ్చేందుకు అవకాశం ఉంది.

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా చిన్నారెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

హామీ వచ్చింది. కానీ, ఇటీవల జరిగిన శాసన మండలి, రాజ్యసభ సభ్యుల ఎంపికలో ఆయనకు చోటు దక్కలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల తర్వాతే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల స్థానం నుంచి చిన్నారెడ్డిని ఎమ్మెల్సీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఇటీవల ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి అధిష్ఠానంతో చర్చలు జరిపారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి సహా పలు నామినేటెడ్ పదవుల భర్తీకి అధిష్ఠానం ఆయనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో చిన్నారెడ్డిని క్యాబినెట్ ర్యాంకు హోదా ఉన్న పదవిలో సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు. కాగా, రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారి ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్‌గా వనపర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నియమితులై 2018 వరకు పనిచేశారు. కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన వినోద్ కుమార్ 2019 నుంచి 2023 వరకు ఆ పదవిలో ఉన్నారు. తాజాగా మరోసారి వనపర్తికి చెందిన నేతకు ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ పదవి దక్కింది.

యూసీసీపై అసోం ముందడుగు

» ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం రద్దు

గువాహటి, ఫిబ్రవరి 24: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అమలు దిశగా అసోం ప్రభుత్వం ముందడుగు వేసింది. దీనిలో భాగంగా ముస్లిం వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనను 23న నిర్వహించిన కేబినెట్ భేటీలో ఆమోదించినట్లు ఆ రాష్ట్ర మంత్రి జయంత్ బారువా వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. యూసీసీ అమలుకు అడుగులు వేయబోతున్నామని సీఎం హిమంత బిశ్వశర్మ ఇటీవల చెప్పారని, ఆ దిశగా కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు బారువా చెప్పారు. అసోం ముస్లిం వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం-1935ను రద్దు చేయనున్నామని తెలిపారు. ఇకపైన ముస్లింల వివాహాలు, విడాకులు ఈ చట్టం కింద నమోదు కాబోవని స్పష్టం చేశారు. వీటిని స్పెషల్ మ్యారేజీ యాక్ట్ కిందకు తేవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో బాల్య వివాహాలను నిరోధించడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని సీఎం హిమంత అన్నారు. అసోం ప్రభుత్వ నిర్ణయంపై సమాజ్‌వాది పార్టీ ఎంపీ ఎస్.టి. హసన్ స్పందించారు. దీన్ని అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలైనా రూపొందించుకోవచ్చని, అయితే ప్రతి మతానికి సొంత ఆచారాలు ఉంటాయని, వేలాది సంవత్సరాలుగా పాటిస్తున్న ఆచారాలను ముస్లింలు ఇకపైనా కొనసాగిస్తారని తెలిపారు.

టీఎంసీకి ఓటేయలేదని చిత్రహింసలు!

» సందేశ్‌ఖాలీలో షాజహాన్, అనుచరుల అకృత్యాలు

» ఎస్టీ కమిషన్ బృందం పర్యటనలో వెలుగులోకి

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఫిబ్రవరి 24: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతల అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తమ పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారని అక్కడ నివసించే పేద గిరిజనులను టీఎంసీ స్థానిక నేత షేక్ షాజహాన్, అతడి అనుచరులు చిత్రహింసలకు గురిచేసినట్లు జాతీయ ఎస్టీ కమిషన్(ఎన్‌సీఎస్టీ) గుర్తించింది. అలాగే ఉపాధి హామీ వేతనాలు సైతం వారినుంచి బలవంతంగా లాక్కున్నట్లు నిర్ధారించింది. షాజహాన్, అతడి అనుచరుల లైంగిక వేధింపులు, భూ కబ్జాలకు సంబంధించి 50కి పైగా ఫిర్యాదులు తమకు అందాయని కమిషన్ వైస్ చైర్మన్ అనంత నాయక్ వెల్లడించారు. గ్రామానికి పది కిలోమీటర్ల పరిధిలో వెయ్యి మందికి పైగా గిరిజనులు, గిరిజనేతరుల భూములను షాజహాన్ కబ్జా చేసినట్లు ఆరోపణలు వచ్చాయని చెప్పారు. తమకు ఎదురుతిరిగిన వారి పొలాల్లోకి సముద్రపు నీటిని వదిలిపెట్టి ఉప్పు కయ్యలుగా మార్చేవారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి దారుణాలను చూడలేదని నాయక్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్రానికి నివేదిక ఇస్తామని తెలిపారు. కాగా, సందేశ్‌ఖాలీలో అరాచకాలపై ఈ నెల 18న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకూ 1,250కి పైగా ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

రాజస్థాన్‌లో ముగ్గురు మహిళా టీచర్ల సస్పెన్షన్

» సరస్వతీ దేవి ఫొటో పెట్టనందుకు ఒకరిపై, లవ్ జిహాద్‌కు సహకరిస్తున్నారని మరో ఇద్దరిపై చర్యలు

జైపూర్, ఫిబ్రవరి 24: రాజస్థాన్‌లో ముగ్గురు మహిళా టీచర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సరస్వతీ దేవిని అవమానపరిచి మతపరమైన మనోభావాలను దెబ్బతీశారన్న కారణంతో ఒకరిపై, లవ్‌జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలతో మరో ఇద్దరిపై ఈ చర్యలు తీసుకొంది. మరో మహిళా టీచరుపై చర్యలు తీసుకునే ఆలోచనలో ఉంది. మతపర విద్వేషాలను రెచ్చగొట్టారంటూ బరన్ జిల్లా లక్దాయ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రబోదక్ (లెవల్-1)గా పనిచేస్తున్న హేమలత బైర్వాను అధికారులు సస్పెండ్ చేశారు. రిపబ్లిక్ డే రోజున పాఠశాలలో జెండా ఎగరవేసిన సందర్భంగా గాంధీ, అంబేద్కర్ ఫొటోలు పెట్టారు. సరస్వతీ దేవి ఫొటో కూడా పెట్టాలని గ్రామస్థులు కోరగా హేమలత అంగీకరించలేదు. చదువులకు సరస్వతీ దేవి ఏమి చేశారని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాలతో ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. లవ్ జిహాద్, ఇస్లామిక్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణపై కోటా జిల్లా ఖజూరీ ఓడ్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందిన ఇద్దరు మహిళా టీచర్లను మీర్జా ముజాహిద్, ఫిరోజ్ ఖాన్‌ను సస్పెండ్ చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సర్వ హిందూ సమాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నారు. మరో టీచరు షబానాపై చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు చెప్పారు.

బస్సుల్లోనూ సీటు బెల్టు ఉండాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదాల్లో మరణాలను నివారించేందుకు బస్సుల్లో కూడా సీటు బెల్టులను తప్పనిసరి చేయాలని అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతుండడం, పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతున్న నేపథ్యంలో.. ప్యాసింజర్ బస్సులు, స్కూల్ బస్సులు సహా భారీ వాహనాలన్నింట్లోనూ సీటు బెల్టులు ఏర్పాటు చేసే నిబంధన తీసుకురావాలని ఐఆర్ఎఫ్ అధ్యక్షుడు కేకే కపిల.. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖకు సూచించారు. అమెరికా, చైనాలో ఇప్పటికే బస్సుల్లో సీటు బెల్టులను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2021 గణాంకాల ప్రకారం.. అమెరికాలో ఆ ఏడాది బస్సు ప్రమాదాల్లో కేవలం 14 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.

జాహ్నవి కేసు విచారణపై భారత్ అసంతృప్తి

సియాటెల్, ఫిబ్రవరి 24: అమెరికాలోని సియాటెల్ నగరంలో పోలీస్ వాహనం ఢీకొని మృతి చెందిన జాహ్నవి కందుల కేసు వ్యవహారంపై భారతీయ కాన్సులేట్ స్పందించింది. అమెరికన్ అధికారుల వద్ద కేసు దర్యాప్తు తీరు తెన్నులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కింగ్స్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన చేస్తూ.. 'పూర్తి స్థాయి ఆధారాలు లేకపోవడంతో కందుల మరణానికి కారణమైన పోలీస్ అధికారి కెవిన్ దేవ్‌పై క్రిమినల్ నేరారోపణ చేయలేము' అని పేర్కొనడంపై కాన్సులేట్ స్పందిస్తూ... 'విచారణను తరువాతి స్థాయికి తీసుకువెళ్లే విషయమై సియాటెల్ పోలీసులతో మాట్లాడుతున్నాం. జాహ్నవికి, ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకూ మా పూర్తి సహకారాన్ని అందిస్తాం' అని పేర్కొంది.

యుద్ధానికి రెండేళ్లు.. రష్యాపై ఆంక్షల కొరడా

మాస్కో, ఫిబ్రవరి 24: రష్యాపై అగ్ర రాజ్యం అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షల కొరడా ఝళిపించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగి రెండేళ్లు పూర్తయిన నేపథ్యం, ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ అనుమానాస్పద మృతి నేపథ్యంలో రష్యాకు చెందిన 500 మంది పైగా వ్యక్తులు, సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఆర్థికం, ఇంధనం రంగాలకు చెందిన ఈ సంస్థల్లో రష్యా రెండో అతిపెద్ద బ్యాంకు కూడా ఉంది. రష్యన్ వ్యాపారుల మీద అమెరికా న్యాయ శాఖ ఐదు కేసులు నమోదు చేయగా, యుద్ధానికి అవసరమైన టెక్నాలజీని సరఫరా చేసిన కంపెనీలపై ఈయూ చర్యలు తీసుకుంది. వీటిలో భారత్, శ్రీలంక, తుర్కియేలకు చెందిన సంస్థలు ఉండడం గమనార్హం. నావల్నీ భార్య, కుమార్తెతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమావేశమయ్యారు. నావల్నీ అరెస్టుకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, ఉక్రెయిన్‌కు సంఘీభావంగా ఇటలీ, కెనడా, బెల్జియం ప్రధానమంత్రులు, యూఈ కమిషన్ చైర్ పర్సన్ ఉర్సులా వాన్‌డెర్ శనివారం కీవ్‌లో పర్యటించారు.

ధాన్యం నిల్వ పథకానికి రూ.1.25 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ " ఈ రోజు మన రైతుల కోసం ప్రపంచంలోనే అతి పెద్ద నిల్వ పథకాన్ని ప్రారంభించాం. దీని కింద దేశవ్యాప్తంగా వేలాది గిడ్డంగులు, గోదాముల నిర్మాణం జరుగుతుంది" అని పేర్కొన్నారు. దేశంలో నిల్వకు సంబంధించిన మౌలిక సదుపాయాలులేని కారణంగా రైతులు భారీగా నష్టాలను భరించాల్సి వస్తోందని ఆయన అన్నారు. "గత ప్రభుత్వాలు ఈ సమస్యపై ఎప్పుడు దృష్టిసారించలేదు. కానీ ఈ రోజు పీఏసీఎస్‌ల ద్వారా ఈ సమస్యను పరిష్కరిస్తున్నాం. రూ.1.25 లక్షల కోట్లకుపైగా ఖర్చుతో ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ పథకం కింద వచ్చే ఐదేళ్లలో 700 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యం సృష్టి జరుగుతుంది" అని ప్రధాని తెలిపారు. భారీగా నిల్వ సదుపాయాలను సృష్టించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను గోదాములు/గిడ్డంగులలో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని, దీనిపై సంస్థాగత రుణాన్ని పొందడానికి, మార్కెట్లో మంచి ధరలు వచ్చినప్పుడు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వంట నూనెలు, పప్పులు వంటి ఆహార ఉత్పత్తులతోపాటు ఫెర్టిలైజర్స్ దిగుమతులను తగ్గించే దిశగా పని చేయాలని సహకార సంస్థలను ప్రధాని కోరారు. కోఆపరేటివ్స్‌లోని ఎన్నికల విధానంలో పారదర్శకతను తీసుకురావాల్సిన అవసరం ఉందన్న ప్రధాని.. దీని వల్ల సహకార ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. "సహకార్ సే సమృద్ధి" విజన్‌లో భాగంగా సహకార రంగాభివృద్ధి కోసం గత పదేళ్ల కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు ప్రధాని తెలిపారు. ఇందులో భాగంగా సహకార రంగం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టాన్ని సవరించామని, పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా 18వేల పీఏసీఎస్‌లను కంప్యూటరీకరించే ప్రాజెక్టును కూడా ప్రధాని ప్రారంభించారు. రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్‌పీవో) గురించి ప్రధాని మాట్లాడుతూ.. చిన్న రైతులు ఆంత్రప్రెన్యూర్లుగా మారుతున్నారని, తమ ఉత్పత్తులను ఎగుమతి కూడా


ధాన్యం నిల్వ పథకం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ, సహకార మంత్రి అమిత్ షా

చేస్తున్నారని చెప్పారు. "10వేల ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకోగా ఇప్పటికే 8వేల ఎఫ్‌పీవోలను ఏర్పాటు చేశాం. వాటి విజయాన్ని ఇప్పుడు ప్రపంచ స్థాయిలో చర్చిస్తున్నారు. మత్స్య, పశుసంవర్ధక రంగాలు కూడా కోఆపరేటివ్స్ ద్వారా లబ్ధిపొందుతున్నాయి" అని ప్రధాని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 2 లక్షల పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యం ఉందని, ఇందులో మత్స్య, అనుబంధ వ్యవసాయ రంగాల్లోనే ఎక్కువ ఉంటాయని చెప్పారు. ఆహారం, ఇంధన ఉత్పత్తులకు సంబంధించిన భారత్ దిగుమతుల బిల్లును తగ్గించేందుకు సహకార రంగం సహాయపడాలన్నారు. మన దేశం స్వయం సమృద్ధిని సాధించేందుకు వీలుగా భారత్ దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తుల జాబితాను కోఆపరేటివ్స్ రూపొందించాలని, వాటిని దేశీయంగా ఉత్పత్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. వంట నూనెలు, ఫెర్టిలైజర్స్, ముడిచమురు దిగుమతులను తగ్గించడానికి సహకార సంస్థలు సహాయం చేయగలవన్నారు.

65వేల పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

ఈ ఏడాది ఆగస్టుకల్లా దాదాపు 65వేల పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయనున్నట్టు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దీని వల్ల వాటి సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. 65వేల పీఏసీఎస్‌లలో ఇప్పటికే 18,000 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తయిందని, ఎన్నికలకన్నా ముందే 30వేల పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ జరుగుతుందని చెప్పారు. రూ.2,516 కోట్లతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు గత ఏడాది జూన్‌లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

కాంగ్రెస్‌కు కుటుంబమే ముఖ్యం: మోదీ

కుటుంబ, బుజ్జగింపు రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం, అవినీతికి మించి కాంగ్రెస్ పార్టీ ఆలోచించలేదని ప్రధాని మోదీ విమర్శించారు. దేశాభివృద్ధి అనేది ఆ పార్టీ అజెండాలో ఎప్పుడూ లేదన్నారు. శనివారం ఆయన 'వికసిత్ భారత్ వికసిత్ చండీగఢ్' కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించారు. రూ.34,400 కోట్ల విలువైన పది అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కాగా, మోదీ తన నియోజకవర్గం వారాణసీలో 'నారీ శక్తి వందన్-అభినందన్' కార్యక్రమంలో 5 వేల మంది మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం తర్వాత ఆశీస్సులు అందుకోవడానికి వచ్చానన్నారు. రాణీ లక్ష్మీబాయి జన్మస్థలం కాశీయేనని గుర్తుచేస్తూ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి చంద్రయాన్ వరకు మహిళలు పోషించిన పాత్రను కొనియాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసినందుకు కృతజ్ఞతగా మోదీపై మహిళలు పూలజల్లు కురిపించారు.

కేంద్ర ఉద్యోగులకు వచ్చే నెలలో డీఏ పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి నెలలో 4 శాతం డీఏ పెంచే అవకాశం ఉంది. ఏటా వినియోగదారుల ధరల సూచిక(సీపీఐ) ఆధారంగా డీఏ ఎంతమేరకు పెంచాలో కేంద్రం నిర్ణయిస్తుంది. ప్రస్తుతం సీపీఐ 12 నెలల సగటు 392.83 పాయింట్ల వద్ద ఉంది. దీని ప్రకారం కేంద్ర ఉద్యోగులకు డీఏ మూల వేతనంలో 50.26 శాతం ఉండవచ్చు. కేంద్రం ఏటా జనవరి, జూలై నెలల్లో డీఏని సవరిస్తుంది. అయితే గతేడాది అక్టోబరు నెలలో డీఏని 4% పెంచగా మొత్తం 46 శాతానికి చేరింది. కాగా మార్చిలో పెంచనున్న డీఏ ఈ ఏడాది జనవరి 1 నుంచే అమలవుతుంది. ఈమేరకు కేంద్ర ఉద్యోగులు, పింఛనుదారులకు బకాయిలు చెల్లించే అవకాశం ఉంది.

కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలం నాటి నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా కొత్తగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భారతీయ శిక్షాస్మృతి-1860, నేర శిక్షాస్మృతి-1898, భారతీయ సాక్ష్యాధార చట్టం-1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్షా సంహిత-2023, భారతీయ సాక్ష్య-2023 చట్టాలు దేశమంతా అమలవుతాయని పేర్కొంది. గతేడాది డిసెంబరు 21న పార్లమెంటు ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. డిసెంబరు 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. శనివారం కేంద్ర హోం శాఖ కొత్త చట్టాల వర్తింపుపై మూడు నోటిఫికేషన్లు జారీ చేసింది. కాగా హిట్ అండ్ రన్ కేసులకు కొత్త చట్టం అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చింది. భారతీయ న్యాయ సంహితలోని 106 (2) సెక్షన్ నిబంధన మినహా కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమల్లో వస్తాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమైన హిట్ అండ్ రన్ కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించేలా చట్టంలో చేర్చిన ఈ సెక్షన్ అమలుపై డ్రైవర్లు నిరసన తెలపడంతో కేంద్రం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది.

లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాపై పరిశీలన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈశాన్య రాష్ట్రాలు మాదిరిగానే గిరిజన ప్రాంతంగా పరిగణించి, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై కూడా అధ్యయనం చేస్తామని తెలిపింది. ఆరో షెడ్యూలులో చేర్చితే స్వయంప్రతిపత్తిగల అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయడంతో పాటు, భూములు, ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాల్లో సొంతంగా నిబంధనలు రూపొందించుకోవచ్చు. ప్రత్యేక సర్వీసు కమిషన్ ఏర్పాటును కూడా పరిశీలించనున్నట్టు తెలిపింది. శనివారం ఇక్కడ లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రాటిక్ అలయెన్స్ సంస్థల ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కేంద్ర హోం శాఖ అధికారులు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా, కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో మంచులో నిరవధిక నిరాహార చేయాలన్న తన నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌మక్ ప్రకటించారు.

అమాయకుల మీదికే బుల్డోజర్లు

యూపీ సర్కార్‌పై ప్రియాంక ధ్వజం.. రాహుల్‌తో కలిసి యాత్ర

లఖ్‌నవూ, ఫిబ్రవరి 24: యూపీలో అమాయకుల ఇళ్లను కూల్చేస్తున్న బుల్డోజర్లు నేరస్థుల ఇళ్ల జోలికి మాత్రం వెళ్లవని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. పేపర్ లీకేజీకి పాల్పడిన, మహిళలను హింసించిన, రైతులను జీపులతో తొక్కి చంపిన నేరస్థుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం లేదంటూ యూపీలోని బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర రెండ్రోజుల విరామం అనంతరం యూపీలోని మొరాదాబాద్‌లో శనివారం తిరిగి ప్రారంభమైంది. రాహుల్‌తో కలిసి ఈ యాత్రలో పాల్గొన్న ప్రియాంక మొరాదాబాద్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇదిలా ఉండగా, సోమవారం ఆగ్రాలో జరిగే యాత్రలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పాల్గొంటారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ప్రసంగించేందుకు రాహుల్ గాంధీ యూకే పర్యటనకు వెళుతుండడంతో ఫిబ్రవరి26 నుంచి మార్చి 1 దాకా జోడో న్యాయ్ యాత్రకు విరామం ప్రకటించారు. మార్చి 2న ధోల్‌పూర్ నుంచి యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది.


జోడో యాత్రలో రాహుల్‌తో ప్రియాంక

యూపీలో మళ్లీ కానిస్టేబుల్ నియామక పరీక్ష

ప్రశ్నాపత్రాలు లీకైన పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షను మళ్లీ నిర్వహించాలంటూ యూపీ యువత నిర్వహిస్తున్న ఉద్యమానికి యోగి సర్కారు దిగి వచ్చింది. ఆరు నెలల్లో పరీక్షను తిరిగి నిర్వహిస్తామని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా తీసుకెళ్తామని శనివారం ప్రకటించింది.

5 రాష్ట్రాల్లో ఆప్-కాంగ్రెస్ ఉమ్మడి పోరు

పంజాబ్‌లో మాత్రం ఎవరికివారే

» అవినీతి పొత్తు మాబాగా కుదిరింది: బీజేపీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పార్లమెంటు ఎన్నికల్లో పొత్తులపై అనేక తర్జనభర్జనల నడుమ ఢిల్లీ అధికార పార్టీ ఆప్.. కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపింది. ఢిల్లీ, గోవా, గుజరాత్, హరియాణా, చండీగఢ్‌లలోని పార్లమెంటు స్థానాల్లో ఉమ్మడిగా పోటీ చేయాలని రెండు పార్టీలూ నిర్ణయించాయి. ఆప్ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. "రాజకీయ ప్రాధాన్యాల కన్నా దేశ ప్రయోజనాలు మిన్న అని భావించాం. కాంగ్రెస్‌పై నమ్మకంతోనే ఆ పార్టీతో చేతులు కలిపాం" అని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో ఆప్ కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ మాట్లాడుతూ.. ఢిల్లీ సహా పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ స్థానాల్లో ఆప్ పోటీ చేస్తుందన్నారు. చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ సీట్లలో కాంగ్రెస్ పోటీలోకి దిగుతుందని తెలిపారు. ఈ ఏడు స్థానాల్లోనూ 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ విజయం దక్కించుకుంది. ఇక, గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాల్లో రెండు చోట్ల(భారుచ్, భావ్‌నగర్) ఆప్, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయనున్నాయి. అదేవిధంగా గోవాలోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ పోటీ చేయనుండగా, చండీగఢ్‌లోని ఒకే ఒక స్థానం నుంచి కూడా బరిలోకి దిగనుంది. అయితే, గోవాలోని దక్షిణ నియోజకవర్గం నుంచి ఆప్ ఇదివరకే తన అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెంజీ వేగాస్‌ను ప్రకటించింది. అయితే, ఆయనను పక్కకు తప్పించి కాంగ్రెస్ అభ్యర్థి ఫ్రాన్సిస్కో సర్దిన్హా ఇక్కడ నుంచి పోటీ చేయనున్నారు. హరియాణాలోని 10 స్థానాల్లో కాంగ్రెస్ 9 చోట్ల, ఆప్ ఒక స్థానం(కురుక్షేత్ర) నుంచి పోటీ చేయనున్నాయి. కీలకమైన పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్‌లు ఎవరికి వారుగా పోటీ చేయనున్నారు. "ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాం" కాంగ్రెస్ నేత వాస్నిక్ తెలిపారు.

రాష్ట్రం	సీట్లు	కాంగ్రెస్	ఆప్
ఢిల్లీ	7	3	4
గుజరాత్	26	24	2
గోవా	2	2	0
ఛండీగఢ్	1	1	0
హరియాణా	10	9	1

సహకరించేది లేదు: పటేల్ కుటుంబం

గుజరాత్‌లోని భారుచ్ స్థానాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ కుమారుడు ఫైజల్ పటేల్ ఆశించారు. కానీ, ఈ సీటును ఆప్‌కు ఇవ్వడంతో ఆయన భగ్గుమన్నారు. ఆప్‌కు సహకరించేది లేదని కుండబద్దలు కొట్టారు. గతంలో అహ్మద్‌పటేల్ 1970-1980 మధ్య మూడు సార్లు భారుచ్ నుంచి విజయం సాధించారు. అయితే, ఆప్ నుంచి పోటీకి సిద్ధమైన చైతర్ వాసవ మాత్రం తాను ఇక్కడ నుంచి గెలిచి అహ్మద్ పటేల్‌కు అంకితమిస్తానని వ్యాఖ్యానించారు. కాగా, కాంగ్రెస్, ఆప్ పొత్తులపై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్-ఆప్‌ల మధ్య 'అవినీతి పొత్తు' మాబాగా కుదిరిందన్నారు.

బదిలీల్లో అలసత్వం సహించబోం

» అధికారిని తాను పనిచేసే జిల్లాకు పక్కనే, అదే నియోజకవర్గంలోని జిల్లాకు పంపొద్దు

» బదిలీ మార్గదర్శకాలను పాటించాల్సిందే.. రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికలసంఘం నిర్దేశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 : సార్వత్రిక ఎన్నికలవేళ అధికారుల బదిలీల విషయంలో రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్దిష్ట మార్గదర్శకాలను జారీచేసింది. బదిలీ ప్రక్రియలో అలసత్వాన్ని సహించబోమని స్పష్టం చేసింది. పని చేస్తున్న జిల్లాకు పక్కనే ఉన్న, అదే నియోజకవర్గం పరిధిలోని జిల్లాకు అధికారిని పంపితే.. దానిని బదిలీగా పరిగణించబోమని స్పష్టం చేసింది. ఎన్నికలకు ముందు అధికారులకు స్థానచలనం కలిగించడం ఎన్నికల నిబంధనల్లో భాగం. సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారినీ, పనిచేస్తున్న చోట మూడేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న అధికారులను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. పోటీలో ఉన్న ఏదో ఒక రాజకీయ పార్టీ లేక అభ్యర్థికి అనుకూలంగా తమ అధికారాలను అధికారులు వినియోగించకుండా ఈసీ ఈ నిబంధనను గట్టిగా అమలు చేస్తోంది. అయితే, కొన్ని చోట్ల బదిలీ ప్రక్రియను తూతూమంత్రంగా చేపడుతున్నట్టు ఈసీ తన పర్యటనల్లో గమనించింది. దీనిని ఈసీ చాలా తీవ్రంగా పరిగణించింది. బదిలీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్రాలకు గట్టిగా సూచించింది. "సమదృష్టిలో అధికారులు ఎన్నికల నిర్వహణ చేపట్టాలి. ఎవరి వల్లా ఈ ప్రక్రియ ఇబ్బందుల్లో పడకుండా మార్గదర్శకాలను మరింత బలోపేతం చేశాం. మార్గదర్శకాల్లో మేం గుర్తించిన చిన్న చిన్న లొసుగులను కూడా సరిదిద్ది సమగ్ర విధానంతో ఈసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం" అని శనివారం ఒక ప్రకటనలో సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు.

36% రాజ్యసభ అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

బరిలోని 58 మంది అఫిడవిట్‌ల విశ్లేషణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే 56 రాజ్యసభ స్థానాల కోసం ఈనెల 27న పోలింగ్ నిర్వహించనున్నారు. 15 రాష్ట్రాల నుంచి 59 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఒకరు మినహా మొత్తం 58 మంది అఫిడవిట్‌లను విశ్లేషించిన ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వారిపై క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాయి. 58 మందిలో 21 మంది (36%)పై క్రిమినల్ కేసులున్నాయి. అందులోనూ 10 మంది (17%) తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీల పరంగా చూస్తే 30 మంది బీజేపీ అభ్యర్థుల్లో 8 మందిపై, 9 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఆరుగురిపై, ముగ్గురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో ఒకరిపై, పోటీలో ఉన్న ఒకే ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిపై కూడా క్రిమినల్ కేసులున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి నవ్య
దృశ్యం
ఆదివారం
25 ఫిబ్రవరి 2024

ముగింపు నుంచి మొదలు

మన యువ హీరోలు జోరు మీదున్నారు. ఒకట్రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే, కొత్త సినిమాలకు పచ్చ జెండా ఊపుతున్నారు. చేతిలో ఉన్న చిత్రాల షూటింగ్ చివరి దశలో ఉండగానే గ్యాప్ రాకుండా తదుపరి చిత్రాలకు సన్నాహాలు మొదలుపెడుతున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.



ప్రస్తుతం 'సలార్' సక్సెస్‌ను ఆస్వాదిస్తున్నారు ప్రభాస్. ఇప్పుడు ఆయన 'సలార్' సీక్వెల్‌తో పాటు మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' చిత్రం చేస్తున్నారు. ఇవి రెండూ పూర్తయ్యాక ఆయన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రం చేస్తున్నారు. 'యానిమల్' చిత్రం ఘన విజయం సాధించడంతో సందీప్ మరోసారి ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఇన్నేళ్ల కెరీర్‌లో ప్రభాస్ ఈ చిత్రంలో తొలిసారి పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'స్పిరిట్' స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయినట్లే అని సందీప్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వీలయినంత త్వరగా ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసి ఈ ఏడాది చివరల్లో 'స్పిరిట్'ను సెట్స్‌పైకి తీసుకెళ్తామని ఆయన చెప్పారు.

వార్‌కు రెడీ

'జనతా గ్యారేజ్' చిత్రం లాంటి సూపర్‌హిట్ తర్వాత ఎన్టీఆర్‌తో దర్శకుడు కొరటాల శివ రూపొందిస్తున్న చిత్రం 'దేవర'. చిత్రీకరణ చివరి దశకు వచ్చింది. కొంత టాకీ పార్ట్‌తో పాటు కొన్ని పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. త్వరలోనే ఎన్టీఆర్ 'వార్ 2' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. హృతిక్‌రోషన్, టైగర్‌ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. ఇందులో ఎన్టీఆర్ పాత్ర అంచనాలను మించి ఉండబోతోందని టాక్. త్వరలోనే 'వార్ 2' చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నట్లు హృతిక్‌రోషన్ ఇటీవలే తెలిపారు. అంటే ఎన్టీఆర్ కూడా ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లే. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దర్శకుడు అయాన్ ముఖర్జీ. వచ్చే ఏడాది ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

మూడోసారి పుష్పగా వస్తారా?

'పుష్ప' చిత్రంతో జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన 'పుష్ప 2' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన చేయబోయే తదుపరి సినిమా ఇప్పటిదాకా ఖరారు కాలేదు. అయితే ఇటీవలే బెర్లిన్ చిత్రోత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా 'పుష్ప'కు కొనసాగింపుగా 'పుష్ప 3' చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని బన్నీ చెప్పారు. పుష్ప చిత్రంతో అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. హీరోగా ఆయన మార్కెట్ రేంజ్ భారీగా పెరిగింది. అచ్చొచ్చిన ఫ్రాంఛైజీలో మరో చిత్రం చేయడానికి బన్నీ వెనుకాడకపోవచ్చు. అదే జరిగితే బన్నీ తర్వాత చేయబోయే సినిమా 'పుష్ప 3'నే అవుతుంది.

16తో సెట్స్‌పైకి

'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత రామ్‌చరణ్ రేంజ్ మరింత పెరిగింది. ఆ ఇమేజ్‌కు తగ్గట్లు కొత్త సినిమాలను ఎంచుకుంటున్నారు చరణ్. ఆయన ప్రస్తుతం 'గేమ్‌ఛేంజర్' చిత్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. దీని తర్వాత రామ్‌చరణ్ చేయబోయే సినిమా బుచ్చిబాబు సానా దర్శకత్వంలోనే. దీనికి 'ఆర్ సీ 16' వర్కింగ్ టైటిల్. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

సరికొత్త మేకోవర్‌తో

'గుంటూరు కారం' చిత్రంతో సందడి చేశారు మహేశ్‌బాబు. సంక్రాంతికి విడుదల చేయాలనే లక్ష్యంతో ఆ సినిమా చిత్రీకరణ చాలా వేగంగా పూర్తి చేశారు మహేశ్. ఇప్పుడు ఆయన రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసినట్లు రచయిత విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభించాల్సి ఉంది. అది పూర్తవగానే మహేశ్ రాజమౌళి సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతారు. ఇప్పటికే ఆయన తన పాత్ర కోసం సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు.

పోలీస్ కథతో

'లైగర్' తర్వాత 'ఖుషీ' చిత్రంతో థియేటర్ల దగ్గర మేజిక్ చేశారు విజయ్ దేవరకొండ. ఈ సారి మరో చక్కని లవ్‌స్టోరీతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. పరశురామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి, ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని విజయ్ భావిస్తున్నారు. ఆ తర్వాత ఆయన వెంటనే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం షూటింగ్ మొదలుపెట్టనున్నారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'వీడీ 12' అనేది వర్కింగ్ టైటిల్. ఇందులో విజయ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.







అట్లీ...హాలీవుడ్ అనౌన్స్‌మెంట్




గతేడాది షారూఖ్‌ఖాన్ కథానాయకుడిగా నటించిన 'జవాన్' చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. బాక్సాఫీసు దగ్గర ఆ సినిమా ధాటికి పాత రికార్డులు చెరిగిపోయాయి. గతేడాది అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 'జవాన్' నిలవడంతో దర్శకుడిగా అట్లీ పేరు మార్మోగింది. రూ. వెయ్యికోట్ల వసూళ్లను అందుకొన్న చిత్రాల దర్శకుడిగా ఆయన అరుదైన ఘనత సాధించారు. ఆ సినిమా ఘన విజయం తర్వాత అట్లీ తన మనసులో మాట బయటపెట్టారు. ఓ హాలీవుడ్ సినిమాకు దర్శకత్వం వహించాలనేది తన కల అని చెప్పారు. ఆ తర్వాత ఆయన ఆ విషయంపై ఎక్కడా స్పందించలేదు. అయితే త్వరలోనే తన హాలీవుడ్ కోరిక నెరవేరబోతోందని అట్లీ తెలిపారు. తాను హాలీవుడ్ సినిమా చేయడం ఖాయమైనట్లు ఓ ఇంటర్వ్యూలో ఆయన ప్రకటించారు. బాలీవుడ్‌కు చేరడానికి నాకు ఎనిమిదేళ్లు పట్టింది, రాబోయే మూడేళ్లలో నా నుంచి ఓ భారీ అనౌన్స్ మెంట్ వింటారు అని ఆయన చెప్పారు. తన కలల ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను ఇప్పుడే వెల్లడించలేనని అన్నారు. మంచి వినోదం అందించగలగడం దర్శకుడిగా నా బలం, హాలీవుడ్‌లో సినిమా చేసినా ఎంటర్టైన్‌మెంట్‌కు పెద్ద పీట వేస్తాను అని అట్లీ తెలిపారు.


పెళ్లితో జోరు పెరిగింది



సిద్ధార్థ్ మల్హోత్రాతో వివాహం తర్వాత హీరోయిన్‌గా తన కెరీర్ మాంచి జోరుమీదుందంటున్నారు కియార అద్వాణీ. హీరోయిన్లు వివాహబంధంలోకి అడుగుపెడితే ప్రేక్షకులు తిరస్కరిస్తారు అనుకోవడం సరికాదు అన్నారు. గతేడాది కియారా బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడారు. 'పెళ్లితో హీరోయిన్‌గా కెరీర్ దెబ్బతింటుంది, మంచి పొజిషన్‌లో ఉన్నావ్, ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకోవద్దని ఆ సమయంలో చాలా మంది సలహా ఇచ్చారు కానీ నేను వినలేదు' అని కియారా అన్నారు. 'ఇప్పుడు నా జీవితంలో వాళ్లు చెప్పినదానికి పూర్తి భిన్నంగా జరుగుతోంది. పెళ్లయినా ప్రేక్షకులు నా చిత్రాలను గతంలోలానే ఆదరిస్తున్నారు. సిద్ధార్థ్‌తో పెళ్లి తర్వాతే నా కెరీర్‌లో అతిగొప్ప అవకాశాలను అందుకున్నానని భావిస్తున్నాను' అని తెలిపారు. తెలుగులో రామ్‌చరణ్ సరసన 'గేమ్ ఛేంజర్', హిందీలో రణ్‌వీర్ సింగ్ సరసన 'డాన్ 3' చిత్రాల్లో ఆమే హీరోయిన్. ఆ రెండు సినిమాలను ఉదహరిస్తూ... పెళ్లి అయ్యాకే ఈ రెండు భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ల్లో నాకు అవకాశం వచ్చింది, ఇదొక మంచి మార్పు అని చెప్పారు. వీటితో పాటు హృతిక్‌రోషన్ సరసన 'వార్ 2' చిత్రంలోనూ కియారా నటిస్తున్నారు.

వైఫల్యాన్ని అంగీకరించడానికి టైమ్ పట్టింది






ఆమిర్‌ఖాన్

తాను చేసిన పొరపాట్లే 'లాల్‌సింగ్‌చద్దా' చిత్రం ఘోర వైఫల్యానికి కారణమయ్యాయని ఆమిర్‌ఖాన్ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల విరామం తర్వాత ఆయన నటించిన చిత్రమిది. ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య కీలకపాత్రలో కనిపించారు. హాలీవుడ్ చిత్రం 'ఫారెస్ట్ గంప్'కు రీమేక్‌గా రూపొందిన 'లాల్‌సింగ్ చద్దా'పై ఆమిర్‌ఖాన్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన ఆశలన్నీ అడియాసలయ్యాయి. ముమ్మరంగా ప్రచారం చేసినా ప్రేక్షకులు కన్నెత్తి చూడకపోవడంతో బాక్సాఫీసు దగ్గర ఆ చిత్రం డిజాస్టర్‌గా మిగిలింది. ఆ అపజయంతో కంగుతిన్న ఆమిర్ మళ్లీ సినిమాలకు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు ఏణ్నార్థం అవుతున్నా ఇప్పటిదాకా కొత్త చిత్రం ప్రకటించలేదంటే ఆయన ఎంత సందిగ్ధంలో ఉన్నారో అర్థమవుతోంది. ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమిర్ 'లాల్‌సింగ్ చద్దా' సినిమా అపజయం ఆయన కెరీర్, జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. "లాల్‌సింగ్ చద్దా" అపజయానికి పూర్తి బాధ్యత నాదే. సినిమా వైఫల్యంతో చాలా మథనపడ్డాను. వాస్తవాన్ని అంగీకరించడానికి నాకు చాలా టైమ్ పట్టింది. నాతో సహా దర్శకుడు అద్వైత్, హీరోయిన్ కరీనా కపూర్, చిత్రబృందం అంతా తీవ్రంగా శ్రమించారు. అయినా సినిమా ఆడలేదు. ఇన్నేళ్ల తర్వాత ఎంతో కష్టపడి చేసిన సినిమాకు డిజాస్టర్ టాక్ రావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు నన్ను పరామర్శించేందుకు మా ఇంటికి వరుస కట్టారు. ఒక సినిమా ఫ్లాప్ అయిన తర్వాత కూడా ఇంతమంది పరామర్శకు రావడం నాకు ఓదార్పునిచ్చింది. అలాగే నా పొరపాట్లను సమీక్షించుకున్నాను. ఆ సినిమా వైఫల్యం నాకు జీవితకాలానికి సరిపడా పాఠాలు నేర్పింది. సినిమా మేకింగ్‌లో ప్రతి స్థాయిలోనూ చాలా పొరపాట్లు చేశాను. అయితే ఇలాంటి పొరపాట్లు ఈ ఒక్క సినిమాలోనే కదా చేసింది అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను' అని తెలిపారు. ఆమిర్‌ఖాన్ 'సలామ్ వెంకీ' అనే చిత్రంలో అతిథి పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఆయన చిత్ర నిర్మాణంపై దృష్టి సారించారు. తన సొంత బేనర్‌లో నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం మార్చి 1న విడుదలవుతోంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కోడ్ 8	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 28
మామ్లా లీగల్ హై	హిందీ సిరీస్	మార్చి 01
స్పేస్‌మాన్	హాలీవుడ్ మూవీ	మార్చి 01
అమెజాన్ ప్రైమ్		
వెడ్డింగ్ ఇంపాజిబుల్	కొరియన్ సిరీస్	ఫిబ్రవరి 26
ఎనీవన్ బట్ యూ	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 27
పూర్ థింగ్స్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 27
నైట్ స్విమ్	హిందీ డబ్బింగ్	మార్చి 01
జీ 5		
సన్‌ఫ్లవర్	హిందీ సిరీస్ 2	మార్చి 01
ఆహా...		
బూట్‌కట్ బాలరాజు	తెలుగుచిత్రం	ఫిబ్రవరి 26
బుక్ మై షో		
ఫియర్	హాలీవుడ్ మూవీ	ఫిబ్రవరి 17



జీవితం... నీకే అంకితం



బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'యోధ'. మార్చిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శనివారం తొలిగీతాన్ని విడుదల చేసింది. 'జిందగీ తెరే నామ్' అంటూ సాగే ఈ పాటలో అందమైన పర్వత సానువులు, ఆహ్లాదాన్ని పంచే ప్రదేశాల్లో చిత్రీకరించిన ఈ రొమాంటిక్ గీతంలో హీరో హీరోయిన్లు జంటగా బైక్‌పై విహరిస్తూ ఊహాలోకంలో తేలిపోతూ కనిపించారు. కౌశల్ కిశోర్ సాహిత్యం అందించగా విశాల్ మిశ్రా స్వరాలు సమకూర్చడంతో పాటు మధురంగా ఆలపించారు. సిద్ధార్థ్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి యాక్షన్ పాత్ర పోషిస్తున్నారు.



నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ)- పలు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ ఆధ్వర్యంలోని వివిధ స్కూళ్లు వీటిని నిర్వహిస్తున్నాయి. గాంధీనగర్, ఢిల్లీ, త్రిపుర, గోవా, భోపాల్, ధర్వాడ, మణిపూర్ క్యాంపస్‌లలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఏ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎల్ఎల్ఎం, బీటెక్-ఎంటెక్, బీబీఏ-ఎంబీఏ, బీఎస్సీ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, పీజీ డిప్లొమా తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ డిప్లొమాలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు సంస్థ సీబీటీ మోడ్‌లో నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● ఆదివారం 25 ఫిబ్రవరి 2024

diksuchi@andhrajyothy.com

ఎన్ఎఫ్ఎస్‌యూలో అడ్మిషన్స్

ఎన్ఎఫ్ఎస్‌యూ స్కూళ్లు

- స్కూల్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్
- స్కూల్ ఆఫ్ మెడికో లీగల్ స్టడీస్
- స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్
- స్కూల్ ఆఫ్ ఫార్మసీ
- స్కూల్ ఆఫ్ లా-ఫోరెన్సిక్ జస్టిస్ అండ్ పాలసీ స్టడీస్
- స్కూల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్
- స్కూల్ ఆఫ్ పోలీస్ సైన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్
- స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ
- స్కూల్ ఆఫ్ బిహేవియరల్ ఫోరెన్సిక్స్

పీజీ

ఎమ్మెస్సీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

స్పెషలైజేషన్‌లు: ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ, మల్టీమీడియా ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, హోంలాండ్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నానో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, క్లినికల్ సైకాలజీ, న్యూరో సైకాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, టాక్సికాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ

అడ్మిషన్ టెస్ట్: ఇది 100 మార్కులకు ఉంటుంది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బేసిక్స్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, లాజికల్ రీజనింగ్, లైఫ్ సైన్స్, ఫుడ్ సైన్స్ తదితర అంశాల నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.

ఎంబీఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్ 2023 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు; అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ద్వారా మిగిలిన సీట్లు భర్తీ చేస్తారు.

స్పెషలైజేషన్‌లు: ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్-ఇంటెలిజెన్స్

అడ్మిషన్ టెస్ట్: జనరల్ నాలెడ్జ్, లాజికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్, మేథమెటికల్ రీజనింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాల నుంచి 60 శాతం; ఫండమెంటల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్ అంశాల నుంచి 40 శాతం మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.

ఎంఫార్మసీ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కనీసం 55 శాతం మార్కులతో బీఫార్మసీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫోరెన్సిక్ ఫార్మసీ, ఫార్మాస్యూటిక్ క్వాలిటీ అస్యూరెన్స్

అడ్మిషన్ టెస్ట్: బీఫార్మసీ సిలబస్ నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు.

ఎంటెక్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లను, అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేస్తారు. అడ్మిషన్ టెస్ట్‌లో నిర్దేశిత స్పెషలైజేషన్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

స్పెషలైజేషన్‌లు: సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్(సైబర్ సెక్యూరిటీ), సివిల్ ఇంజనీరింగ్(ఫోరెన్సిక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్)

ఎల్ఎల్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైబర్ లా అండ్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్

ఎంపిక: పీజీ క్లాట్ 2024 స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంఫిల్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రెండేళ్ల వ్యవధి గల (ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) ఉత్తీర్ణులు అర్హులు.

స్పెషలైజేషన్: క్లినికల్ సైకాలజీ

అడ్మిషన్ టెస్ట్: జనరల్ సైకాలజీ సిస్టమ్స్, సైకో పాథాలజీ, సైకో థెరపీ, సోషల్ సైకాలజీ, బయలాజికల్ సైకాలజీ, సైకలాజికల్ మెజర్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, స్టాటిస్టిక్స్ తదితర అంశాల నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అర్హత పొందినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు.

పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: ఫింగర్‌ప్రింట్ సైన్స్, ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, డీఎన్ఏ ఫోరెన్సిక్స్, క్రైం సీన్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ జర్నలిజం(ఆన్‌లైన్), ఫోరెన్సిక్ బాలిస్టిక్స్, సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్, సెమి కండక్టర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ స్టడీస్, సైబర్ సైకాలజీ, ఇన్వెస్టిగేటివ్ సైకాలజీ, హ్యూమానిటేరియన్ ఫోరెన్సిక్స్, డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్, ఇండస్ట్రియల్ సేఫ్టీ-హైజిన్-ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, సైబర్ లా

ఇంటిగ్రేటెడ్ కోర్సులు

ప్రోగ్రామ్‌లు: బీఎస్సీ-ఎమ్మెస్సీ (ఫోరెన్సిక్ సైన్స్/క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్); బీఏ-ఎంఏ(క్రిమినాలజీ); బీఎస్సీ ఎల్ఎల్‌బీ ఆనర్స్; బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్; బీటెక్-ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), బీబీఏ-ఎంబీఏ

- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. కోర్సుకు నిర్దేశించిన ప్రకారం సంబంధిత గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ఎంపిక: బీఎస్సీ ఎల్ఎల్‌బీ; బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లకు క్లాట్ 2024 స్కోర్ ఆధారంగా; బీటెక్-ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ) ప్రోగ్రామ్‌నకు జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఈ టెస్ట్‌లో నిర్దేశించిన సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.

ఎంఏ: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫోరెన్సిక్ జర్నలిజం, పాలసీ అండ్ సెక్యూరిటీ స్టడీస్, క్రిమినాలజీ

అడ్మిషన్ టెస్ట్: మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫోరెన్సిక్ జర్నలిజం స్పెషలైజేషన్‌కు జీకే, లాజికల్/మేథమెటికల్ రీజనింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ అంశాలనుంచి 60 శాతం ప్రశ్నలు; జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, మీడియా లాస్ అంశాల నుంచి 40 శాతం ప్రశ్నలు అడుగుతారు. పాలసీ అండ్ సెక్యూరిటీ స్టడీస్ స్పెషలైజేషన్‌కు జీకే, రీజనింగ్, మేథమెటిక్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్, నేషనల్ సెక్యూరిటీ, ఇండియన్ సెక్యూరిటీ ఫోర్సెస్, హిస్టరీ ఆఫ్ టెర్రరిజం, కరెంట్ అఫైర్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. క్రిమినాలజీ స్పెషలైజేషన్‌కు సోషియాలజీ, సోషల్ సైకాలజీ, సోషల్ వర్క్, క్రిమినాలజీ సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ టెస్ట్ దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎఫ్ఏటీ) 2024 తేదీలు:** జూన్ 15, 16
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌లు, కౌన్సెలింగ్‌లు:** జూన్ 24 నుంచి జూలై 12 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 22 నుంచి
- **వెబ్‌సైట్:** www.nfsu.ac.in

ఏకలవ్య ఆదర్శ గురుకులాల్లో ఆరో తరగతి ప్రవేశాలు



తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 23 ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్య శిక్షణ అందిస్తారు బోధన మాధ్యమం ఆంగ్లంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు. అర్హులైన గిరిజన, ఆదివాసి గిరిజన, సంచార గిరిజన, పాక్షిక సంచార గిరిజన, డీనోటిఫైడ్ ట్రైబ్ కేటగిరీలకు చెందిన మార్చి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు

పరీక్ష వివరాలు

అడ్మిషన్: తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు.

పరీక్ష పేరు: ఈఎంఆర్ఎస్ సెలెక్షన్ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎస్‌టీ)-2024

సీట్ల వివరాలు: ప్రతి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతిలో 60 సీట్ల చొప్పున మొత్తం 23 విద్యాలయాల్లో 1,380(690 బాలురు, 690 బాలికలు) సీట్లు ఉన్నాయి.

పాఠశాలలు ఉన్న ప్రాంతాలు

- ఉట్నూరు, సిర్పూర్-టి(ఆసిఫాబాద్ జిల్లా), నర్నూరు, ఇంద్రవెల్లి(ఆదిలాబాద్ జిల్లా, గండుగలపల్లి, పాల్వంచ, గుండాల, టేకులపల్లి, చర్ల, దమ్ముగూడెం, ముల్కలపల్లి(భద్రాది కొత్తగూడెం జిల్లా), కల్వకుర్తి(నాగర్‌కర్నూలు జిల్లా), బాలానగర్(మహబూబ్‌నగర్ జిల్లా), కురవి, సీరోలు, బయ్యారం, కొత్తగూడ, గూడూరు(మహబూబాబాద్ జిల్లా), గాంధారి(కామారెడ్డి జిల్లా), ఇందల్వాయి(నిజామాబాద్ జిల్లా), మర్రిమండ్ల, ఎల్లారెడ్డిపేట(రాజన్న సిరిసిల్ల జిల్లా), సింగరేణి(ఖమ్మం జిల్లా).

అర్హతలు: ఆరో తరగతిలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు తప్పనిసరిగా 2023-24 విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదివి ఉండాలి.

వయసు: 2024 మార్చి 31 నాటికి ఆరో తరగతికి 10-13 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.

పరీక్ష విధానం: ఆరో తరగతికి 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ(50 ప్రశ్నలు, అర్థమెటిక్(25 ప్రశ్నలు), లాంగ్వేజ్(25 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష నిర్వహిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.100

దరఖాస్తు విధానం: ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ: మార్చి 23

ప్రవేశ పరీక్ష నిర్వహణ: ఏప్రిల్ 21

మొదటిదశ ప్రవేశాలు: మే 23

రెండో దశ ప్రవేశాలు: జూన్ 5

వెబ్‌సైట్: tsemrs.telangana.gov.in/

సింగరేణిలో ఎగ్జిక్యూటివ్/నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 272

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఏ), ఈ2 గ్రేడ్: **22 పోస్టులు**
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22 పోస్టులు**
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10 పోస్టులు**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10 పోస్టులు**
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2 పోస్టులు**
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18 పోస్టులు**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3 పోస్టులు**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30 పోస్టులు**

నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు


10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టీ అండ్ ఎస్ గ్రేడ్-సి: **16 పోస్టులు**

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మార్చి 1

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 18

వెబ్‌సైట్: https://scclmines.com/

జాబ్ కార్నర్



ఎస్‌బీఐలో క్రెడిట్ అనలిస్ట్‌లు

ఖాళీలు 50

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: క్రెడిట్ అనలిస్ట్(మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-3)

అర్హత: డిగ్రీ, ఎంబీఏ(ఫైనాన్స్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్(ఫైనాన్స్)/సీఏ/సీఎఫ్ఏ)ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి

జీతభత్యాలు: నెలకు రూ.63,840 - రూ.78,230

దరఖాస్తు ఫీజు: రూ.750

ఎంపిక విధానం: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 4

వెబ్‌సైట్: https://www.sbi.co.in/

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

ఖాళీలు 20

ముంబయిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా...రెగ్యులర్ ప్రాతిపదికన రిస్క్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు: మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్

విభాగాలు: పోర్ట్ ఫోలియో మానిటరింగ్ అండ్ ఎక్స్‌పోజర్ మేనేజ్‌మెంట్, సెక్టార్/ఇండస్ట్రీ అనలిస్ట్, ఎంటర్‌ప్రైజ్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్లైమెట్ రిస్క్, మోడల్ వ్యాలిడేషన్, అనలిటిక్స్, మోడల్ డెవలప్‌మెంట్, ఎన్‌బీఎఫ్‌సీ అండ్ ఎఫ్ఐ సెక్టార్ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఎంఎస్ఎంఈ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్.

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ, సర్టిఫికెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.

దరఖాస్తు రుసుము: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

ఎంపిక విధానం: ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 8

వెబ్‌సైట్: https://www.bankofbaroda.in/career

లిటిల్స్



తల తిరిగే కొలువు

ఒక ఊరిలో వెంకన్న అనే ఓ వ్యక్తి ఉండేవాడు. అతనికి ఎప్పుడూ ఏదో నిరాశ. తనెంతో కష్టపడుతున్నానని అనుకుండేవాడు. అది కూడా తను చేసే పని రోడ్లను శుభ్రపరిచే కొలువు. ఆ ఊరికి దగ్గరలోనే రాజుగారు ఉండేవారు. ఆయన పాలనలోనే గ్రామాలన్నీ ఉండేవి. రాజుగారో, మంత్రిగారో వచ్చినప్పుడు.. శుభ్రంగా ఉండాలని వీధులను శుభ్రపరచటానికి ఇతను కూడా మిగతా పనివాళ్లతో కలసి వెళ్లేవాడు. తనెంతో గొప్ప వ్యక్తిని అవుతానని కలలు కనేవాడు. అయితే ఎవరూ పట్టించుకునేవారు కాదు అతని మాటలను.

వెంకన్న తన భార్య, పిల్లలను పోషించుకుంటూ జీవనం గడిపేవాడు. ఎంత బతికినా ఇంతే కదా! అని తిట్టుకునేవాడు. ఒక రోజు వెంకన్నకు రాజుగారి కొలువులో ఉద్యోగం వచ్చిందని ఒకభటుడు వచ్చి చెప్పాడు. తన ఊరు విడిచి పోవాలంటే వెంకన్నకు ఇష్టం లేదు. అదే రోజు రాజుగారి కొలువులోని




ఓ రాజాధికారి అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో రాజుగారు హుటాహుటిన సమావేశం ఏర్పరిచాడు. ఏదో వ్యక్తిని తీసుకోమని మంత్రిగారితో చెప్పాడు.

రాజుగారి బంధువులూ, కొందరు కొలువులోని మంత్రులు వారి బంధువుల పేర్లు ప్రస్తావించారు. ఆ కొలువు నాకే కావాలని అందరూ వాదించుకున్నారు. కొట్లాడుకున్నారు. ఎవరి సిఫారసు చెల్లదని మంత్రిగారు ఆ పంచాయితీని రాజుగారి దగ్గర పెట్టించారు. ఒక చిన్న కొలువుకు ఇంత తలనొప్పా? అంటూ రాజుగారు అందరినీ తిట్టారు. మీరు చిన్న కొలువుకోసం ఇంతలా కొట్లాడుకుని నా దగ్గరికి వచ్చారా? ఎవరికీ ఇవ్వను. తెలిసినవారికి అసలే ఇవ్వనని రాజుగారు ఆజ్ఞాపించారు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. వారంతా వెళ్లిపోయారు. వెంటనే మంత్రిగారికి రాజుగారు చెవులో ఇలా చెప్పారు. ఇది రహస్యంగా ఉంచాలి. రేపొద్దున మన రాజ్యంలోకి ఎవరు ముందొస్తారో వాళ్లదే ఈ కొలువు అన్నారు.

వెంకన్న ఆరేడు రోజులు కొలువు దగ్గరకు పోలేదు. రాజుగారి రాజ్యంలో పని చేయాలనే ఆశ లేదు అతనికి . భార్య, పిల్లలకోసం తప్పదనుకుని ఉదయాన్నే రాజుగారి కోటకు వచ్చారు. లోపలికి వస్తూనే అతన్ని 'రాజాధికారి'గా అక్కడి భటులు పిలిచారు. అతనికి అర్థమే కాలేదు. పైగా రాచరికపు దుస్తులు ఇచ్చారు. అవి ధరించాడు వెంకన్న. భటులు వచ్చి పల్లకీలో కూర్చోబెట్టారు. రాజుగారి దగ్గరకు తీసుకుపోయారు. 'అయ్యా.. చీపురు పని చేసేవాడిని' అని చెప్పాలనుకున్నాడు వెంకన్న. ఆ రాచమర్యాదలను చూసి మర్చిపోయాడు. తన గురించి రహస్యంగా ఉంచాడు. తన పేరు వెంకటాద్రిగా చెప్పుకున్నాడు.

వెంకన్నకు యోగం పట్టిందిరో.. అంటూ ఊరంతా వార్తలు వినిపించాయి. వెంకన్న భార్య రాజుగారి కోటకు పోయింది. వెంకన్న పల్లకీలో ఊరేగుతున్నాడు. తన భార్య వెళ్లి.. 'నువ్వు మా వెంకన్నవే కదూ' అని అడిగింది. 'అవునా.. నిన్ను మాత్రం నేనెరుగుదును. నన్ను తెలుసునని చెప్పకు. నా గురించి నాకే తెలీదు' అన్నాడు వెంకటాద్రి. వెంకన్న తలబిరుసు, పదవికి అతని భార్య మండిపడి ఇంటికి పోయింది. ఆ తర్వాత వెంకన్న చేష్టలు చూసి అందరూ అతని మీద ఫిర్యాదు చేశారు. అతని వాలకం ఏదోలా ఉందని రాజుకు అర్థమైంది. పూర్వం ఏమి చేశావు? అని అడిగాడు రాజుగారు. చీపురు పని చేసేవాన్ని అన్నాడు. మరి రాజాధికారిగా పని చేస్తావా? అని అడిగాడు రాజుగారు. నావల్ల కాదన్నాడు వెంకటాద్రి. ఇతని మీద ఇతనికే నమ్మకం లేదు తరిమేయండి ఇక్కడ నుంచి అని కోప్పడ్డారు రాజుగారు. తిరిగి ఊరికి పారిపోయాడు. అర్ధరాత్రికి ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి తలుపు కొట్టాడు. వెంకన్నను అన్నాడు. అవేమీ పట్టించుకోకుండా తన భార్య తలుపు మూసింది. రాత్రంతా చలికి గజగజా వణికిపోయాడు వెంకన్న. తనకు బుద్ధి వచ్చిన తర్వాతనే వెంకన్న భార్య అతనితో మాట్లాడింది.

6 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 239

		8						3
				5		6	8	
3	1		4			5		
2			5	7				
	9		8		6		3	
				4	2			6
		6			7		5	1
	7	9		3				
1						9		

సుడోకు - 238 సమాధానం

6	5	8	7	2	9	1	4	3
9	4	2	3	5	1	6	8	7
3	1	7	4	6	8	5	2	9
2	6	1	5	7	3	4	9	8
7	9	4	8	1	6	2	3	5
8	3	5	9	4	2	7	1	6
4	8	6	2	9	7	3	5	1
5	7	9	1	3	4	8	6	2
1	2	3	6	8	5	9	7	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.